నవతెలంగాణ
అంతర్జాతీయ మహిళా దినోత్సవ ప్రత్యేక సంచిక
08 మార్చి 2025 ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా

మహిళలు..మహారాణులు..!



- స్థానిక సంస్థల్లో 50శాతం రిజర్వేషన్లు అమలు
- ఉమ్మడి జిల్లాలో సగం మంది ప్రజాప్రతినిధులు వారే
- చట్టసభల్లోనూ 33శాతం రిజర్వేషన్లతో ప్రయోజనం
- ప్రభుత్వ పథకాల్లోనూ వారికే అధిక ప్రాధాన్యం
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. వంటింటికే పరిమితం కాకుండా ఉద్యోగ, రాజకీయ, సామాజిక సేవ రంగాల్లోనూ రాణిస్తూ ఎందులోనూ తాము తక్కువ కాదని నిరూపిస్తున్నారు. అవనిలో సగం..ఆకాశంలో సగమే కాదు..కొన్ని రంగాల్లో వారిదే పైచేయిగా నిలుస్తోంది. ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికల్లో 50శాతం రిజర్వేషన్లు అమలు జరుగుతుండటంతో సగం మంది ప్రజాప్రతినిధులుగా రాణిస్తున్నారు. మరోపక్క చట్టసభల్లోనూ 33శాతం రిజర్వేషన్లకు సంబంధించి బిల్లు ఆమోదం పొందడంతో అక్కడా వారి ప్రతిభను నిరూపించుకునేందుకు అవకాశం లభిస్తోంది. రైళ్లు, విమానాలు నడపడమే కాదు.. అంతరిక్షంలోనూ అడుగిడుతున్నారు. రాజకీయ రంగంలోనూ సత్తాచాటుతూ పాలకులుగా రాణిస్తున్నారు. మరోపక్క ప్రభుత్వాలు వీరి ప్రాధాన్యాన్ని గుర్తించాయి. ఆయా సంక్షేమ పథకాలను మహిళల పేరునే అమలు చేస్తున్నాయి.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఒకప్పుడు వంటింటికే పరిమితమైన అతివలు నేడు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. రాజకీయాల్లోనూ ప్రముఖ పాత్ర పోషిస్తున్నారు. ఉద్యోగాలు చేస్తూ కుటుంబాలను పోషించుకుంటూనే..రాజకీయాల్లోనూ తనదైన ముద్ర వేస్తున్నారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో 50శాతం రిజర్వేషన్లు అమలు చేయడంతో రాజకీయాల్లో కీలక పదవుల్లో రాణిస్తున్నారు. ప్రస్తుతం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 70మండలాలు ఉండగా 35మంది ఎంపీపీలు, జడ్పీటీసీలుగా పదవుల్లో కొనసాగుతున్నారు. వీరితో పాటు మంచిర్యాల, నిర్మల్ జడ్పీ ఛైర్‌పర్సన్‌లుగానూ వ్యవహరిస్తున్నారు. మరోపక్క ఉమ్మడి జిల్లాలో 1509 గ్రామ పంచాయతీలు ఉండగా ఇందులో సగం పంచాయతీల్లో మహిళలు సర్పంచ్‌లుగా రాణించారు. ఎప్పుడు ఎన్నికలు నిర్వహించినా స్థానిక సంస్థల్లో సగం మంది అతివలే పదవులు దక్కించుకోవడం సాధారణంగా మారుతుంది. వీటితో పాటు కొన్ని జనరల్ స్థానాల్లోనూ మహిళలు ఉన్నత పదవుల్లో రాణిస్తున్నారు.

చట్టసభల్లోనూ రిజర్వేషన్లు..!

రాజ్యాంగం ద్వారా ఇది వరకు స్థానిక సంస్థల్లో 50శాతం రిజర్వేషన్లు పొందిన మహిళలు నేడు చట్టసభల్లోనూ మరింత మంది అడుగుపెట్టేందుకు ఆస్కారం ఏర్పడింది. కేంద్రప్రభుత్వం మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించేందుకు ఇటీవల పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టింది. ఈ బిల్లుకు ఒకటిరెండు పార్టీలు మినహా అన్ని రాజకీయ పార్టీలు అంగీకారం తెలుపడంతో బిల్లు ఆమోదం తెలిపింది. దీంతో చట్టసభల్లోనూ వీరికి 33శాతం రిజర్వేషన్ అమలు కానుంది. ప్రభుత్వం ఈ రిజర్వేషన్లను 2026 నుంచి అమలు చేయాలని నిర్ణయించింది. దీంతో ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో పది అసెంబ్లీ స్థానాలు ఉండగా.. ఇందులో ఏకంగా 4 స్థానాలు మహిళలకు కేటాయించాల్సి ఉంటుంది. శాసనసభ స్థానాలు పెరిగితే వాటి ప్రకారం కూడా మహిళలకు అవకాశం దక్కేందుకు ఆస్కారం ఉంటుంది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో ఓటర్ల పరంగానూ పురుషుల కంటే మహిళలే అధికంగా ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 22లక్షల మంది ఓటర్లలో పురుషులు 10లక్షలకు పైగా ఉండగా మహిళలు 11లక్షల పైన ఉండటం గమనార్హం. సిర్పూర్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో తప్పితే మిగితా ఎనిమిదింటిలోనూ మహిళా ఓటర్లే ఆధిక్యంలో ఉన్నారు.

పథకాల్లోనూ వారికే ప్రాధాన్యం..!

ప్రభుత్వ పథకాల్లోనూ మహిళలకే ప్రాధాన్యం దక్కుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు మహిళల పేర్లు అధికంగా పెడుతున్నాయి. గత ప్రభుత్వం మొదలుకొని తాజాగా కాంగ్రెస్ సర్కారు సైతం వారికే అగ్రతాంబూలం అందిస్తోంది. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, గృహజ్యోతి, గృహలక్ష్మీ, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులతో పాటు మహిళా శక్తి పేరుతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

యూనిఫాంతో సమాజంలో గుర్తింపు

- సవాళ్లను స్వీకరిస్తూ సమర్థత నిరూపించుకుంటున్న మహిళలు

నవతెలంగాణ-మంచిర్యాల

పోలీస్ యూనిఫాం వల్ల తమకు సమాజంలో గుర్తింపు, గౌరవం, రక్షణ లభిస్తున్నాయని పేర్కొంటున్నారు పోలీస్ శాఖలో పని చేసే మహిళా పోలీసులు. పోలీసు ఉద్యోగమంటేనే సవాళ్లతో కూడుకున్నది. రాత్రి, పగలు అనే తేడా ఉండదు. ఎప్పుడు ఎవరికి ఏ కష్టమొచ్చినా సత్వరమే స్పందించాలి. శాంతి భద్రతలు పరిరక్షించి ప్రజలకు భరోసా కల్పించాలి. ఇదంతా సులువైన విషయమేమీ కాదు. కానీ ఈ సవాళ్లనూ సులువుగా అధిగమిస్తున్నారు మహిళా పోలీసులు. ఇప్పుడిప్పుడే రాష్ట్రంలోని పోలీస్ శాఖలో వారి ప్రాతినిధ్యం పెరుగుతోంది. శాంతి భద్రతలు కాపాడే విధులైనా.. ట్రాఫిక్ విభాగం బాధ్యతలైనా సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు.

పోలీస్ విభాగంతోపాటు ఇతర యూనిఫాం ఉద్యోగాలు పురుషులే చేయగలరన్న అపోహలు క్రమంగా తొలగిపోతున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఖాకీ దుస్తుల్లో కనిపించే మహిళల సంఖ్య ఎన్నోరెట్లు పెరిగింది. కానిస్టేబుల్, ఎస్సై తదితర ఉద్యోగాల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించటంతో వేల మంది మహిళలు పోలీస్ ఉద్యోగాల్లో చేరారు. పెట్రోలింగ్ మొదలు నేర పరిశోధన వరకు ఏ పనిలోనైనా సత్తా చాటుతున్నారు. ఆర్మ్‌డ్ రిజర్వ్(ఏఆర్) వంటి సాయుధ బలగాల్లోనూ మహిళల సంఖ్య పెరుగుతోంది. అడిషనల్ డీజీ నుంచి కానిస్టేబుల్ వరకు అన్ని ర్యాంకులలోనూ మహిళా పోలీసుల హవా కొనసాగుతోంది.



రిస్క్‌తో పాటు గౌరవం :

శ్వేత, ఎస్ఐ, భీమారం

మహిళలకు పోలీస్ డిపార్ట్మెంట్‌లో రిస్క్‌తో పాటు గౌరవం ఉంటుంది. తోటి అధికారులతో పోలిస్తే పెట్రోలింగ్, కోర్టు డ్యూటీలు తదితర అన్ని పనుల్లోనూ ముందుకు వెళ్తున్నాం. ప్రత్యేకించి ఉన్నత అధికారుల ప్రోత్సహం బాగుంటది. పోలీస్ డిపార్ట్మెంట్‌లో మహిళల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఒక పోలీస్ అధికారికి సమాజంలో ఎంతో మందికి సహాయం చేసే అవకాశం ఉంటుంది. అదే మహిళ అధికారులు ఉంటే బాధిత మహిళలు ధైర్యంగా తమ దగ్గరికి వచ్చి సమస్య చెప్పుకోవచ్చు. సమస్యలు త్వరగా పరిష్కారమయ్యే అవకాశం ఉంటుంది.



బాధితుల్లో సంతోషం చూస్తే తృప్తి :
హైమ, షీ టీమ్ ఎస్ఐ, మంచిర్యాల

సమస్యలున్నాయని ఎంతో మంది బాధితులు నిత్యం తమ దగ్గరికి వస్తుంటారు. వారి సమస్యలు తీరక వారిలో కలిగిన సంతోషాన్ని చూస్తే తృప్తి కలుగుతుంది. షీ టీం విభాగంలో పని చేయడం ఆనందంగా ఉంది. మహిళల రక్షణ వారిలో ఆత్మస్థైర్యం నింపేలా నిత్యం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. కాలేజీల వద్ద అమ్మాయిలను ఏడ్పించే వారిని అదుపులోకి తీసుకొని కౌన్సెలింగ్ నిర్వహిస్తాం. మర్నాడు అమ్మాయిలు స్వేచ్ఛగా ఉంటారు. ముఖ్యంగా మహిళలు రక్షణ కొరకు పని చేయడం అనేది ఆనందంగా ఉంది.

మగవాళ్లతో సమానంగా పని చేస్తాం : జ్యోతి, మహిళా కానిస్టేబుల్



డ్యూటీ పరంగా చాలా రకాల ఒత్తిళ్లు ఉంటాయి. కానీ మగవారితో సామానంగా పోటీపడి పని చేస్తాం. మహిళలం అన్న సాకు ఎప్పుడూ చెప్పలేదు. 24గంటల డ్యూటీ అయినా వెనుకడుగు వేయలేదు. డిపార్ట్మెంట్‌లో సీనియర్ అధికారులు ఎంతో ప్రోత్సహిస్తారు. డిగ్రీ చదివే సమయంలో ఉద్యోగం వచ్చింది. దానికి తోడు కుటుంబ సభ్యుల సపోర్ట్ దొరికింది. కుటుంబానికి మన వంతు సహకారం అందిస్తున్నామన్న సంతృప్తి ఉంటుంది.

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.

కళాశాలలో మహిళలకు సన్మానం

ఆదిలాబాద్‌టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కళాశాలలో పనిచేస్తున్న ప్రిన్సిపాల్‌తో సహా మహిళా అధ్యాపకులు, సిబ్బంది, ఆఫీస్ సబార్డినేట్‌లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జె.సంగీత మాట్లాడుతూ మహిళలు వివక్ష ఎదుర్కొంటున్నప్పటికీ తమ సహనశీలతతో సమాజంలో నేడు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. మహిళలు, పురుషులు ఒకరికొకరి సహకారంతోనే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రావణి, శ్రీధర, జోత్స్న, సలేహా, అఫ్రీన్, సుమయ్య, రాధా, బోధనేతర సిబ్బంది సుజాత, వనిత, సునీత, శోభ, సవిత, సావిత్రి, అజీజా, సుల్తానా, వైస్ ప్రిన్సిపల్ జగ్రామ్ అంతర్వేది, అరుణ్ కుమార్, సంతోష్ కుమార్, చక్రవర్తి, అష్రఫ్ అలీ, విద్యార్థులు పాల్గొన్నారు.



రేపు సావిత్రిబాయి ఫూలే వర్ధంతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు క్రాంతి జ్యోతి సావిత్రిబాయి పూలే 128వ వర్ధంతి కార్యక్రమాన్ని ఈ నెల 10న జరుపుకొని సావిత్రిబాయి పూలే సేవలను కొనియాడాలని రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పేట్కులే శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాలీ మహా సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 7:30కు జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ ఆవరణలో పూలే దంపతులు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించాలని పేర్కొన్నారు. ఆ తర్వాత రాత్రి సావిత్రిబాయి పూలే మాలి మహిళా మండలి ఆధ్వర్యంలో పూలే విశ్రాంతి భవనం, టీచర్స్ కాలనీలో కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి మహిళా సంఘ సభ్యులందరూ కుటుంబ సమేతంగా హాజరై సావిత్రిబాయి పూలేకు కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించడం జరుగుతుందన్నారు. ఆ తర్వాత వక్తల ప్రసంగాలు ఉంటాయని పేర్కొన్నారు. సావిత్రిబాయి పూలే వంశానికి చెందిన డాక్టర్ దిలీప్ నేవసే పాటిల్ సాతార వారి సౌజన్యంతో అన్నదాన మహా ప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

ప్రతి మహిళ విజయం వెనుక పురుషుడు



ఆదిలాబాద్‌టౌన్: ప్రతి మహిళ విజయం వెనక పురుషుడు ఉంటాడని, వారి ప్రోత్సాహం లేక మహిళలు రాణించలేరని డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళ దినోత్సవ ప్రత్యేక గురించి వివరించారు. సమాజంలో నేడు మహిళలు పురుషులతో సమానంగా రాణిస్తున్నారని, అలాంటి వారికి పురుషుల నుంచి ఎంతో ప్రోత్సహం ఉంటుందని తెలిపారు. మార్చి 8న మహిళ దినోత్సవం రోజున వేడుకలు జరుపుకోవడం, సత్కరాలు, సన్మానాలు చేసుకోని వెళ్లి పోతున్నామన్నారు. కానీ మహిళలు గౌరవించినప్పుడే దాని సార్ధకత ఉంటుందన్న విషయాన్ని గ్రహించాలన్నారు. ఇంట్లోని మహిళలను కుటుంబంలోని మహిళలతో పాటు ఇతరులు కూడా గౌరవించాలన్నారు. మహిళల రక్షణ కోసం గతంలో అనేక చట్టాలు అప్పటి పరిస్థితులను బట్టి రూపొందించారన్నారు. మారుతున్న కాలం, పెరుగుతున్న సాంకేతిక కారణంగా చట్టాల్లో మార్పు రావాల్సిన ఉందన్నారు. ఇప్పటికే అన్ని రకాలకు సంబంధించిన ఐదు వేలకు పైగా చట్టాలు అమల్లో ఉన్నాయన్నారు. సైన్స్, సాంకేతికత వినియోగం పెరిగిన నేపథ్యంలో దర్యాప్తులో కూడా ఫోరెన్సిక్ సైన్స్, కంప్యూటర్ ఇన్విస్టిగేషన్ కూడా జరుగుతున్నాయన్నారు. చట్టాల గురించి తెలుసుకోవడంతో వాటిని ఇతరులకు తెలియజేయాలన్నారు. మహిళ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరు మహిళాలను గౌరవించేలా ప్రతిజ్ఞ చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.అతిక్ బేగం, న్యాయవాది సుస్మిత, ఆర్తి, వైస్ ప్రిన్సిపల్ రఘు గణపతి, మహిళా సాధికారత విభాగం కన్వీనర్ టి.స్వప్న, మహిళా అధ్యాపకులు రేఖ, అనిత, సంతోషిని, సౌజన్య, భువన, సోనీ, పూనం, సిబ్బంది ఎన్ఎస్ఎస్ క్యాడెట్లు, ఎన్ఎస్ఎస్ వాలంటరీలు విద్యార్థులు పాల్గొన్నారు.

కనీస మద్దతు ధరల చట్టం తీసుకురావాలి



నిర్మల్‌టౌన్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక కార్పొరేట్ అనుకూల విధానాలపై సంయుక్త కిసాన్ మోర్చా పోరాటం కొనసాగిస్తుందని సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు నంది రామయ్య, దుర్గం నూతన్‌కుమార్ అన్నారు. సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేసి ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతాంగం నడ్డి విరుస్తూ వ్యవసాయ రంగం మొత్తాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పే కుట్రలు పన్నుతోందని విమర్శించారు. మూడు చట్టాల రద్దును దొంగ దారిలో జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ ముసాయిదా పేరుతో తీసుకొని రావడం చూస్తుంటే మోడీ ప్రభుత్వం ఎవరికోసం పనిచేస్తున్నదో తెలుస్తున్నదని విమర్శించారు. రైతాంగం పండించిన పంటలకు మద్దతు ధరలు దొరకక అప్పుల పాలై అనేకమంది ఆత్మహత్యలు చేసుకుంటుంటే మద్దతు ధరల చట్టం చేయమని అడుగుతుంటే వీటి గురించి పట్టించుకోని మోడీ కార్పొరేట్ల కోసం మాత్రం వేగంగా వ్యవసాయ రంగంలో మార్పులు తీసుకొస్తున్నాడని పేర్కొన్నారు. కనీస మద్దతు ధరల చట్టం చేసే వరకు రైతాంగం సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో పోరాటాన్ని కొనసాగిస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు జె.రాజు, కె.రాజన్న, డాకూర్ తిరుపతి, నాగెల్లి నర్సయ్య, భూక్యా విలాస్, గంగారాం, గోరేభాయ్, సుందర్, దేవ్‌రావు, మోహన్, రాజేష్, గంగాధర్ పాల్గొన్నారు.

బిల్లు ఆమోదించడాన్ని వ్యతిరేకిస్తున్నాం

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ అసెంబ్లీ సమావేశంలో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఖండిస్తున్నట్లు మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పుల రమేష్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏకపక్షంగా వ్యవహరిస్తూ ఒక వర్గానికి మాత్రమే మద్దతుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మాలలు ముందు నుంచి కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తూ వస్తున్నారు కానీ ముఖ్యమంత్రి మాలలపై అక్కసుతో అన్యాయం చేస్తూ సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఏకసభ్య కమిషన్ గడువు పెంచి గడువు ముగియకుండానే శాసనసభలో వర్గీకరణ బిల్లును ఆమోదింపజేయడం అంటే కమిషన్‌ను అవమానించడమేనని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వర్గీకరణ గురించి పునరాలోచించాలని కోరారు. సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షులు మేకల మల్లన్న, అసోసియేట్ అధ్యక్షులు పాశం రాఘవేంద్ర, దేవన్న, అశోక్, స్వామి, భూమన్న ఎన్.నర్సిములు, ఎ.రాములు, ఎ.పొచ్చన్న, కె.రాజు, రాళ్లబండి శంకర్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



సారంగాపూర్: మలక్ చించోలి గ్రామంలో వందన హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. దుర్గాప్రసాద్, ఎండి ఫిజీషియన్, మేనేజ్మెంట్ వల్ల కొండ సురేష్, సతీష్ కుమార్, మైస శేఖర్ ఆధ్వర్యంలో శిబిరానికి వచ్చిన 300 రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు కాల్వ నరేష్, అంబటి గంగాధర్, కార్తీక్, గుండ రమేష్, హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

శాంపుల్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

నిర్మల్‌టౌన్: పంచశీల్ బీఎడ్ కాలేజీలో రెండు రోజులుగా జరుగుతున్న ఎఫ్ఎల్ఎన్ రెండవ తరగతి శాంపుల్ సర్వే శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి పి.రామారావు సందర్శించారు. ఈ నెల 10,11,12 తేదీలలో పాఠశాల స్థాయిలో 50 పాఠశాలల్లో జరిగే శాంపుల్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఏఎంఓ నర్సయ్య, పర్యవేక్షకులు వెంకటరమణ, డీసీఈబి అసిస్టెంట్ సెక్రటరీ భానుమూర్తి, రిసోర్స్ పర్సన్లు గంగాదాస్, సంగీత పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి : డాక్టర్ వసుంధర

కుభీర్: ప్రస్తుత కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు ప్రత్యేక స్థానాన్ని కల్పించడంతో అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ వసుంధర అన్నారు. మహిళా దినోత్సవ సందర్భంగా నవతెలంగాణతో మాట్లాడారు. మహిళలు రాజకీయ, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో ముందుండాలని తెలిపారు. పురుషులతో సమానంగా మహిళలకు ప్రభుత్వాలు సమన హక్కులు కల్పిస్తున్నాయన్నారు. అందుకని వంట రూమ్‌కే పరిమితం కాకుండా హక్కులపై అవగాహన కల్గి ఉండాలన్నారు. ఏ సమస్య వచ్చినా ధైర్యం కోల్పోకుండా ముందుకు సాగాలని సూచించారు.

నేడు జాతీయ లోక్‌అదాలత్

నిర్మల్‌టౌన్ : జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆధ్వర్యంలో శనివారం నిర్మల్ జిల్లా కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తునట్లు జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఐ.కర్ణ కూమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని కోర్టు భవన సముదాయాల్లో జరిగే ఈ జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సివిల్ కేసులతో పాటుగా రాజీపడదగిన అన్ని కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు.

నిరంతర సేవ..వీరి తోవ..!

- ప్రజల ఆరోగ్య పరిరక్షణలో కీలకపాత్ర
- ఆదర్శంగా నిలుస్తున్న స్కీం వర్కర్లు
- మహిళా దినోత్సవాన పలువురి ప్రశంసలు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

వారంతా ప్రభుత్వ సెక్టార్‌లో పనిచేస్తున్న చిరుద్యోగులు. అరకొర వేతనాలు, అనేక అవస్థలు ఎదురవుతున్నా వాటిని తట్టుకొని సేవాభావమే లక్ష్యంగా విధులు నిర్వర్తిస్తున్నారు. నిరంతరం ప్రజా సేవే పరమావధిగా భావిస్తూ వారి ఆరోగ్య పరిరక్షణకు పాటుపడుతున్నారు. ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలతో పాటు సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రజలకు అండగా నిలుస్తున్నారు అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, మధ్యాహ్న భోజన కార్మికులు. ఈ విభాగాల్లో పనిచేసే వారంతా మహిళలే కావడం.. ఆయా పనులను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ సమాజాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నారు. శనివారం అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం వేల ప్రజలకు వీరు అందిస్తున్న సేవలపై నవతెలంగాణ ప్రత్యేక కథనం..

ఆరోగ్య పోషకులు అంగన్‌వాడీలు

కేంద్రప్రభుత్వం గర్భిణీలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ఐసీడీఎస్‌లను ఏర్పాటుచేసింది. వీటి పరిధిలో పనిచేస్తున్న అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, సహాయకులు ఎనలేని సేవలందిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 8వేల మందికి పైగా పనిచేస్తున్నారు. నిరంతరం గర్భిణీలు, బాలింతల ఆరోగ్యాన్ని పర్యవేక్షించడం, ..పిల్లలు పుట్టిన తర్వాత 6ఏండ్ల వరకు టీకాలు వేయించడంతో పాటు ఆటపాటల ద్వారా ప్రాథమిక విద్య నేర్పించడం, పౌష్టికాహారాన్ని అందిస్తూ వారి ఆరోగ్య పరిరక్షణకు పాటుపడుతున్నారు. ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల్లోనూ వీరు భాగస్వాములై లబ్ధిదారులకు వాటిని అందించేలా కృషిచేస్తున్నారు.

నిరంతరం సేవలోనే ఆశా కార్యకర్తలు

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఆశా కార్యకర్తలు నిరంతరం ప్రజా సేవలోనే ఉంటున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 4వేల మందికి పైగా ఉన్న వీరు ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. గర్భిణీలకు నెలవారీ పరీక్షలు చేయించడం, పిల్లలకు టీకాలు వేయించడం, బీపీ, షుగర్, టీబీ వ్యాధిగ్రస్తులకు ఇంటికి వెళ్లి మందులు అందిస్తుంటారు. చిన్నారులకు ఐరన్ సిరప్‌లు వేయడం, డ్రై, ఫ్రైడే వంటి కార్యక్రమాలు చేపడుతూ సీజనల్ వ్యాధులను అరికట్టడంలో కృషిచేస్తున్నారు. కోవిడ్ సమయంలో వీరు అందిస్తున్న సేవలను డబ్ల్యూహెచ్ఓ గుర్తించి గ్లోబల్ హెల్త్ పురస్కారాన్ని అందించింది.

ప్రజారోగ్య రక్షకులు ఏఎన్ఎంలు

ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఆరోగ్య కార్యకర్తలు(ఏఎన్ఎం)కీలక పాత్ర పోషిస్తున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పీహెచ్‌సీలు, సబ్ సెంటర్ల పరిధిలో పనిచేస్తున్న వీరు నిరంతరం ప్రజల ఆరోగ్యంపై దృష్టిసారిస్తున్నారు. బీపీ, షుగర్ పరీక్షలు చేయడం, వారి వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం మందులు అందిస్తున్నారు. ఒక్కో ఏఎన్ఎం పది గ్రామాల పరిధిలో పనిచేస్తూ నిరంతరం ప్రజాసేవలోనే ఉంటున్నారు. గర్భిణీలు, చిన్నారులకు టీకాలు వేయడం, ప్రజలకు ఆరోగ్యం, పారిశుధ్య చర్యలపై అవగాహన కల్పించడం, ప్రభుత్వం చేపడుతున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాల్లో భాగస్వాములు అవుతూ సమాజాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నారు.





చిన్నారుల ఆకలి తీరుస్తున్నారు

సర్కారు బడుల్లో చదివే చిన్నారుల ఆకలి తీర్చటంలో మధ్యాహ్న భోజన కార్మికుల కృషి ఎనలేనిది. ఉమ్మడి జిల్లాల్లో సుమారు 5వేల మంది వరకు ప్రభుత్వ బడుల్లో పనిచేస్తుండగా ప్రతినిత్యం పిల్లలకు భోజనం పెడుతున్నారు. ప్రభుత్వాలు అందిస్తున్న అరకొర గౌరవం అందిస్తున్నా బిల్లులు సకాలంలో రాకపోయినా పిల్లలకు మాత్రం మధ్యాహ్న భోజనం వండి పెడుతున్నారు. సొంత పిల్లల్లా భావించి రుచికరమైన భోజనం పెడుతూ వారి కడుపు నింపుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

మాకేం తక్కువ..మేమూ చేయగలం..!

- అటవీ ఉద్యోగాల్లో మహిళల సత్తా

నవతెలంగాణ-మంచిర్యాల

కారడవిలో ఉద్యోగం.. కర్తవ్యంతో పాటు స్వీయరక్షణ, వన్యప్రాణుల్ని కాపాడడం, వేటగాళ్లను ఎదుర్కోవాలి, స్మగ్లర్లు, ఫైర్ నుంచి అటవీ సంపదను పరిరక్షించాలి. ఎప్పుడు ఎలాంటి ఆపద ముంచుకొస్తుందో తెలియదు. అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ రాత్రింబవళ్లు తేడా లేకుండా 24 గంటలు అందుబాటులో ఉంటున్నారు. పురుషులకే సవాల్‌గా మారిన ఈ అటవీ శాఖ ఉద్యోగాల్లో అతివలు దూసుకుపోతున్నారు. సహనానికి ప్రతీక అయిన మహిళలు భయం లేకుండా అటవీ ఉద్యోగాల్లోనూ రాణిస్తున్నారు. కాదేది మహిళలకు అడ్డంకి అని అటవీ శాఖలోని ఉద్యోగాల్లో దూసుకు పోతున్నారు మన ఈతరం ఇల్లాల్లు. దట్టమైన అడవుల్లో క్రూర మృగాలు తిరిగే అభయరాణ్యల్లో అటవీ శాఖ ఉద్యోగాల్లో పని చేస్తూ ప్రశంసలు పొందుతున్నారు నేటి మహిళలు.



ఇష్టంగా చేస్తున్నాం : సుష్మారావు, రేంజ్ ఆఫీసర్. తాళ్లపేట



2013లో అటవీ శాఖ ఉద్యోగంలో చేరాను. అంత అయోమయంగా ఉండేది. బేస్ క్యాంప్ ఎప్పుడు ఎక్కడ ఉంటుందో తెలియకపోయేది. చాలా భయంగా ఉండేది. కెమెరా ట్రాపింగ్‌తో జంతువుల కదలికలు కనిపెట్టాలి. అడవిలో తిరుగుతున్నపుడు ఎటునుండి ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియక పోయేది. కానీ అడవిలో తిరుగుతున్నంత సేపు కొత్త కొత్త విషయాలు తెలిసేవి కాబట్టి మరింత తెలుసుకోవాలనే ఆసక్తితో ముందుకు నడక సాగించేది. రాత్రి సమయంలో డ్యూటీ అంటే కొంత భయం వేసినా అందుబాటులో వాచర్స్, అదికారులు ఉండేవారు. అటవీ సంపదను, జంతువులను వేటగాళ్ల ఉచ్చులో నుండి కాపాడడంలో సంతోషం అనిపిస్తుంది. కొంచం కష్టం అయినా ఇష్టంగా వృత్తిలో కొనసాగుతున్నాం.

భార్యాభర్తలం అటవీ శాఖలో పని చేస్తాం : పిల్లలమర్రి సునీత, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్, హాజీపూర్ సెక్షన్



గతంలో ఉన్నట్లు ఇప్పుడు లేదు. ఇప్పుడు అటవీ శాఖలో చాలా రూల్స్ వచ్చాయి. అంతకు తగ్గట్లుగానే రక్షణ చర్యలు సైతం ఏర్పాటు చేశారు. కొన్ని సందర్భల్లో గ్రామస్తులతో సమస్యలు ఏర్పడేవి. స్మగ్లర్ల నుండి అటవీ సంపదను కాపాడడం అనేది చాలా రిస్క్‌తో కూడుకున్నది. టైగర్ ట్రాకింగ్ చేయడం అనేది చాలా కష్టం. అయినా తప్పదు. మొదట్లో ఒక్కదాన్నే అటవీ శాఖలో పని చేసేది. నన్ను ఇన్స్పిరేషన్‌గా తీసుకొని మా అయన కూడా అటవీ శాఖలో ఉద్యోగంలో చేరాడు. ఇప్పుడు భార్యాభర్తలం ఇద్దరం సంతోషంగా ఉద్యోగాలు చేస్తున్నాం.

భయం లేదు : మర్రి రజిత(బీట్ ఆఫీసర్) మంచిర్యాల రేంజ్



బిటెక్ పూర్తి చేసుకొని ఎస్ఐ అవ్వాలని ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతున్న సమయంలో అటవీ శాఖలో ఉద్యోగం వచ్చింది. 2019లో ఉద్యోగంలో చేరాను. మొదట్లో చాలా భయం వేసేది. అడవిలోకి వెళ్లాలంటనే ఆలోచించేది. అడవిలో తిరిగే సమయంలో వన్యప్రాణులు, జంతువుల అరుపులు వినబడతాయి. అలాంటి సమయంలో ఎక్కడి నుండి ఎలాంటి హాని కలుగుతుందోననే భయం మొదట్లో చాలా ఉండేది. కానీ అవేవి ఇప్పుడు లేవు. ధైర్యంగా ఒక్కదాన్ని అయినా అడవిలోకి వెళ్లగల్గుతున్న. రాత్రి సమయాల్లో హెల్పింగ్ స్టాఫ్ ఉంటారు. ఉన్నతాధికారుల సూచనలు, పలు ట్రైనింగ్‌ల అనంతరం భయం అనేది పోయింది. స్వేచ్ఛగా అడవిలో విధులు నిర్వర్తిస్తున్న.

అవార్డు రావడం సంతోషం : వొజ్జల సౌజన్య, బీట్ ఆఫీసర్(ముదిగుంట బీట్)



మొక్కల సంరక్షణ, ప్లాంటేషన్‌లో జిల్లాలో మొదటి వరుసలో నిలిచాను. అందుకుగాను 2017లో హరిత మిత్ర అవార్డు లభించింది. అవార్డు రావడం సంతోషం కల్గించింది. మొదట్లో అటవీ శాఖలో ఉద్యోగం అంటే నేను చేయలేనేమో అనిపించేది. గతంలో ఒకసారి టైగర్ నా బీట్‌లోకి ప్రవేశించింది. అప్పుడు పులి కదలికలు కనిపెట్టడానికి చాలా కష్ట పడ్డాను. వర్షంలో రాత్రి పూట విధులు నిర్వర్తించాను. అప్పడప్పుడు ఆవులు, మేకలపై చిరుత పులులు దాడి చేస్తూ ఉంటాయి. అప్పుడు వాటి యజమానులకు నష్టపరిహారం అందించాల్సి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో కష్టతరంగా ఉన్నా ఉన్నతాధికారుల మోటివేషన్, సూచనలు వింటూ పని చేస్తూ ఉంటాం. అటవీ శాఖలో ఉద్యోగం చేయడం అనేది గర్వంగా అనుకుంటాను.

నారి శక్తి ఆదర్శం



నవతెలంగాణ-నస్పూర్

పేద, మధ్య తరగతి కుటుంబానికి చెందిన మహిళలు స్వశక్తితో ముందుకు సాగుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పెరిగిన ధరలతో ఇంట్లో ఒకరే కష్టపడితే పూట గడవడం కష్టమని భావించిన మహిళలు చిన్న తరహా, పెద్ద వ్యాపారాలు చేస్తూ కుటుంబానికి చేదోడు వాదోడుగా నిలుస్తున్నారు. ధైర్యంగా అడుగు ముందుకు వేసి శ్రమిస్తే ఆర్థికంగా నిలదిక్కుకోవడం కష్టమేమి కాదని నిరూపిస్తున్నారు. నిరంతరం శ్రమించడం ద్వారా వ్యాపారాల్లో ముందుకు వెళ్తామని ఆత్మవిశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. పురుషులతో తామేమీ తీసిపోకుండా సమానంగా ముందుకు సాగుతున్నారు. శనివారం మహిళా దినోత్సవ సందర్భంగా మహిళలపై ప్రత్యేక కథనం..

శ్రీరాంపూర్ ఏరియాకు చెందిన దొమ్మెటి రజిత ఉన్నత చదువులు చదివింది. ఎంఎస్‌సీ, ఎంఏ పూర్తి చేసింది. కొంత కాలం ఉపాధ్యాయురాలిగా రాణించింది. కాని తనకు ఇష్టమైన రంగంలో రాణించాలని ఉపాధ్యాయ వృత్తిని వదిలేసింది. తన అభిప్రాయాన్ని భర్త శ్రీనివాస్‌కు తెలుపడంతో తనని అర్థం చేసుకొని సాయిరాం మగ్గం వర్క్ షాపు పెట్టుకోవడానికి ప్రోత్సహించాడు. తనని 8 సంవత్సరాల క్రితం మహిళ సంఘాల గ్రూపులో సభ్యురాలిగా చేర్పించాడు. వెంటనే బ్యాంకు రుణం రూ.4లక్షలు ఇప్పించడంతో షాపును ప్రారంభించారు. మొదట షాపులో ఇద్దరు వర్కర్లతో మొదలు పెట్టారు. ప్రస్తుతం దినదిన అభివృద్ధి చెందుతూ 6గురికి ఉపాధి కల్పిస్తుంది. ప్రతి నెల సుమారుగా రూ.30వేలు సంపాదించి మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ఆదర్శంగా నిలుస్తోంది. తనకు ఇష్టమైన రంగంలో రాణిస్తూ తన ఉత్పత్తులను (మగ్గం డిజైన్స్) రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించడంతో పాటు 10 మందికి ఉపాధి కల్పించడమే తన లక్ష్యమని తెలిపింది. దీని కోసం ప్రత్యేకంగా ఒక వెబ్‌సైట్ ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి వ్యాపార నిమిత్తం రుణాలు ఇస్తూ ప్రోత్సహిస్తున్న ప్రభుత్వానికి రుణపడి ఉంటానని తెలిపారు.



నెలకు రూ.20వేలు సంపాదిస్తున్నా : అలీం, కలకత్తా

నేను ఉపాధికోసం కలకత్తా నుంచి శ్రీరాంపూర్‌కు వచ్చాను. సాయిరాం మగ్గం వర్క్ షాపు యజమాని నాకు వసతి కల్పించడంతో పాటు ఉపాధి ఇవ్వడం సంతోషంగా ఉంది. నెలకు రూ.20వేల వరకు సంపాదిస్తున్నాను. ఉపాధి కల్పించినందుకు సాయిరాం మగ్గం వర్క్ యజమాని రజితకు కృతజ్ఞతలు.

భర్తకు చేదోడు వాదోడుగా : కళ

సాయిరాం మగ్గం వర్క్ షాప్‌లో ఉపాధి పొందడంతో భర్తకు ఆర్థికంగా చేదోడువాదోడుగా నిలుస్తున్న. కుటుంబంలో ఒకరి సంపాదనతో పిల్లల ఉన్నత చదువులకు భారం కాకూడదనే ఉద్దేశంతో షాప్‌లో వర్క్ చేస్తున్న. ఉపాధి కల్పించినందుకు యజమానికి కృతజ్ఞతలు.

రేపు పద్మశాలి మహాసభ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో 17వ అఖిల భారత పద్మశాలి మహాసభ, 8వ తెలంగాణ ప్రాంత పద్మశాలి మహాసభ ఆదివారం ఉదయం 10 :30గంటలకు హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నామని తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు బేత రమేష్, జిల్లా అధ్యక్షులు జక్కుల సత్యనారాయణ అన్నారు. పద్మశాలి మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో మహాసభ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాలో మెగా టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేయాలని, ఆసిఫాబాద్-కుమురం భీం జిల్లాలో నూతనంగా నిర్మిస్తున్న మెడికల్ కాలేజ్‌కు ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ పేరు పెట్టాలని మహాసభలో తీర్మానిస్తామని తెలిపారు. పద్మశాలి కుల బాంధవులు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని మహాసభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రాంతం పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు జక్కుల సత్యనారాయణ, నాయకులు జిట్ట రమేష్, తాలూకా పద్మశాలి సంఘం అధ్యక్షులు బొమ్మకట్టి రమేష్, చేనేత పద్మ సమైక్య జిల్లా అధ్యక్షులు మోర ఆశన్న, ప్రధాన కార్యదర్శి దాసరి రమేష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని చింతగూడ గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో పంద్ర గంగాధర్ ఇల్లు అగ్నిప్రమాదంలో కాలిపోయింది. శుక్రవారం విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ చింతగూడ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పంద్రం గంగాధర్ ఇంటిని పరిశీలించారు. అగ్ని ప్రమాదం సంభవించడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తనవంతుగా సాయంగా రూ.10వేలు బాధిత కుటుంబానికి అందజేశారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.



మెనూ ప్రకారం భోజనం అందించాలి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శుక్రవారం మండలంలోని హీరాపూర్ కేజీబీవీ హాస్టల్‌ను సందర్శించారు. వంట గదిలోకి వెళ్లి వంటలను పరిశీలించారు. వంట రుచులను ఆస్వాదించారు. ఏ రోజు కారోజు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వెంట ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ ఉన్నారు.



మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

• కలెక్టర్ అభిలాష అభినవ్



నవతెలంగాణ-నిర్మల్

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మహిళా శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని శివాజీచౌక్ నుంచి ఎన్టీఆర్ మినీ స్టేడియం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ జెండా ఊపి ప్రారంభించారు. బేటి బచావో బేటి పడావో, మహిళా సాధికారిక నినాదాలతో ర్యాలీని నిర్వహించారు. ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. మహిళలందరూ స్వశక్తితో జీవితంలో ఉన్నతంగా ఎదగాలని తెలిపారు. నేడు ప్రపంచవ్యాప్తంగా మహిళలు అన్ని రంగాలలో పురుషులతో సమానంగా పోటీ పడుతున్నారని అన్నారు. ప్రత్యేకంగా నిర్మల్ జిల్లాలో ఉన్నత స్థాయిలో అధికారులందరూ మహిళలే ఉన్నారని, ఇది చాలా గొప్ప విషయమని తెలిపారు. మహిళా సాధికారితకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలను అమలుపరుస్తున్నాయని, అర్హులైన వారందరూ పథకాలాన్నింటినీ ఉపయోగించుకొని ఆర్థికంగా బలపడాలన్నారు. ఆడపిల్లల కోసం బేటి బచావో బేటి పడావో కార్యక్రమం అమలు పరిచి పది సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా గత 45 రోజుల నుంచి జిల్లాలో పలు కార్యక్రమాల ద్వారా మహిళల హక్కులు, చట్టాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, మహిళల రక్షణకు తోడ్పడే పలు హెల్ప్ లైన్ నెంబర్లపై అన్ని విద్యాసంస్థల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. మహిళలు పురుషుల కంటే ఏమీ తక్కువ కాదని, నేటి సమాజంలో అంతరిక్ష రంగంలో మహిళలు భాగస్వామ్యం అవుతున్నారని తెలిపారు. విద్యార్థులంతా చక్కగా చదువుకొని జీవితంలో ఉన్నత స్థానంలో నిలవాలని సూచించారు. మెరుగైన కుటుంబ నిర్మాణం అనేది మహిళ మీద ఆధారపడి ఉంటుందన్నారు. జిల్లాలో జీవితంలో మహిళల ప్రాముఖ్యతపై పురుషులచే వ్యాసరచన పోటీలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సోమవారం నుంచి రెండు రోజుల పాటు జిల్లాలో మహిళలకు క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా సీనియర్ సివిల్ జడ్జి (జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్) జి. రాధిక, ఆర్డీఓ రత్న కళ్యాణి, డీఆర్డీఓ విజయలక్ష్మి, ఎసీడీపీఓ నాగలక్ష్మి, నాగమణి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్‌గోపాల్, మెప్మా పీడీ సుభాష్, డీవైఎస్ఓ శ్రీకాంత్‌రెడ్డి, మిషన్ శక్తి కోఆర్డినేటర్ సరిత, ఎస్‌హెచ్‌జి మహిళలు, ఎన్‌సీసీ విద్యార్థులు, పాఠశాలల విద్యార్థులు, ఎఎన్ఎం, ఆశాలు, మహిళలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉట్నూర్ : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఐటీడీఏ పీఓ కుష్బు గుప్తా అన్నారు. శుక్రవారం పట్టణంలోని కేబి కంప్లెక్స్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మహిళ దినోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. శతాబ్దాలుగా మన వారసత్వం, సంస్కృతి, సాంప్రదాయాలు, మహిళలను ఆదిశక్తిగా ఆరాధిస్తూ గౌరవిస్తున్నాయని పేర్కొన్నారు. సమసమాజ స్థాపనకు లింగ సమానత్వపు స్ఫూర్తి పెంపొందించడం, మహిళలు అన్ని రంగాల్లో అద్భుతంగా రాణిస్తున్నారని కొనియాడారు. చదువును డిగ్రీతో ఆపేయకుండా కొనసాగించాలని, నచ్చిన రంగంలో ఉద్యోగం సాధించాలని అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ అభినవ్, కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి : స్వయం సహాయక సంఘాల్లోని మహిళలను పారిశ్రామిక వేత్తలు గా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని అందునాయక్ తండా ఇందిరా మహిళా సమాఖ్య కార్యాలయంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సెర్ప్ ఆధ్వర్యంలో గిరిజన మిల్లెట్ బిస్కెట్ యూనిట్‌ను కలెక్టర్ రాజర్షిషా, సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళ సహాయక సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కృషి చేస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు ఇందిరా మహిళ శక్తి క్యాంటిన్లు నెలకొల్పి ఆర్థికంగా ఎదగడానికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఓ పీడీ రాథోడ్ రవీందర్, రాష్ట్ర మహిళ కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరిబాయి, ఇంద్రవెల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ ముఖాడే ఉత్తం, ఏపీఎం రాథోడ్ రామారావు, కాంగ్రెస్ నాయకులు, స్వయ సహాయక మహిళ సంఘాలు, వీఓఏలు పాల్గొన్నారు.





ఆదిలాబాద్ ఎస్పీగా అఖిల్ మహాజన్

• గౌస్ ఆలం కరీంనగర్‌కు బదిలీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఆదిలాబాద్ జిల్లా ఎస్పీగా అఖిల్ మహాజన్ నియమితులయ్యారు. ఈ మేరకు డీజీపీ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం జిల్లా ఎస్పీగా ఉన్న గౌస్ ఆలంను కరీంనగర్ జిల్లా పోలీస్ కమిషనర్‌గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌ను ఆదిలాబాద్ ఎస్పీగా నియమించారు. కాగా జిల్లా ఎస్పీగా గౌస్ ఆలం ప్రజలకు అనేక సేవలందించారు. మత భేదం లేకుండా హిందువుల పండుగలల్లో పాల్గొని, మత సామరస్యాన్ని చాటుకున్నారు. గంజాయి నిర్మూలనకు తన వంతుగా కృషి చేశారు. పోలీసులు విధులపై ప్రత్యేక దృష్టి సారించేందుకు చర్యలు తీసుకున్నారు. అందరితో చనువుగా ఉంటూ ప్రశాంత వాతావరణంలో విధులు నిర్వర్తించారు. ఎంపీ, ఎమ్మెల్యే ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నారు. పండుగలను సైతం జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. తనదైన శైలిలో ప్రత్యేక శ్రద్ధ వహించి జిల్లా ప్రశాంతతకు పాటుపడ్డారు.

లెప్రసి రోగులకు కులార్లు అందజేత



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వేసవిలో ఆదిలాబాద్ జిల్లాలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని లెప్రసి రోగులు ఇబ్బందులు పడొద్దనే ఉద్దేశంతో కూలర్‌తో పాటు సరకులను అందించడం జరిగిందని ఆదిత్య ఖండేష్కర్ సొసైటి అధ్యక్షుడు ఆదిత్య అన్నారు. గురువారం రాత్రి లెప్రసి కాలనీలో ఆరు చైర్లు, సరుకులు, కూలర్‌లను వారికి అందించారు. వారి ఆరోగ్య సమస్యలతో పాటు ఇతర ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆదిత్య మాట్లాడుతూ వేసవి కాలంలో ఆదిలాబాద్‌లో ఎండలు ఎక్కువగా ఉంటాయన్నారు. ఎండ వేడిమి నుంచి రక్షణ పొందేలా లెప్రసీ కాలనీలో కూలర్‌లను అందించామన్నారు. వీరికి ఇతర సౌకర్యాలు కల్పించేలా తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో గణేష్ వర్మ, శ్రీపాద్, శ్రీను, సవిన్ రెడ్డి ఉన్నారు.

ఈవీఎం గోదామును పరిశీలించిన కలెక్టర్



నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కలెక్టరేట్ కార్యాలయం సమీపంలోని ఈవీఎం గోదామును శుక్రవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి, పలు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎం గోదాం వద్ద భద్రత సిబ్బంది నిరంతరం మెరుగైన భద్రతను నిర్వహించాలన్నారు. షిఫ్టుల వారీగా భద్రతను పర్యవేక్షించాలని తెలిపారు. సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సంబంధిత అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ రత్నకళ్యాణి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, వైఎస్ఆర్‌సీపీ పార్టీల ప్రతినిధులు గాజుల రవికుమార్, కొరిపెల్లి శ్రావణ్‌రెడ్డి, మహమ్మద్ నయీమ్, నరేష్‌లు, భద్రతా సిబ్బంది, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రంజాన్ మాసంలో పేదలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిత్యావసర సరకులను పంపిణీ చేస్తున్నామని ఏఐఎంఐఎం పట్టణ సంయుక్త కార్యదర్శి షకీల్ అహ్మద్ అన్నారు. శుక్రవారం పాత బస్టాండ్ వద్ద పేద ముస్లీం కుటుంబాలకు సరకులను ఆయన పంపిణీ చేశారు. రంజాన్ మాసంలో దానధర్మాలు చేస్తే ఎంతో పుణ్యం వస్తుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. సాధారణ రోజుల కంటే రంజాన్ మాసంలో చేసే సేవకు ఎక్కువ ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. దాతలు కూడా ఈ మాసంలో ముందుకు వచ్చి పేదలకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు సుబాన్, అహ్మద్‌ఖాన్, షేక్ ఇమ్రాన్ పాల్గొన్నారు.

ఘనంగా పుణ్యతిథి వేడుకలు

నవతెలంగాణ-బేల

మండలంలోని సాంగిడి గ్రామంలో గత వారం రోజుల నుంచి కొనసాగుతున్న శ్రీ సంత్ తుకడోజీ మహారాజ్ 56వ పుణ్యతిథితో పాటు డా. మోతిజీ మహారాజ్ 27వ పుణ్యతిథి వేడుకలు నేటితో ఘనంగా ముగిశాయి. గ్రామంలో ఉదయమే భక్తులు శ్రీసంత్ తుకడోజీ, మోతిజీ మహారాజ్‌ల పల్లకిని ప్రధాన విధుల గుండా డప్పు వాయిద్యాలు, భజన కీర్తనలతో శోభయాత్ర నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి తరలి వచ్చిన మహిళలతో గ్రామం కిటకిటా లాడింది. కార్యక్రమంలో అధ్యక్షులు ప్రభాకర్, రవీందర్, శివాజీ, సంజయ్, విలాస్, ఆనంద్‌రావ్, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

నవతెలంగాణ-కుభీర్

మహారాష్ట్రలోని హిమాయత్‌నగర్ నుంచి కుభీర్ వైపుకు అక్రమంగా తరలిస్తున్న పశువులను శుక్రవారం కుభీర్ ఎస్సై రవీందర్ పట్టుకున్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... మహారాష్ట్ర హిమాయత్‌నగర్ నుంచి కుభీర్ వైపుకు బోలెరో వాహనం నెంబర్ ఎంహెచ్ 29 బిఈ 5846లో 10 ఎద్దులు, 2 గేదె పిల్లలు తరలిస్తుండగా పట్టుకున్నట్టు తెలిపారు. పశువులను తరలిస్తున్న ముగ్గురు షేక్ ఫయాజ్, షేక్ అమీన్, షేక్ యూనిస్, వారిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

గ్రామాలాభివృద్ధి కోసమే సీసీ రోడ్లు

• ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, నీటి ఎద్దటి ఉన్న గ్రామాలను గుర్తించి, బోరు బావులు వేస్తామని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం ముత్నూర్, ఇన్కర్‌గూడ, మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ దారిలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో మౌళిక వసతులు కల్పించడానికి ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. వేసవి కాలం సమీపిస్తున్న తరుణంలో నీటి ఎద్దటి ఉన్న గ్రామాలను గుర్తించి సమాచారం అందించాలని కార్యకర్తలకు సూచించారు. ఆ గ్రామాల్లో బోరు బావులు వేస్తామని తెలిపారు. ప్రజా ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పాటు పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యాకుబ్ బేగ్, సోమురే నాగోరావ్ పాల్గొన్నారు.

బుద్ధగాయలోని బుద్ధ విహార్ క్షేత్రాన్ని కాపాడాలి



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

బుద్ధగాయలోని బుద్ధ విహార్ పవిత్ర క్షేత్రాన్ని కాపాడాలని శుక్రవారం నిర్మల్ జిల్లా భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు కొంతం మురళీధర్ అన్నారు. బుద్ధ విహార్‌ను కాపాడాలని జిల్లా కలెక్టర్ కార్యాలయం వినతిపత్రం అందజేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన భంతేజిలు బుద్ధగోష్, నాగవజ్ర మాట్లాడుతూ భగవాన్ బుద్ధుడు జ్ఞానోదయం పొందిన పవిత్ర క్షేత్రం బుద్ధగయ ఆ పవిత్ర క్షేత్రాన్ని అపవిత్రం చేస్తూ బౌద్ధేతరులు ఆక్రమించి బుద్ధుని బోధనలు, బౌద్ధ ధమ్మానికి వ్యతిరేకంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందున పవిత్ర క్షేత్రాన్ని బౌద్ధులకు అప్పగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి భుజంగ రావ్ గైక్వాడ్, కోశాధికారి సేపురి సిద్దార్థ, బుద్ధవిహార్ కమిటీ అధ్యక్షులు కుంటోళ్ల వెంకటస్వామి, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట జిల్లా కన్వీనర్ బత్తుల రంజిత్, బొడ్డు లక్ష్మణ్, పాండురంగ్ జాదవ్ ఉన్నారు.

ఇంటర్‌లో పరీక్షకు 415 మంది విద్యార్థులు గైర్హాజరు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్టు మాధ్యమిక విద్యాశాఖ అధికారి జాదవ్ పరశురాం తెలిపారు. శుక్రవారం నిర్వహించిన పరీక్షకు 6,838 మంది విద్యార్థులకు గాను, 6,423 మంది విద్యార్థులు పరీక్ష రాశారని పేర్కొన్నారు. జనరల్ విభాగంలో 337, ఒకేషనల్ విభాగంలో 78 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు.

అక్రమ డోర్ నెంబర్లు ఇచ్చినవారిని సస్పెండ్ చేస్తాం

• అధికారులకు ఎమ్మెల్యే హెచ్చరిక • మున్సిపల్‌లో రివ్యూ మీటింగ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వ భూములకు మున్సిపల్ అధికారులు డోర్ నెంబర్‌లు కేటాయించడంతో అవి కబ్జాకు గురవుతున్నాయని, డోర్ నెంబర్ ఇచ్చే సమయంలో అధికారులు అక్కడికి వెళ్లి పూర్తి విచారణ చేసిన తరువాతనే కేటాయించాలని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. అక్రమ డోర్ నెంబర్లు ఇచ్చిన వారిని సస్పెండ్ చేసేంత వరకు ఉరుకునేది లేదని స్పష్టం చేశారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో ఆయా అంశాలపై ఎమ్మెల్యే రివ్యూ మిటింగ్ నిర్వహించారు. పట్టణంలో ట్యాక్స్ వసూళు, ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు, నీటి సరఫరా, డోర్ నెంబర్ల అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

నీటి ఎద్దడి లేకుండా చూడాలి..

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ భూములను కబ్జా చేసుకొని దర్జాగా మున్సిపల్ ద్వారా డోర్ నెంబర్ తీసుకుంటూ రిజిస్ట్రేషన్‌లు చేయించుకుంటు ఇతరులకు విక్రయిస్తున్నారన్నారు. దీంతో మున్సిపల్‌కు ప్రభుత్వ స్థలాలు లేకుండా పోతున్నాయన్నారు. గతంలో రెవెన్యూ వారు ఇచ్చిన 2.5 ఎకరాలు, ఇరిగేషన్ వారు ఇచ్చిన రెండెకరాల భూమి కూడా కబ్జాకు గురైందన్నారు. ఇది అధికారులు ఫీల్డ్ లెవల్‌లో వెరిఫికేషన్ లేకుండా డోర్ నెంబర్ కేటాయించారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, డీఈ తిరుపతి, సానిటరి ఇన్స్‌పెక్టర్ నరేందర్, బీజేపీ మాజీ కౌన్సిలర్లు ఆకుల ప్రవీణ్, నాయకులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివి ఉత్తమ మార్కులు సాధించాలి

• డీఈఓ ప్రణీత

నవతెలంగాణ-తలమడుగు

చదువును కష్టపడి కాదని, ఇష్టపడి చదివి ఉత్తమ మార్కులు సాధించాలని డీఈఓ ప్రణీత అన్నారు. శుక్రవారం మండలంలోని దేవాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను పరిశీలించారు. అనంతరం పదో తరగతి చదువుతున్న విద్యార్థుల గదిలోకి వెళ్లి, విద్యార్థులతో మాట్లాడుతూ పరీక్షలు సమీపిస్తున్న వేళ ఇష్టపడి చదివి అత్యధిక మార్కులు సాధించి, పాఠశాలకు తల్లిదండ్రులకు, గ్రామానికి పేరు ప్రఖ్యాతలు తేవాలని అన్నారు. విద్యార్థుల్లో ఇంగ్లీష్, మాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులలో అనుమానాలు ఏమైనా ఉంటే మరోసారి కూడా విద్యార్థులకు బోధించాలని ఉపాధ్యాయులను కోరారు. అనంతరం స్నాక్స్ పంపిణీ చేశారు. డీఈఓ వెంట ఎస్ఓ నారాయణ, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు దిలీప్‌రెడ్డి ఉన్నారు.



గగనానికి కేంద్రబిందువుగా మహిళలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సమాజ గగనానికి కేంద్రబిందువుగా ఉంటూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని విశ్రాంత అధ్యాపకురాలు సుజాత అన్నారు. శుక్రవారం యాదవ సంఘ భవనంలో సీపీఐ సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో 114వ అంతర్జాతీయ మహిళ దినోత్సవం సదస్సు నిర్వహించారు. దీనికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మహిళ దినోత్సవ ప్రత్యేకతో పాటు ప్రస్తుతం సమాజంలో మహిళలు ఎదుగుతున్న తీరు, జరుగుతున్న దాడుల గురించి వివరించారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ నేడు ప్రగతి, అభివృద్ధితో పాటు ఇతర అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారన్నారు. ఇదే సందర్భంలో భృణ హత్యలు, బాలికలపై దురచారాలు, మహిళాలపై దాడులు పెరుగుతున్నాయన్నారు. దేశ జనాభాలో సగభాగమైన మహిళలు ఈ విషయంలో చైతన్యవంతులు కావాలన్నారు. ఇది కేవలం విద్యతోనే సాధ్యమవుతుందన్నారు. పిల్లలకు నైతిక విలువలతో పాటు స్త్రీలను గౌరవించడం ఇంటి నుంచే ప్రారంభం కావాలన్నారు. వివక్ష లేకుండా పెంపకం జరగాలని సూచించారు. అలా జరగని కారణంగా స్త్రీని గౌరవించాలన్న మన సంస్కృతిని వదిలి పాశ్చాత్య సంస్కృతికి పురుషుడు అలవాటు పడుతున్నారని, దాంతో దురచారాలు పెరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో నాయకురాళ్లు కట్ట సునీత, సంగీత, షబాన, కట్ట స్వర్ణ ఉన్నారు.



దివ్యాంగులకు యూడీఐ గుర్తింపు పత్రం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

దివ్యాంగులకు ప్రస్తుతం అందిస్తున్న సదరం సర్టిఫికెట్ స్థానంలో కేంద్ర ప్రభుత్వం యూనిక్ డిజేబులిటీ ఐడీ(యూడీఐ) అందుబాటులోకి తీసుకువచ్చిందని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సౌకర్యాల కల్పన, చేపట్టాల్సిన చర్యలపై ఆస్పత్రి పర్యవేక్షకులు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దివ్యాంగులకు యూనిక్ డిజేబులిటీ ఐడీ ఇవ్వనుందని, ఇప్పటి వరకు 7 కేటగిరీలలో సదరం సర్టిఫికెట్లు అందిస్తుండగా ఇకనుండి 21 కేటగిరీలకు సంబంధించి యూనిక్ డిజేబులిటీ ఐడి కార్డులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ సేవల వినియోగానికి మార్చి 1 నుంచి అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి పర్యవేక్షకులు, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, అధికారులు పాల్గొన్నారు.

మహిళలే సమాజానికి మెట్లు : సీడీపీఓ ఇందిర

నవతెలంగాణ-జైనూర్



మహిళలు సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ విజయాలను గుర్తించడం, లింగ సమానత్వాన్ని సాధించడానికి వేగవంతం చేయడానికి నిర్ణయాలు తీసుకోవాలని సీడీపీఓ ఆర్.ఇందిరా అన్నారు. మహిళలు, బాలికలు, ఉన్నత విద్యను అభ్యసించి ముందంజలో ఉండాలన్నారు. కుటుంబంలో గానీ, సమాజంలో కానీ, సమస్యలు వచ్చినప్పుడు ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. పిల్లలను మంచి క్రమశిక్షణతో పెంచాలని సూచించారు. ఉద్యోగాలు చేసే మహిళలు వృత్తి నిర్వహణలో తమవంతు బాధ్యతలు సక్రమంగా నిర్వహించాలన్నారు.

ఒత్తిడిని జయిస్తూ ఉద్యోగం కొనసాగిస్తూ

నవతెలంగాణ-కెరమెరి



గ్రూప్-2 ఉద్యోగం సాధించాలనుకున్నా ఆమె నేడు పోలీసు రంగంలో కొలువు సాధించి ప్రజలకు సేవచేస్తుంది. చెన్నూరు మండలానికి చెందిన ఏ.లక్ష్మి కూలీ పనులు చేసే కుటుంబాన్ని పోషించేవారు. ముగ్గురు అక్క చెల్లెలు కాగా ఒకరు పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగం సాధించగా, లక్ష్మీ ఉమెన్ కానిస్టేబుల్‌గా ఎంపికైంది. ఓవైపు కుటుంబ బాధ్యతలను తీరుస్తూ మరోవైపు విధి నిర్వహణలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందుకెళ్తున్నారు. విధి నిర్వహణలో ఒత్తిడిని జయిస్తు, భర్త ప్రోత్సాహంతో నేడు ఉద్యోగంలో రాణిస్తున్నారు. అనేక సందర్భాల్లో పిల్లలతో పాటు విధులకు హాజరవుతున్నారు. బాలికలు ఉన్నతమైన లక్ష్యాలను ఏర్పరచుకొని జీవితంలో ఉన్నతమైన స్థానాన్ని చేరుకోవాలని ఆకాంక్షించారు.

ప్రయివేట్ ఉద్యోగంలో రాణిస్తున్న దివ్య

నవతెలంగాణ-జైనూర్



కుటుంబానికి చేదోడువాదోడుగా ఉండాలని భావించిన దివ్య ప్రయివేట్ స్కూల్‌లో ఉపాధ్యాయురాలిగా చేరింది. విద్యాసంస్థలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ తన వంతు పాత్ర పోశిస్తున్నారు. నాలుగు గోడల మధ్య వంటింట్లో స్వర్గంగా భావించే మహిళలు ఇప్పుడు జనజీవన స్రవంతిలోకి ఒక విశిష్టమైన శక్తిలా కలిసిపోయి అంచెలంచెలుగా ఎదుగుతున్నందుకు ఒక మహిళగా నాకు చాలా గర్వంగా ఉందని చెప్పారు. కండ్లు తెరిచిన క్షణం నుండి బంధం కోసం, బాధ్యత కోసం, కుటుంబం కోసం అహర్నిశలు శ్రమించి అవమానాలు సహించి, వారి భవిష్యత్తు కోసం తన ఇంటిని నందనవనం చేస్తారన్నారు. మహిళా మూర్తుందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

నవతెలంగాణ-కెరమెరి



పురుషులతో సమానంగా మహిళ మణులు అన్ని రంగాల్లో ముందుండాలి. చదువుతో పాటు ప్రతి రంగాల్లో మహిళలు సమానమైనప్పుడు హక్కులు కూడా సమానంగా ఉండాలని అంగన్‌వాడీ యూనియన్ మండల అధ్యక్షురాలు అనసూయ అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా నవతెలంగాణతో మాట్లాడారు. రాజ్యాంగంలో మహిళ అభ్యున్నతి కోసం కల్పించిన చట్టాలపై అవగాహన పెంచుకోవాలి. చట్టం కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకున్నప్పుడు మహిళలు ముందడుగు వేయగలరు. తమకు నచ్చిన రంగంలో రాణించడం కోసం ప్రయత్నిస్తూ సమాజంలో ఒకరుగా కాకుండా తనకంటూ ప్రత్యేకత అన్నట్లు గుర్తింపు పొందాలి. ముందుగా తమలో గల వెనుకబాటు తనం దూరం చేసుకోవాలి. మనోధైర్యంతో ముందుకు సాగాలి. పదవులు పొందిన మహిళలు తోటి మహిళలు అభివృద్ధికి పాటుపడడంతో ఎప్పటికప్పుడు ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.

మహిళల పాత్ర కీలకం

నవతెలంగాణ-జైనూర్



ఒక వ్యక్తి జీవితంలో స్త్రీ చాలా పాత్ర కీలకమని ఆశ్రమ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆత్రం పార్వతి అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా ఆమె నవతెలంగాణతో మాట్లాడారు. మగవారితో సమానంగా ఉపాధ్యాయురాలుగా, పైలెట్‌గా, ఇంజనీర్ వంటి బాధ్యతలను కూడా నిర్వహిస్తు ఇటు ఉద్యోగం అటూ కుటుంబానికి సమాన న్యాయం చేస్తుంది. వీటన్నింటికీ ప్రతీకగా ప్రపంచలోని మహిళల కోసం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఏర్పాటు చేశారు. దేశ ఆర్థికాభివృద్ధిలో వారి పాత్ర కీలకం. ప్రతి సంవత్సరం మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటున్నాం.

మహిళలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత

నవతెలంగాణ-జైనూర్



మహిళలు పరుషులతో సమానంగా పని చేస్తున్నారని, వారిని గౌరవించడం ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని ఏహెచ్ఎస్ ఎం. సుజాత అన్నారు. అమ్మను పూజించు, భార్యను ప్రేమించు, సోదరిని దీవించు, ముఖ్యంగా స్త్రీలను గౌరవించు, స్త్రీ అంటే త్యాగం, సహనం, ప్రతిరూపానికి మరో పేరు, పురుషులతో సరిసమానంగా కష్టపడుతున్నారు. కానీ మహిళల కష్టాలకు, షిషికి గుర్తుంపు లేదు. మహిళల పాత్ర అన్ని రంగాలలో తమ ప్రతిభను నిరూపించుకుంటున్నారు. మహిళలను సమాజంలో ప్రతి ఒక్కరు గౌరవించాలి.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలగాణ-సిర్పూర్(టి)

సిర్పూర్ మండలంలోని పలు గ్రామాల్లో నేడు కొత్తగా 132కేవీ లైన్ నిర్మాణ పనుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ఇర్ఫాన్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యానం 11.30 నుండి సాయంత్రం 5.30 వరకు 11కేవీ లోనవెల్లి, సాండిగాం, డోర్‌పల్లి ఫీడేర్ ఎల్‌సీ తీసుకోవడం వలన 33/11కేవీ లోనవేల్లి సబ్ స్టేషన్ పరిధిలోని లోనవెల్లీ, కంచరపేట, డోర్‌పల్లి, కొమ్ముగూడ, సాడ్‌నిగాం, దుబ్బగూడ గ్రామాలకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-బెజ్జూర్

మండల కేంద్రానికి చెందిన జిల్లాల సుధాకర్ గౌడ్ కుమార్తె వివాహానికి శుక్రవారం ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం కార్యకర్తలతో మాట్లాడారు. రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని కార్యకర్తలు కష్టపడి పని చేయాలని సూచించారు. బీజేపీ నాయకులు కొండ మనోహర్‌గౌడ్, భాస్కర్, రాజు, సామల తిరుపతి ఉన్నారు.

ఉద్యోగంలో రాణిస్తూ.. ఇంటిని తీర్చిదిద్దుతూ..

ప్రస్తుతం పెరుగుతున్న ఉరుకుల పరుగుల జీవితంలో వివిధ రకాల పనులు నిర్వర్తించడం కష్టంగా మారుతుంది. అటువంటిది పురుషులతో పోటీపడుతూ ఇటు ఇంటిని అటు ఉద్యోగాన్ని సమర్థవంతంగా నిర్వర్తిస్తూ రాణిస్తున్న మహిళలకు వందనం. మహిళా దినోత్సవం సందర్భంగా అటువంటి మహిళల అభిప్రాయాలు తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహిళల పట్ల చిన్నచూపు పోవాలి

చైతన్య కుమారి, గెస్ట్ లెక్చరర్.



సమాజంలో ఎన్నో రకాల మార్పు వచ్చినప్పటికీ కొన్నిచోట్ల మహిళలు కొంత ఇంకా జిల్లా చూపు కొనసాగుతోంది. చిన్న చూపు పోవాలంటే ఆర్థికంగా బలోపేతం కావాలి. దీనికై ప్రతి మహిళ ఆర్థిక అభివృద్ధి కోసం పనిచేయాల్సి ఉంటుంది. ప్రభుత్వాలు కూడా ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

అన్ని అంశాలపై అవగాహన కలిగి ఉండాలి

జ్యోతి, పంచాయతీ సెక్రెటరీ, గోవిందపూర్



ప్రస్తుతం పెరుగుతున్న పరిజ్ఞానం లేకపోతే మహిళలు ప్రతి విషయంపై అవగాహన కలిగి ఉండాలి. సునీత విలియమ్స్ లాంటి మహిళలు స్పేస్‌లోకి వెళ్లి అక్కడ మిషన్‌లో కొంత లోపం తలెత్తినప్పటికీ మొక్కవోని ఆత్మవిశ్వాసంతో తనకి ఏమీ కాలేదని సందేశం ఇవ్వడాన్ని ఆదర్శంగా తీసుకోవాలి. నూతన విషయాల పట్ల అవగాహన పెంచుకుంటు అభివృద్ధి చెందడానికి అవసరమైన కోణాలను అన్వేషించాలి.

పట్టుదలతో వెళ్తే సాధించలేనిది ఉండదు

కవిత, పంచాయతీ సెక్రెటరీ, అంకుశపూర్



పూర్వ కాలంతో పోలిస్తే మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. అయితే పట్టుదల లేనిది ఏది సాధ్యం కాదు. సమాజంలో మహిళల పట్ల మారుతున్న ఆలోచన విధానంతో ఇప్పుడు ఇప్పుడే వంటింటిని దాటి మహిళలు బయటకి వస్తున్నారు. ఇంకా కొన్నిచోట్ల మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను నివారించడానికి చర్యలు తీసుకోవాలి. సమాజంలో మహిళల పట్ల ఆలోచన విధానం పూర్తిగా మారాలి. మహిళ అన్ని రంగాల్లో రాణించాలి.

పురుషులతో పోటీపడుతూ సాగాలి

తిరుమల, డిగ్రీ లెక్చరర్



పురుషులతో పోటీపడుతూ మహిళల ముందుకు సాగాలి అప్పుడే ప్రస్తుతం ఉన్న సమాజంలో సరైన విలువ వస్తుంది. కుటుంబంలో ఉన్న ఇబ్బందులను తొలగించుకోవాలని సంకల్పంతో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని నిర్ణయించుకున్నాను ఒక ప్రణాళిక ప్రకారం చదివి గురుకుల టీజీటీ, పీజీటీ, జెఎల్, డిఎల్ ఉద్యోగాలు సంపాదించాను. ప్రతి మహిళ తన కాళ్లపైతాను నిలబడే ప్రయత్నం చేయాలి.

ఎండ తీవ్రత నుండి రక్షణ చర్యలు పాటించాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రత నుండి రక్షణ చర్యలు పాటించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శుక్రవారం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, జిల్లా అటవీ అధికారి నీరజ్ కుమార్, ఆసిఫాబాద్ ఆర్డీఓ లోకేశ్వర్ రావుతో కలిసి వేసవిలో ఎండ తీవ్రత నుండి రక్షించుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏర్పాటు చేసిన జిల్లా టాస్క్ ఫోర్స్ సమన్వయ కమిటీ సమావేశంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో ఎండ తీవ్రత నుండి కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలన్నారు. మార్చి మొదటి వారం నుండి ఎండ తీవ్రత అధికమవుతున్నందున ఉష్ణోగ్రత నుండి రక్షించుకునేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఆ దిశగా అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వ్యవసాయ రైతులు, కూలీలు, ఉపాధి హామీ పనులకు వెళ్లే కూలీలు ఉదయం 6 గంటల నుండి 11 గంటల వరకు పనులు ముగించుకోవాలని, ఎట్టి పరిస్థితులలో మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు బయటకు వెళ్లకూడదని, తిరిగి సాయంత్రం 4 గంటల నుండి ఎండ తీవ్రత తగ్గిన తర్వాత పనులు చేసుకోవాలన్నారు. పని ప్రదేశాలలో శుద్ధమైన తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, నీడ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బయటకు వెళ్లేటప్పుడు రక్షణ కొరకు తలకు వేడి గాలులు తగలకుండా రుమాలు, చున్నీలు చుట్టుకోవాలని, గొడుగులు వెంట తీసుకువెళ్లాలని, చిన్నపిల్లల పట్ల చాలా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అంగన్‌వాడీలకు వచ్చే చిన్నపిల్లలు, పాఠశాలలకు వచ్చే విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, ప్రయాణికులకు తాత్కాలిక బస్సు షెల్టర్లు ఏర్పాటు చేసి తాగునీటిని అందుబాటులో ఉంచాలని తెలిపారు. మున్సిపాలిటీలు, మండల కేంద్రాలలో, గ్రామాలలో రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. పంచాయితీ కార్యదర్శులు, అంగన్‌వాడీలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. అధిక ఉష్ణోగ్రతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రజలకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ఎవరైనా వడదెబ్బకు గురైతే వెంటనే వారిని సమీప ఆస్పత్రులకు తరలించి ప్రథమ చికిత్స అందించే విధంగా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అటవీ ప్రాంతాలలో వన్యప్రాణులకు నీటి తొట్లెలు ఏర్పాటు చేయాలని అటవీశాఖ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్, రవాణ శాఖ అధికారి రామ్‌చందర్, మున్సిపల్ కమిషనర్లు భుజంగరావు, అంజయ్య, అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



నవతెలంగాణ-బెజ్జూర్

గ్రామాల అభివృద్ధే ధ్యేయమని ఎమ్మెల్సీ దండ విఠల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాలను అభివృద్ధి చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెవెళ్తుందన్నారు. గత ప్రభుత్వం పట్టణాలపై దృష్టి సారిస్తే ఈ ప్రభుత్వం పట్టణాలతో పాటు గ్రామాల అభివృద్ధికిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అందులో భాగంగా ప్రతి గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. మహిళలను అన్ని విధాల ఆదుకోవాలని ఉద్దేశ్యంతో మహిళలకు ఎన్నో పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. మహిళా దినోత్సవం రోజు ముఖ్యమంత్రి మహిళా సాధికారతపై నూతనంగా పథకాలను ప్రారంభిస్తున్నారన్నారు. పట్టణాలతో పాటు గ్రామాలు పోటీపడుతున్నాయని అన్నారు. అనంతరం వివాహ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ శ్రీ వర్ధన్, కాంగ్రెస్ నాయకులు కొండ్ర జగ్గయ్య గౌడ్, సదాశివ్, మిరియాల పెంటయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి చర్యలు

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-వాంకిడి



జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శుక్రవారం ప్రధానమంత్రి శ్రీ పథకంలో భాగంగా ఎంపికైన మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో పాఠశాల అదనపు తరగతుల నిర్మాణ స్థలాన్ని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, ఆర్డీఓ లోకేశ్వరరావు, తహసీల్దార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, ఇందులో భాగంగా మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో రూ.3.25 కోట్ల అంచనా వ్యయంతో అదనపు తరగతి గదుల నిర్మాణానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంలో మండల ప్రత్యేక అధికారి, మండల విద్యాధికారి శివచరణ్ అదనపు తరగతి గదుల నిర్మాణానికి స్థలం సరిపోవడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకురావడం జరిగింది. కార్యక్రమంలో ఎంపీడీఓ, మండల పంచాయతీ అధికారి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధితో మహిళల అభివృద్ధి సాధ్యం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఉద్యోగులు నిరంతరం శ్రమిస్తూ తనకంటూ ప్రత్యేకతను చాటుకుంటూ పురుషులతో సమానంగా తమతమ విభాగాల్లో పనితీరు కనబరుస్తు పనిచేసే మహిళలు అరుదుగా కనపడతారు. ఇదే సమయంలో ఎస్టీ, మైనారిటీ లాంటి రెండు శాఖలకు జిల్లా అధికారిణిగా వ్యవహరిస్తూ అన్ని శాఖలో పనితీరు మెరుగుపరిచేలా చర్యలు తీసుకుంటున్న గిరిజన శాఖ ఉపసంచాలకులు రమాదేవి జిల్లాలోని మహిళలకు ఆదర్శప్రాయురాలు. మహిళా దినోత్సవం సందర్భంగా నవ తెలంగాణతో మాట్లాడుతూ మహిళల అభివృద్ధి విద్యతోనే సాధ్యమవుతుందన్నారు. మహిళల రక్షణ కోసం చట్టాలు తెచ్చిన వాటి అమలు తీరు కఠినంగా లేకపోవడంతో అక్కడక్కడ కొన్ని సంఘటనలు జరుగుతున్నాయని ఇది దురదృష్టకరమన్నారు. గతంతో పోలిస్తే మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారని ఇది కొంత శుభసూచకమన్నారు. మగవారితో పోలిస్తే మహిళలకు తెగువ ఎక్కువగా ఉంటుందని, ఓపిక, దేన్నైనా తట్టుకునే శక్తి ఉంటుందన్నారు. ప్రభుత్వాలు మహిళల అభివృద్ధి కోసం చర్యలు తీసుకోవడం సంతోషించదగ్గ విషయమని తెలిపారు. దీన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. జిల్లాలో ఎక్కువగా గిరిజనులు ఉన్నారని విద్యకు వీరు దూరంగా ఉంటున్నారని వారందరికీ విద్యా అవకాశాలు కల్పించేలా గ్రామస్థాయిలో చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో ఉన్న ఆశ్రమ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తూ ప్రతి గిరిజన విద్యార్థికి విద్య అందించేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. రానున్న పదవ తరగతి పరీక్షల్లో జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రణాళిక రూపొందించామన్నారు. ఇప్పటికే దీనికి సంబంధించి ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థులను సిద్ధం చేశామన్నారు. మహిళలు ఆర్థిక శక్తిగా ఎదిగిన నాడు మహిళ సాధికారిత సాధ్యమవుతుందన్నారు. నేటికీ కొన్నిచోట్ల మహిళల పట్ల చిన్నచూపు ఉందని అన్నారు. మహిళా దినోత్సవాన్ని ఆదర్శంగా తీసుకొని ప్రతి మహిళ విద్యను అభ్యసించాలని సూచించారు. జిల్లాలోని మహిళలకు మహిళల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

చట్టసభల్లోనూ సమాన అవకాశాలు కల్పించాలి

నవతెలంగాణ-కెరమరి



చట్టసభల్లోనూ సమాన అవకాశాలు కల్పించాలని కెరమెరి మండలం హట్టి ఆశ్రమ పాఠశాల హెచ్ఎం ఆత్రం పంచపూల అంటున్నారు. మహిళ దినోత్సవం సందర్భంగా ఆమె నవతెలంగాణతో మాట్లాడారు. మార్చి 8 అనేది కేవలం మహిళల దినోత్సవం కాకుండా వారి శ్రమను గుర్తించి ప్రపంచవ్యాప్తంగా వారిని గౌరవించి వారి కంటే ఒక రోజును కేటాయించడం జరిగింది. మహిళలను గౌరవించడం అనేది సమాజం యొక్క బాధ్యత. ఎన్నో ఏండ్ల నుంచి శ్రమ దోపిడి నుంచి మహిళలు ఇప్పుడిప్పుడే మహిళలు సాధికారతను సాధిస్తున్నారు. ప్రభుత్వపరంగా కూడా వారికి అన్ని రంగాలలో అవకాలు అవకాశాలు కల్పించాలి. ఇలాంటి మహిళల దినోత్సవం లాంటిది వారి పనిలో నిబద్ధత పెరుగుతుంది. ఈ రోజుల్లో మహిళలు పురుషులతో సమానంగా అవకాశాలు అందుపుచ్చుకుంటున్నారు. అయిన ఎక్కడో సమాజంలో వారి పాత్ర ఇంకనూ బలహీనంగా ఉంది. పురుషులతో సమానంగా అవకాశం కల్పిస్తే వారి సమస్యల పట్ల ప్రభుత్వానికి, సమాజానికి తమ గొంతు వినిపించడానికి అవకాశం ఏర్పడుతుంది. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. కొన్ని రాష్ట్రాలలో మహిళలే పరిపాలన కొనసాగిస్తున్నారు. యావత్తు భారత దేశమంతా గౌరవించేలా దేశ ప్రధాని చేసింది.

ప్రణాళికతో ముందుకెళ్తే విజయం సాధ్యం

- మాజీ జడ్పీటీసీ సెడ్మకి ద్రుపతబాయి

నవతెలంగాణ-కెరమెరి



ఆసక్తికి అనుగుణంగా నిర్దిష్టమైన ప్రణాళికతో ముందుకు సాగినప్పుడు విజయం తమ సొంతమవుతుంది. ఒకప్పుడు వంటింటికి పరిమితమైన మహిళలు ఇప్పుడు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తుండడం మహిళా లోకానికి గర్వకారణం. విశ్రాంతి లేకుండా శ్రమిస్తున్న మహిళలు, విద్య ఉద్యోగ, రాజకీయంగా, వ్యాపారాల్లో కూడా తమవంతు పాత్రను పోషిస్తున్నారు. అయిన నేటి సమాజంలో మహిళలు ఇప్పటికీ అసమానతలు, అవమానాలు వేధింపులకు గురవుతుండటం బాధాకరం. ఇలాంటి సందర్భాలను నిలువరించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి. పురుషులతో సమాన హక్కులు మహిళలకు కల్పిస్తూ ప్రోత్సహించాలి. మహిళలను గౌరవించడానికి ప్రతి సంవత్సరం మార్చి 8న అంతర్జాతీయంగా మహిళా దినోత్సవం నిర్వహించుకోగ కొన్ని దేశాల్లో ఈ రోజును సెలవుదినంగా ప్రకటించారు. లింగ సమానత్వం, హింస, మహిళలకు సమాన హక్కులు కావాలంటూ ఎంతోమంది ఇప్పటికి పోరాటం చేస్తున్నారు. ప్రస్తుత సమాజంలో మహిళల పట్ల గౌరవం పెరిగినప్పుడే అసలైన మహిళా సాధికారత సాధించినట్లు అవుతుంది.

ఒప్పంద ప్రాతిపదికన వైద్యుల భర్తీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేసేందుకు ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను ఒప్పంద పద్ధతిన ఈ నెల 31 వరకు తాత్కాలికంగా భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనాటమీ, ఫిజియాలజీ, బయో కెమిస్ట్రీ, ఫార్మకాలజీ, పాథాలజీ, మైక్రోబయాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, కమ్యూనిటీ మెడిసిన్, జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్స్, డెర్మటాలజీ మరియు వెనరాలజీ, జనరల్ సర్జరీ, ఆప్తమాలజీ, ఆర్థోపెడిక్స్, గైనకాలజీ, రేడియాలజీ, అనస్తేషియన్, రెస్పిరేటరీ మెడిసిన్, ఎమర్జెన్సీ మెడిసిన్ ఇతర విభాగాలలో పోస్టులు భర్తీ చేయడం జరుగుతుందని తెలిపారు.

నవతెలంగాణ
మంచిర్యాల
శనివారం | మార్చి 08, 2025 | www.navatelangana.com

చదువుతోనే మార్పు సాధ్యం

● పి సరిత, ప్రత్యేక అధికారి, కేజీబీవీ కాసిపేట

నవతెలంగాణ-కాసిపేట



సమాజంలో మార్పు చదువుతోనే సాధ్యమవుతుంది. చదువు వల్ల ఆడపిల్లల్లో అత్మ స్థైర్యం పెరుగుతుంది. వారి హక్కులు, రక్షణకు గల చట్టాలు, జీవితంలో ఉన్నత స్థానం చేరుకోవటానికి గల మార్గాలు. వారి ఆరోగ్యం పట్ల అవగాహన ఏర్పరుచుకుంటారు. పాఠశాల స్థాయిలో వారికి అవగాహన కల్పించటానికి వారి కళలు సహకారం చేసుకోవటానికి విద్యాశాఖ, పోలీసు, మహిళ శిశు సంక్షేమ, ఆరోగ్య శాఖతో పాటు ఎన్‌జీఓస్‌తో కలిసి పనిచేస్తున్నాయి. తల్లిదండ్రుల ఆలోచనలో మార్పు తేవడానికి ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాము. వివక్షతో ఆడపిల్ల స్వేచ్ఛ హరించే హక్కు ఎవరికి లేదు.

ఆడపిల్లలు చదువుకోవాలి

● ఎం కవిత, పంచాయతీ సెక్రటరీ దేవాపూర్

నవతెలంగాణ-కాసిపేట



ఆడపిల్ల చదువుకుంటే పుట్టినిల్లు, మెట్టినిల్లే కాకుండా తద్వారా సమాజం ప్రగతి పథంలో నడుస్తుంది. ఆడపిల్ల చదువు పట్ల ప్రతిఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలి. మహిళలు ఎలాంటి పరిస్థితినైనా సులువుగా చక్కబెడతారు. అయితే ప్రస్తుతం దేశంలో మహిళల పట్ల జరగుతున్న అఘాత్యాలు బాధకారం. ఇలాంటివి అరికట్టలంటే ప్రతి తల్లి తమ కొడుకులకు మంచి నడవడిక, మర్యాద, విలువలు నేర్పించాలని మహిళ దినోత్సవం సందర్భంగా కోరుకుంటున్నాను. మగపిల్లలను సన్మార్గంలో నడిపించినప్పుడే మహిళ పట్ల జరగుతున్న అఘ్యాతాలు ఆగిపోతాయి.

మహిళా చట్టాలను పకడ్బందీగా అమలుపరచాలి

● శ్రీదేవి మాజీ ఎమ్మెల్యే బెల్లంల్లి

నవతెలంగాణ-తాండూర్



ప్రభుత్వం మహిళా చట్టాలను రూపొందించినప్పటికీ ఆచరించి అమలు పరచడంలో కొంత నిర్లక్ష్యం జరుగుతోంది. మహిళల భద్రత విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన నిర్ణయాలు తీసుకోవాలి. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను దృష్టిలో ఉంచుకొని పరిస్థితుల కనుగుణంగా చట్టంలో మార్పు తేవాలి. మహిళలు రాజకీయాల్లో రాణించే విధంగా చట్టసభల్లో రిజర్వేషన్ సౌకర్యం అమలుపరచి మహిళలు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో, ఎదిగే విధంగా ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందుకుగాను గ్రామీణ స్థాయిలో మహిళలను విద్యావంతులను చేయాలి. విద్యా ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్ సౌకర్యం పటిష్టంగా అమలుపరచాలి. మహిళలకు స్వయం ఉపాధి మార్గాలు చూపాలి. మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం చేయూతనందించాలి.

మహిళలకే అసాధ్యాన్ని సుసాధ్యం చేసే శక్తి

● కె సరోజ, ఎంపీడీఓ, లక్షెట్టిపేట

నవతెలంగాణ-లక్షెట్టిపేట



ఏ రంగంలోనైనా అసాధ్యాన్ని సుసాధ్యం చేసే శక్తి మహిళలకే ఉందని లక్షటిపేట ఎంపీడీఓ కె.సరోజ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్క రించుకొని ఆమె నవతెలంగాణతో మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో శాస్త్ర సాంకేతిక రంగాల తో పాటు మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారని, పురుషులతో సమానంగా స్త్రీలు మేము సైతం అంటూ ముందడుగు వేస్తున్నారని తెలిపారు. ధైర్యే సాహసే లక్ష్మీ అన్న చందంగా మహిళలు వారి నైపుణ్యం కనబరుస్తూ ప్రతి లక్ష్యాన్ని అవలీలగా చేదిస్తున్నారన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు మహిళల పట్ల వివక్ష చూపకుండా సమన్యాయం కల్పించాలని అన్ని విధాలుగా ప్రోత్సహిం చాలని ఆమె వ్యాఖ్యానించారు. సాఫ్ట్వేర్ రంగంలో అద్భుత ప్రతిభ కనబరుస్తూ మహిళలు, యువతులు శక్తిని చాటుతున్నారన్నారు. భవిష్యత్తులో కూడా మరింత ఉన్నత స్థాయికి ఎదిగే విధంగా మనోదర్యంతో మహిళలు సత్తా చాటాలన్నారు. సమస్త మహిళ లోకానికి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

టీచరుగా సేవలందించడం ఆనందంగా ఉంది

● పొన్నాల మంజుల, ఉపాధ్యాయురాలు, వొడ్డెర కాలనీ

నవతెలంగాణ-తాండూర్



గ్రామీణ ప్రాంతాలలో టీచరుగా సేవలందించడం ఆనందంగా ఉంది. 2000 సంవత్సరంలో డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయునిగా ఎన్నికై ఇప్పటి వరకు తాండూర్, కౌటాల, రెబ్బెన మండలాల్లో సేవలందించాను. ప్రాథమిక పాఠశాలల్లో పనిచేయడం ఒక గొప్ప అనుభూతినిచ్చింది. చిన్న పిల్లలు స్వచ్ఛమైన మనసుతో ప్రాథమిక పాఠశాలతో ప్రవేశిస్తారు. వారికి క్రమశిక్షణ నైతిక విలువలతో కూడిన విద్యను సమాజానికి అందిస్తున్నాననే సంతృప్తి ఆనందాన్ని కలిగిస్తుంది. మహిళా ఉవిద్యాయురాలిగా ఒకవైపు కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూనే విద్యార్థులను నా సొంత బిడ్డల్లా ప్రేమిస్తూ వారిని సన్మార్గంలో నడిపిస్తూ ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్నాను. ప్రతి మహిళ చదువుకొని సమాజంలో తన బాధ్యతను పాలుపంచుకోవాలన్నదే నా ఆకాంక్ష. గ్రామాలలో బాలికల విద్యకు ప్రోత్సాహాన్ని అందిస్తున్నాను. బాలికలు పాఠశాలను మధ్యలో మానివేయకుండా చదువులో కొనసాగే విధంగా తల్లిదండ్రులను ప్రోత్సహిస్తున్నాను.

ప్రతి మహిళల విద్యావంతురాలు కావాలి

● పద్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, జన్నారం

నవతెలంగాణ-జన్నారం



ప్రతి మహిళ విద్యావంతురాలు అయితే కుటుంబం ఉన్నతంగా ఉంటుందని, ఐసీడీఎస్ లక్షట్ పేట ప్రాజెక్ట్ జన్నారం సెక్టార్ సూపర్‌వైజర్ పద్మ అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా నవతెలంగాణతో మాట్లాడారు. మహిళలు చదువులో రాణించి, వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలి. ప్రతి అవకాశం సద్వినియోగం చేసుకోవాలి. ఎవరో వస్తారు ఏదో చేస్తారని ఎదురు చూడకుండా ప్రతి మహిళ తనకంటూ ఒక ప్రత్యేకత చాటుకోవాలి. ప్రతి ఆడపిల్ల ఉన్నత చదువులు చదివితేనే సమాజంలో మంచి గౌరవం ఉంటుంది. మధ్యలోనే ఆపేయకుండా ఉన్నత చదువులు చదివించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది. విద్యతోనే జీవితంలో ఏదైనా సాధించవచ్చనే విషయం మహిళలు గ్రహించాలి. ప్రతి మహిళ ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకొని ముందుకు సాగాలని కోరారు. మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలందరికీ శు

జనరిక్ మందులను వినియోగించాలి

● డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ హరీష్

నవతెలంగాణ-జన్నారం



జనరిక్ మందుల వినియోగంపై ప్రజలలో అవగాహన పెంచుతున్నామని జనరిక్ మందుల దుకాణాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హరీష్ రాజ్ అన్నారు. జనరిక్ ఔషధాలు సంపూర్ణ మార్గదర్శి అనే కార్యక్రమంలో భాగంగా, శుక్రవారం జన్నారంలో ఏర్పాటు చేసిన జన ఔషధీ దుకాణాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనరిక్ మందులు మంచి నాణ్యతతో తక్కువ ధరకు లభిస్తాయని వెల్లడించారు. ప్రజలు కూడా జనరిక్ మందులను వినియోగించేలా అవగాహన పెంచుతున్నామని ఆయన వెల్లడించారు. ఈ మందుల కేంద్రాన్ని అనీల్ ఫార్మసిస్ట్ మంజూరు చేయడం జరిగిందన్నారు. మంచిర్యాల జిల్లాలో జన్నారం, బెల్లంపల్లి, మంచిర్యాలలో ఈ కేంద్రాలు మూడు మాత్రమే ఉన్నాయన్నారు. జనరిక్ ఔషధాలు ఆరోగ్య సంరక్షణలో దేశంలో గాని ప్రపంచంలో గాని ముఖ్యపాత్ర పోషిస్తాయన్నారు. ఇవి భద్రమైన సమర్థవంతమైన తక్కువ ఖర్చుతో లభించే బ్రాండెడ్ ఔషధాల ప్రత్యామ్యంగా అందుబాటులో ఉంటాయన్నారు. జనరల్ మెడిసిన్ అనేది ఒక బ్రాండెడ్ ఔషధంతో సమానంగా ఉంటుందన్నారు. కానీ తక్కువ ధరకే ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. బ్రాండెడ్ ఔషధం లాగే ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్ అనిత. ఉపవైద్యాధికారి ప్రశాంతి, డీపీఓ పద్మ డాక్టర్ ఉమాశ్రీ, శంకర్ పాల్గొన్నారు.

తల్లిదండ్రులప్రోద్బలంతో ఉన్నత స్థాయి ఉద్యోగం

● జ్యోత్స్న, తహసీల్దార్, బెల్లంపల్లి



నవతెలంగాణ-తాండూర్

తల్లిదండ్రుల ప్రోద్బలంతో పట్టుదలతో చదివి రెవెన్యూ శాఖలో ఉద్యోగ సాధించారు బెల్లంపల్లి తహసీల్దార్ జ్యోత్స్న. మంచిర్యాల జిల్లాలోని భీమరం, రెబ్బెన, హాజీపూర్, మంచిర్యాలలో పనిచేసిన ఆమె ప్రస్తుతం బెల్లంపల్లి తహసిల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. స్వగ్రామం ఆదిలాబాద్‌కు చెందిన జ్యోత్స్న తండ్రి పుండరీక్ ఎస్సీ కార్పొరేషన్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పని చేశారు. తల్లి కిరణ్ బాల రిటైర్డ్ టీచర్. భర్త కృష్ణ హాజీపూర్ వ్యవసాయ అధికారిగా పనిచేస్తున్నారు. విద్యావంతుల కుటుంబంలో జన్మించిన జ్యోత్స్న బీటెక్ వరకు చదువుకొని జిల్లా సెలక్షన్ కమిటీ ద్వారా రెవెన్యూ శాఖలో ఉద్యోగం సాధించారు. ఉద్యోగ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పేరు ప్రఖ్యాతులు గడిస్తున్నారు. మహిళలకు మార్గదర్శకులుగా నిలుస్తున్నారు. ప్రభుత్వ భూములను పరిరక్షించినందుకుగాను ఉద్యోగ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తున్నందుకుగాను గత గణతంత్ర దినోత్సవ సందర్భంగా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ ఉద్యోగి అవార్డు అందుకున్నారు. సామాజిక చైతన్యంపై అవగాహన కలిగి ఉన్న జ్యోత్స్న ఉద్యోగ బాధ్యతల్లో భాగంగా నిర్వహించే మానవ హక్కుల దినోత్సవంలో ప్రజలకు హక్కులు, బాధ్యతలపై అవగాహన పెంపొందిస్తున్నారు. సాంఘిక దురాచారం, లింగ వివక్షత, మహిళా సాధికారతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. బెల్లంపల్లి పట్టణ పరిధిలోని బాలికల విద్యాలయాలను సందర్శించి బాలికల విద్యా హక్కు, బాల్య వివాహాలు, ఆడపిల్లల సంరక్షణ చట్టాలపై విద్యార్థినిల్లో అవగాహన కల్పిస్తున్నారు.

ప్రణాళికతో ముందు సాగుతే విజయం సాధ్యం

● ఐద్వా మంచిర్యాల జిల్లా అధ్యక్షురాలు పోతు విజయశంకర్



నవతెలంగాణ-జన్నారం

ఆసక్తికి అనుగుణంగా నిర్దిష్టమైన ప్రణాళికతో ముందుకు సాగినప్పుడు విజయం తమ సొంతం అవుతుందని ఐద్వా మంచిర్యాల జిల్లా అధ్యక్షురాలు పోతు విజయ శంకర్ అన్నారు. ఒకప్పుడు వంటింటికి పరిమితమైన మహిళలు ఇప్పుడు పురుషులతో సామానంగా అన్నిరంగాల్లో రాణిస్తుండటం మహిళా లోకానికి గర్వకారణం. విశ్రాంతి లేకుండా శ్రమిస్తున్న మహిళలు విద్య ఉద్యోగ, రాజకీయంగా, వ్యాపారాల్లో కూడా తమ వంతు పాత్రను పోషిస్తున్నారు. అయినప్పటికి నేటి సమాజంలో మహిళలు ఇప్పటికీ అసమానతలు, అవమానాలు వేదింపులకు గురవుతుండటం బాధాకరం. ఇలాంటి సంధర్భాలను నిలువరించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి. పురుషులతో సమాన హక్కులు మహిళలకు కల్పిస్తూ ప్రోత్సహించాలి. మహిళలను గౌరవించడానికి ప్రతి సంవత్సరం మార్చి 8న అంతర్జాతీయంగా మహిళ దినోత్సవం నిర్వహించుకోగా కొన్ని దేశాల్లో ఈ రోజును సెలవు దినంగా ప్రకటించారు. లింగ సమానత్వం, హింస, మహిళలకు సమాన హక్కులు కావాలంటూ ఎంతో మంది ఇప్పటికీ పోరాటం చేస్తున్నారు. మహిళా దినోత్సవం పుట్టుక వెనుక 15 వేల మంది అతివల అడుగులు ఉన్నాయి. పురుషులతో సమానమైన హక్కులు కావాలంటూ 1908లో న్యూయార్క్‌లో భారీ ఎత్తున ప్రదర్శన నిర్వహించారన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కోరుతున్నామన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా మండల మహిళా మణులకు శుభాకాంక్షలు తెలుపుతున్నామన్నారు.

ఆత్మస్థైర్యంతో ముందడుగు వేయాలి

● బండ శాంకరి, స్కూల్ అసిస్టెంట్, ముత్యంపల్లి హై స్కూల్



నవతెలంగాణ-కాసిపేట

ప్రతి రంగంలో మహిళలు ఆత్మస్థైర్యంతో ముందడుగు వేయాలి అప్పుడే సమాజాభివృద్ధి సిద్ధిస్తుంది. ఆకాశంలో సగం, అవకాశాల్లో సగం, అన్నింటా సగం అంటూ ప్రపంచ మహిళ దినోత్సవ వేడు కలు నేడు మహిళలు, యువతులు అంగరంగ వైభవంగా జరుపుకుంటున్నారు. కానీ.. విధిరాతను ఎదిరించి ఆత్మ గౌరవానికి ప్రతీక నిలుస్తూ ఎందరో మహిళామణులు చరిత్రలో తమకంటూ ఒక ప్రత్యేక పేజీని, స్థానాన్ని సాధిం చుకుంటున్నారు. మహిళల స్థితిగతులు బాగుపడందే సమాజం అభివృద్ధి చెందదు. ఏ పక్షి అయిన ఒక్కరెక్కతో ఎగరలేదు. అని వివేకానందుని మాటలు స్మరిస్తూ మహిళలు రాణిస్తున్నారు. పురుషులతో దీటుగా అన్ని రంగాల్లో మేము సైతం అంటూ నేల నుంచి నింగి దాకా మనోధైర్యంతో అడుగులు వేస్తున్నారు. సమసమాజంలో అన్ని మారుతున్నాయి. మహిళల ఆలోచన ధోరణి తప్ప.. అయితే సమాజంలో కొందరు మహిళలు ఆత్మగౌరవంతో స్వశక్తితో తమ ఆర్థిక అవసరాలను తీర్చుకోగలిగే ఉన్నత స్థితికి చేరుకొని స్త్రీ శక్తి అంటే ఏంటో ప్రపంచానికి తెలుపుతూనే ఉన్నారు. ప్రస్తుతం పెరుగుతున్న సాంకేతికత పరిజ్ఞానం దృష్ట్యా మహిళలపై దాడులు జరుగుతున్నాయి. ఎన్ని చట్టాలు మారిన ఫలితం శూన్యం. నిందితులకు కఠిన శిక్షలు పడినా మార్పు రావడం లేదని వాటిని అరికట్టే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుదిట్టమైన చర్యలు తీసుకో వాలి. మహిళలు అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ అవరోధాలు అధిగమిస్తూ ముందుకు సాగాలి.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

● సౌజన్య, ఎస్ఐ, మాదారం



నవతెలంగాణ-తాండూర్

మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే సమాజం పురోగతి చెందుతుందని మాదారం ఎస్ఐ సౌజన్య అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా నవతెలంగాణ తో ఆమె మాట్లాడారు. మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగితే సాధించలేనిది లేదని అన్నారు. నేడు మహిళలకు అన్ని రంగాల్లో విజయాలు సాధిస్తున్నారని, చట్టాల పై అవగాహన ఉండాలన్నారు. సమాజంలో స్త్రీ విద్యను ప్రోత్సహించినప్పుడే సమాజం పురోగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ప్రభుత్వం స్త్రీలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించాలన్నారు. బెల్లంపల్లి పట్టణానికి చెందిన మానస స్థానిక వాణి నికేతన్ పాఠశాలలో హైస్కూల్ చదివి బీటెక్ పూర్తి చేశారు. తండ్రి రిటైర్ పోలీస్ ఆఫీసర్ ముగ్గురు ఆడ సంతానంలో ఒక్కరైన మానస తండ్రి బాటలో నడిచి ఆత్మస్థైర్యంతో పోలీసు శాఖలో కొనసాగుతున్నారు. 2020 బ్యాచ్‌లో పోలీస్ శాఖలో ఉద్యోగం సాధించిన మానస రామగుండం కమిషనరేట్ పరిధిలోని గోదావరిఖని, చెన్నూరు శ్రీరాంపూర్‌లో ఎస్ఐగా పనిచేశారు. పల్లె నిద్ర కార్యక్రమాల ద్వారా మహిళలకు మహిళ చట్టాల గురించి వివరిస్తు వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపుతున్నారు. పాఠశాలలో ప్రహరీ క్లబ్బులు నిర్వహించి విద్యార్థులకు సత్ప్రవర్తన నైపుణ్యత అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. సహచరుల మధ్యలో స్థానికంగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించడం ఆనందంగా ఉందని మానస తెలిపారు.

మహిళలకు సెల్ఫ్ మోటివేషన్ ముఖ్యం

● ఈ సరిత, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, కాసిపేట

నవతెలంగాణ-కాసిపేట



మహిళలకు సెల్ఫ్ మోటివేషన్ ఎంతో ముఖ్యం. ఎవరిపైనా ఆధారపడకుండా ఇండిపెండెంట్‌గా ఉండాలి ఫ్యామిలీ వీక్నెస్సు స్ట్రెంత్గా చేసుకుని ముందుకు సాగాలి. చదువును మధ్యలోనే ఆపేసి ఇప్పటికీ అక్కడక్కడ చైల్డ్ మ్యారేజెస్ చేస్తున్నారు. ఉన్నత చదువులు చదివితే ఎప్పటికీ ప్రమోషన్‌లాగా ఉంటుంది. మహిళలు అన్ని రంగాల్లో మరింతగా రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మహిళలు ఉన్నత చదువులతో అందరికీ ఆదర్శంగా నిలవాలి

చదువులో కష్టపడితేనే ఉద్యోగం సాధించవచ్చు

నవతెలంగాణ-జన్నారం



ఉన్నత చదువులను చదివి, కష్టపడితేనే ఉద్యోగం సాధించవచ్చని జన్నారం మండలంలోని కిష్టాపూర్ కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపల్ శ్రీవాణి అన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నవతెలంగాణతో ఆమె మాట్లాడారు. ఎన్నో వ్యయ ప్రయాసాలకు లోబడి అనేక ఒడిదుడుకులతో చదివి ఎంఎస్సీ బీఈడీ చేశానన్నారు. 12 సంవత్సరాలుగా విద్యార్థులకు బోధిస్తూ ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దామన్నారు. విద్యార్థినిలు చిన్నతనం నుంచే కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో చిన్న వయసులో చదువును ఆపేయకుండా, బాల్య వివాహాలకు దూరంగా ఉండాలన్నారు.ప్రతి విద్యార్థిని, విద్యార్థులు కష్టపడి చదివి, ఉద్యోగాలు సాధించేలా కృషి చేయాలని అన్నారు. చిన్నతనం నుంచే ప్రణాళికలు వేసుకొని చదవాలన్నారు.

ఆడపిల్లల పట్ల వివక్ష విడనాడాలి

● వసంత, పంచాయతీ కార్యదర్శి, చౌటపల్లి

నవతెలంగాణ-తాండూర్



సమాజంలో ఆడపిల్లల చదువుల పట్ల నేటికీ వివక్ష కొనసాగుతూనే ఉంది. చాలామంది గ్రామీణ ప్రాంత తల్లిదండ్రులు తమ కుమార్తెలను పాఠశాల విద్యకే పరిమితం చేస్తున్నారు. మరికొందరేమో మగ పిల్లలను ప్రయివేటు విద్యాసంస్థల్లో చదివిస్తూ, ఆడ పిల్లలను సర్కారీ బడులకు పంపుతున్నారు. ఆడపిల్లలపై వివక్షతను విడనాడాలని చౌటపల్లి పంచాయతీ కార్యదర్శి వసంత అన్నారు. బీఎస్సీ, బీఈడీ వరకు చదువుకున్న వసంత పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ గ్రామీణులు ఆడపిల్లలను చదివించే విధంగా ప్రోత్సహిస్తున్నారు. తరచూ మహిళా సంఘ సమావేశాల్లో పాల్గొంటూ మహిళా సాధికారత గురించి మహిళల్లో అవగాహన కల్పిస్తున్నారు.

వ్యవసాయంలో మహిళల ప్రాధాన్యత పెరగాలి

● సుష్మ, వ్యవసాయ అధికారి, తాండూర్

నవతెలంగాణ-తాండూర్



వ్యవసాయంలో మహిళల ప్రాధాన్యత పెరగాలి. వ్యవసాయ ఉత్పత్తులు ఆధారిత పరిశ్రమల్లో రాణించే విధంగా ప్రభుత్వం మహిళలకు చేయూతనందించాలి. ఆయా రంగాల్లో మహిళా సంఘాలకు నైపుణ్యత శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి రుణ సౌకర్యాలు కల్పించాలి. గ్రామీణ ప్రాంత మహిళలు పెరటి తోటల పెంపకం, నాటు కోళ్ల పెంపకం వంటి కుటీర పరిశ్రమల్లో చేయూతనందించాలి. వ్యవసాయ రంగంపై ఆసక్తితో అగ్రికల్చర్ బీఎస్సీ చదివి కొత్తగా వ్యవసాయ అధికారి గాఉద్యోగం సాధించాను. తాండూర్ మండలంలో మహిళా రైతులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నాను.

పట్టుదల కృషి ఉంటే విజయం సాధ్యం

నవతెలంగాణ-లక్షెట్టిపేట



పట్టుదల కృషి ఉంటే విజయం మనదే అని తరాల రత్నమాల అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా నవతెలంగాణతో మాట్లాడుతూ పట్టణంలోని మిషన్ కాంపౌండ్ ఏరియాకు చెందిన తరాల రత్నమాల జీఎన్ఎం పూర్తిచేసుకుంది. గత 13 సంవత్సరాలుగా ఎదురుచూస్తుండగా ముచ్చటగా మూడో ప్రయత్నంలో ఉద్యోగం సాధించారు. మొదటి రెండు ప్రయత్నాలలో అతి దగ్గరకు వచ్చి కోల్పోయిన నిరాశ చెందకుండా ఓపిక పట్టారు. సర్కారు కొలువుకు సన్నద్ధమవుతూనే తన విద్యను వృధా చేయకుండా అంది వచ్చినా అవకాశాలు సద్వినియోగం చేసుకుంటూ తాత్కాలిక పద్ధతిలో పలు ప్రాంతాల్లోని సర్కారు ఆసుపత్రుల్లో కాంట్రాక్టు విధానంలో పని చేస్తూ వచ్చారు. చివరగా తను అనుకున్న గమ్యాన్ని చేరుకున్నారు.

మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలి

● డాక్టర్ ఉమాశ్రీ, మండల వైద్యాధికారి

నవతెలంగాణ-జన్నారం

పురుషులతో సమానంగా మహిళా మణులు అన్నిరంగాల్లో ముందుండాలి. చదువుతో పాటు ప్రతి రంగాల్లో మహిళలు సమానమైనప్పుడు హక్కులు కూడా సమానంగా ఉండాలి. రాజ్యాంగంలో మహిళ అభ్యున్నతి కోసం కల్పించబడిన చట్టాల పట్ల అవగాహణ పెంచుకోవాలి. చట్టం కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకున్నప్పుడు మహిళలు ముందడుగు వేయగలరు. తమకు నచ్చిన రంగంలో రాణించడం కోసం ప్రయత్నిస్తూ సమాజంలో ఒకరుగా కాకుండా తనకంటూ ప్రత్యేకత అన్నట్టు గుర్తింపు పొందాలి.

తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలి

నవతెలంగాణ-సిర్పూర్(టి)



మండల కేంద్రంలో మిషన్ భగీరథ తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి పృథ్వీ అన్నారు. శుక్రవారం మండలంలో పలు కాలనీలో తాగునీటి సమస్య ఉందని నవతెలంగాణ కథనంలో ప్రచురణమైన విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించారు. దీనిలో భాగంగా పలు కాలనీల్లో వాటర్ ట్యాంక్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం దృష్ట్యా తాగునీటి సమస్య లేకుండా, పైపులైన్ లీకేజీలను క్షుణ్ణంగా పరీక్షించి మరమ్మత్తు పనులు చేసి ప్రతి దినం నీరు సరఫరాయ్యే విధంగా చూడాలని ఏఈలు, గ్రామపంచాయతీ సిబ్బందికి సూచించారు.

రెచ్చిపోతున్న ఇసుక మాఫియా

నవతెలంగాణ-రెబ్బెన



మండలంలో రెచ్చిపోతున్న ఇసుక మాఫియాదారులు ప్రభుత్వ నిబంధనలో ఎన్ని ఉన్నా లెక్కచేయకుండా గంగాపూర్ శివారులో ఉన్న వాగుల నుండి ట్రాక్టర్లతో ఇసుక తీసి రైల్వే పక్కన ఉన్న చేనులో డప్పు ఏర్పాటు చేసి లారీలతో పక్క రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ప్రభుత్వం ఎన్ని నిబంధనలు పెట్టిన విధించిన ఉల్లంఘించి ఇసుక మాఫియా మండలంలోని పరిసర ప్రాంతాల వాగుల నుండి ట్రాక్టర్లతో డంపులు పోయించి, లారీలతో తరలిస్తున్నారు. పోలీసులు, సంబంధిత శాఖ అధికారులకు తెలియకుండానే ఇసుక దందా జోరుగా సాగుతోంది. రాత్రి ఇసుక డంపులను ట్రాక్టర్లను రెబ్బెన పోలీస్ స్టేషన్‌కు తరలించిన సంగతి తెలిసిందే. ఇప్పటికైనా ఇసుక మాఫియాను అరికట్టక పోతే వాగుల నీరు అడుగంటి పోతుందని రైతులు వాపోతున్నారు.

మెరుగైన విద్యను అందించాలి



నవతెలంగాణ-కౌటాల

మెరుగైన విద్యను అందించాలని ఎంఈఓ గావుడె హనుమంతు అన్నారు. శుక్రవారం మండలంలోని ప్రాథమిక పాఠశాల, గుడ్లబోరి ప్రాథమికోన్నత పాఠశాల, సైదాపూర్ వైగాన్, గుండాయిపేట్ పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల పఠన సామర్థ్యాలతో పాటు మధ్యాహ్న భోజనం పరిశీలించి సలహాలు సూచనలు చేశారు. మధ్యాహ్నం భోజనంపై నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గుండాయపేటలో పదవ తరగతి పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. విద్యార్థులకు సరైన దిశ నిర్దేశం చేయాలని ప్రధానోపాధ్యాయులు నానాజీకి సూచించారు. రెండవ తరగతి విద్యార్థులు సైతం ఇంగ్లీష్ టెక్ట్‌బుక్ చదువుతున్నారు. గమనించిన ఎంఈఓ ఇంగ్లీష్‌ఉపాధ్యాయుని అభినందించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

9న పద్మశాలీల మహాసభ విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈనెల 9న హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించే 17వ అఖిలభారత పద్మశాలి మహాసభ, 8వ తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం మహాసభ విజయవంతం చేయాలని పద్మశాలీల సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరుకుల్ల ఆంజనేయులు కోరారు. మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్లను నాయకులతో కలిసి శుక్రవారం జిల్లా కేంద్రంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అఖిల భారత పద్మశాలి సంఘం దేశంలోనే బలమైన సంఘంగా ఎదిగిందన్నారు. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ స్ఫూర్తితో హక్కుల సాధన కోసం ఏకతాటిపై ముందుకు రావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. జిల్లాలోని పద్మశాలీలు అత్యధిక తరలివచ్చి మహాసభలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. ఇందులో రాష్ట్ర నాయకులు గుండా శంకర్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు అనుమాండ్ల శ్రీకాంత్, అల్లె శ్రీకాంత్, గౌరవాధ్యక్షుడు లింగయ్య, నాయకులు గుండా శ్యామ్, శైలేందర్, యేసయ్య, మోహన్, తిరుపతి పాల్గొన్నారు.

సామర్థ్యాల పరీక్షకు ఎఫ్ఎల్ఎన్ సర్వే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థుల్లో మౌలిక భాష, గణిత అభివృద్ధి ప్రక్రియ ద్వారా సాధించిన ఫలితాలను అంచనా వేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన పాఠశాలల్లో బీఎడ్ కళాశాల విద్యార్థుల ద్వారా ఎఫ్ఎల్ఎన్ శాంపిల్ సర్వే చేస్తున్నట్లు సర్వే సమన్వయకర్త, జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్ తెలిపారు. ఎఫ్ఎల్ఎన్ సర్వేకు సంబంధించి జిల్లా కేంద్రంలోని రాజేంద్ర ప్రసాద్ బీఈడీ కళాశాలలో విద్యార్థులకు రెండు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు జిల్లాలో ఎంపిక చేసిన 50 ప్రభుత్వ, లోకల్ బాడీ పాఠశాలల్లో సర్వే ఉంటుందన్నారు. బీఎడ్ కళాశాల నుంచి 55 మంది క్షేత్ర పరిశీలకులను గుర్తించినట్లు తెలిపారు. ఈ సర్వేలో భాగంగా రెండో తరగతి విద్యార్థుల్లో తెలుగు, ఇంగ్లిష్, గణితం సబ్జెక్టులో సామర్థ్యాలను పరిశీలించి ఒక అంచనాకు వస్తారని, ఈ సర్వే మొత్తం 'టాన్జరిన్' అనే మొబైల్ యాప్ ద్వారా జరుగుతుందని వివరించారు. ఎంపిక చేసిన 50 పాఠశాలల్లో రెండో తరగతి చదువుతున్న విద్యార్థుల్లో ప్రత్యేక విధానం ద్వారా ఎనిమిది మంది పిల్లలను గుర్తించి, వారికి మాత్రమే పరీక్ష నిర్వహిస్తామని, ఆ తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా ఫలితాలను విశ్లేషిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు వినోద్, ప్రశాంత్ పాల్గొన్నారు.

తొలి శుక్రవారం పండుగ వాతావరణం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ముస్లిం సోదరులకు ఎంతో పవిత్రమైన రంజాన్ మాస ఉపవాస దీక్షలు శనివారం రాత్రి నెలవంక దర్శనంతో ప్రారంభమైంది. శాంతి, సామరస్యాలు, శాంతియుత జీవన విధానం. పరమత సహనం, ఓర్పు, నిజాయితీ తదితర మానవత్వంతో జీవించే విధానాలకు మార్గనిర్దేశ్యం చేసిన దివ్య ఖురాన్ ఈ నెలలోనే ఆవిష్కృతమైందని విశ్వసించే ముస్లింలు నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలను ఆచరిస్తారు. రోజు వారీగా 5 పూటలా నిర్వహించే ప్రార్థనలకు తోడు తరావి ప్రార్థనలు చేస్తు దివ్య ఖురాన్ పఠనం చేపడతారు. కాగా ఈ మాసంలో తొలి శుక్రవారం రోజు మసీదుల్లో పెద్ద ఎత్తున ముస్లీం సోదరులు నమాజు చేశారు. మౌల్వీలు రంజాన్ మాస ప్రత్యేకను తెలియజేశారు. దీంతో మసీదుల వద్ద పండుగ వాతావరణం కనిపించింది.

ఆర్టీసీ డీఎంకు.. కార్మికులకు పెరిగిన దూరం

- డిపో పరిధిలో నిత్యం ఫిర్యాదులే..?
- బస్సులు లేక ప్రయాణికుల ఇబ్బందులు
- కార్మికులను వేధిస్తున్న ఆఫీస్ సిబ్బంది



హైదరాబాద్ బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రతిరోజు వందలాది మందిని గమ్య స్థానాలకు చేర్చడంలో ఆర్టీసీని మించిన సంస్థ మరొకటి లేదనేది అందరికీ తెలిసిన విషయమే. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉచిత బస్సు కావడంతో ప్రయాణికుల రద్దీ మరింత పెరిగింది. ఈ సమయంలో బస్సులు పెంచి ప్రయాణికులకు నాణ్యమైన సేవలు అందించాల్సి ఉంది. అయితే జిల్లా కేంద్రంలోని డిపోలో డీఎం విశ్వనాథ్‌కు కార్మికులకు మధ్య దూరం పెరగడంతో నాణ్యమైన సేవలు పక్కనపెట్టి అసలైన సేవలు సరిగ్గా అందడం లేదని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.

డీఎంకు కార్మికులకు పెరిగిన దూరం

డిపో పరిధిలో టిమ్ డ్రైవర్లు 45 మంది పనిచేస్తున్నారు. ఆసిఫాబాద్ హైదరాబాద్ డ్యూటీకి మూడు మస్టర్లు ఇవ్వాలని డ్రైవర్లు, వీలు కాదని డిపో మేనేజర్ తెలుపడంతో వివాదం చిలికిచిలికి గాలివానగా మారి డిపో సేవలపై ప్రభావం పడుతోంది. నెల రోజులుగా వీరి మధ్య వివాదం పెరగడం ఏఐటీయూసీ కార్మికులకు అండగా ఉంటూ కేంద్రమంత్రి బండి సంజయ్‌తో పాటు ఎండి సజ్జనార్ కార్యాలయంలో కూడా ఫిర్యాదు చేయడంతో వీరి మధ్య గొడవ ఇప్పట్లో సద్దుమణిగేలా లేనట్లు కనిపిస్తోంది.

డిపో పరిధిలో నిత్యం ఫిర్యాదులే..?

ఆసిఫాబాద్ డిపో పరిధిలో నెల రోజుల నుండి ప్రతిరోజు ఏదో రకమైన ఫిర్యాదు వస్తూనే ఉంది. హైదరాబాద్ బస్సుల విషయంలో ఓవైపు డిపో మేనేజర్ కార్మికులు ఎవరికి వారు పట్టువీడుపు లేకుండా ఉండడంతో డిపో పూర్తిగా ఫిర్యాదుల మయంగా మారింది.

బస్సులు లేక ప్రయాణికుల ఇబ్బంది

డిపో పరిధిలోని టిమ్ డ్రైవర్లు హైదరాబాద్ డ్యూటీకి కండక్టర్ ఇస్తేనే వెళ్తామని చెప్పడంతో పగటిపూట కండక్టర్‌ను ఇస్తూ రాత్రి డ్రైవర్ టికెట్లు ఇస్తున్నట్లు తెలిసింది. అయితే గురువారం రాత్రి 8:45కు వెళ్లాల్సిన హైదరాబాద్ బస్సుకు కండక్టర్ లేకపోవడంతో చేసేదేమీ లేక డ్రైవర్ డిపోలోనే బస్సు ఉంచాడు. రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులు గొడవకు దిగగా డ్యూటీలో ఉన్న కంట్రోలర్ అప్పటికప్పుడు కండక్టర్‌ను కూర్చి బస్సు పంపించాడు. ఇదంతా జరగడానికి గంట సమయం పట్టింది. దీంతో ప్రయాణికులు చేసేదేమీ లేక అక్కడే ఎదురు చూడాల్సి వచ్చింది.

కార్మికులను వేధిస్తున్న ఆఫీస్ సిబ్బంది

డిపో మేనేజర్ టీం డ్రైవర్ల పట్ల కటువుగా ఉండడంతో ఇదే అదునుగా డిపోలో పనిచేస్తున్న ఇతర అధికారులు కార్మికులను వేధిస్తున్నారు. గురువారం రాత్రి ఒక కండక్టర్ తన కూతురు హాస్టల్‌లో చదువుతుందని ఆమెను తీసుకురావడానికి వెళ్తానని తన డ్యూటీ సర్దుబాటు చేయమని కోరాడు. దీనికి సదరు అధికారిణి డ్యూటీ సర్దుబాటు చేయడం కుదరదు నీకు దిక్కున్న చోట చెప్పుకోమని అనడంతో పాటు డీఎం చెప్పిన వినను



రిజర్వేషన్ చూపిస్తున్న ప్రయాణికుడు



అలస్యంగా వచ్చిన బస్సు

అంటూ సమాధానం ఇవ్వడంతో ఆ కండక్టర్ నిరంతరం డ్యూటీ చేసిన తనలాంటి వారికి కూడా ఆఫీస్ సిబ్బంది వేధింపులు తప్పడం లేదని కన్నీటి పర్యంతమయ్యాడు. ఇలా సిబ్బంది డీఎంకు వంతపలుకుతూ కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బస్సులు సమయపాలన పాటించకుంటే ఎలా?

రవీందర్, ప్రయాణికుడు.

బస్సు టికెట్ రిజర్వేషన్ చేయించాను. గంట నుండి బస్సు రాకపోవడం ఎవరు సమాధానం చెప్పకపోవడం విడ్డూరంగా ఉంది. బస్సులు సమయపాలన పాటించకుంటే ఎలా అని ఒకవేళ ప్రయాణికుడు ప్రయాణం రద్దు చేసుకుంటే డబ్బులు వాపస్ ఇస్తారా అని ప్రశ్నించాడు.

నిబంధనల ప్రకారం బస్సులు నడుపుతున్నాం

విశ్వనాథ్, డిపో మేనేజర్

డిపోలో నడుస్తున్న బస్సులు ఆర్టీసీ నిబంధనల ప్రకారం నడుపుతున్నాం. టిమ్ డ్రైవర్ల సమస్య ఆర్టీసీ యాజమాన్యానికి సంబంధించిన నిర్ణయం తీసుకోవాల్సిందే కానీ నా పరిధిలో లేదు. గురువారం బస్సు ఆలస్యం నా దృష్టికి రాగానే పరిష్కారం చేశాను.

డిపో మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలి

భోగే ఉపేందర్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి

డిపో మేనేజర్ కార్మికులను వేధిస్తున్నారు. దీనిపై ఇప్పటికే కేంద్రమంత్రితో పాటు ఆర్టీసీ ఎండీకి ఫిర్యాదు చేశాం. వెంటనే ఆయనను తొలగించి ఆయన స్థానంలో కొత్త డీఎంను నియమించాలి. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేసి కార్మికులకు అండగా నిలుస్తాం.

మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలి

నవతెలంగాణ-కెరమెరి

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి కూటికల ఆనందరావు అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ అంజాత్ పాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాలను పరిశుభ్రత విషయంలో కీలకంగా వ్యవహరించే పంచాయతీ కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. పారిశుధ్యం, మంచినీటి సరఫరా, వీధిలైట్లు డంపింగ్ యార్డ్, హరితహారం, పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠ దామాలు తదితర పనుల్లో నిత్యం శ్రమిస్తున్న శ్రమకు తగ్గ వేతనాలు ఇవ్వడం లేదన్నారు. గ్రామాల్లో, అంటూ వ్యాధులు రాకుండా ప్రజలకు సేవలు అందిస్తున్నారని తెలిపారు. సంవత్సరాల తరబడి విధులు నిర్వహిస్తున్న నేటికీ పనికి భద్రత శ్రమకు తగిన వేతనం అందించడం లేదన్నారు. కార్మికులందరిని పర్మినెంట్ చేసి, కనీసం వేతనం రూ.26,000 చెల్లించాలన్నారు. మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేసి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

మహిళా శక్తికి సాటెవరు రారు : ఎస్పీ శ్రీనివాస్



కేక్‌కట్ చేస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాస్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

లోకంలో మహిళా శక్తికి సాటేమి లేదని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఒకరోజు ముందుగా నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లోనూ అతివలదే పైచేయని వారికి ఎవరు సాటిరారన్నారు. ప్రస్తుత రోజుల్లో మహిళలు ఏదో ఒక్క రంగంలో అని కాకుండా విద్య, వైద్య, పారిశ్రామిక, అంతరిక్ష ఇలా అన్ని రంగాల్లో రాణించడం హర్షనీయమన్నారు. మహిళలకు ఓర్పు, సహనం ఎక్కువని, ప్రపంచానికి వెలుగు చూపేది మహిళ అని అన్నారు. పురుషులతో పోటీపడుతూ ఉద్యోగ అవకాశాల్లో, విధుల్లో వారితో సమానంగా మహిళలు పని చేయడం గొప్ప విషయమన్నారు. ఉన్నతంగా ఆలోచించిన మహిళకు తన కుటుంబాన్ని ఉన్నత స్థాయికి చేర్చే సత్తా ఉంటుందన్నారు. ప్రత్యేకంగా పోలీస్ శాఖలో తమ విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. మహిళా సాధికారతతోనే అభివృద్ధి సాధ్యమని, ప్రతి ఒక్క మహిళ కూడా అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం మహిళా పోలీస్ సిబ్బందితో కలిసి కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో డీసీఆర్బీ డిఎస్పీ కరుణాకర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ రాణా ప్రతాప్, ఆర్.ఐ అడ్మిన్ పెద్దన్న, డీసీఆర్బీ ఇన్స్‌పెక్టర్ శ్రీధర్, ఆసిఫాబాద్ సీఐ రవీందర్, ఎంటీఓ ఆర్ఐ అంజన్న, ఎస్ఐలు తేజస్విని, సౌమ్య, తిరుమల, శిరీష, భరోసా కేంద్రం, షీ టీం, ఐటీ కోర్, డీసీఆర్బీ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

నవతెలంగాణ-సిర్పూర్(టి)

విద్యార్థి దశలోనే భవిష్యత్తులో లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఆ దిశగా సాగాలని ఇంపాక్ట్ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షురాలు చెంచులక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని ఆశ్రమ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన మోటివేషన్ అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సమయం దగ్గర పడుతుందని భయాందోళనకు గురికాకుండా ప్రశాంతంగా ఉండాలన్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రకాంత్ శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో ఇంపాక్ట్ ఫౌండేషన్ క్లబ్ సభ్యులు దుర్గ



రాజేశ్వరి, మౌనిక, శృతి, పద్మ సుజాత, కవిత, లక్ష్మి, విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్‌పై విస్తృత ప్రచారం నిర్వహించాలి : అదనపు కలెక్టర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో లే-అవుట్ ప్లాట్ల క్రమబద్ధీకరణపై ప్రజలకు తెలిసే విధంగా విస్తృత ప్రచారం నిర్వహించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి గౌడ్‌తో కలిసి ఎల్ఆర్ఎస్ ప్రక్రియపై పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ కమిషనర్లు, వార్డు అధికారులు, రెవెన్యూ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లే అవుట్ ప్లాట్ల క్రమబద్ధీకరణ దరఖాస్తులలో అర్హులైన వారు సుమారుగా 2,300 మంది దరఖాస్తుదారులు ఈ నెల 31వ తేదీ నాటికి పూర్తి ఫీజు చెల్లిస్తే 25 శాతం ఫీజు తగ్గించేందుకు అవకాశం ఉందని తెలిపారు. ఈ విషయంపై ఫీజు చెల్లించేందుకు దరఖాస్తుదారులు సమాచారం అందించి ఫీజు చెల్లించే విధంగా పంచాయతీ కార్యదర్శులు, వార్డు అధికారులు విస్తృత ప్రచారం చేపట్టి ఫీజులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని, మిగతా దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి అర్హులైన వారందరికీ ఎల్-1 నుండి ఎల్-2 లాగిన్‌కు పంపాలని, అవసరమైన డాక్యుమెంట్లు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్లు భుజంగరావు, అంజయ్య, పంచాయతీ కార్యదర్శులు, వార్డు అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

12 నుండి చేపట్టే సమ్మెను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గిరిజన హాస్టల్ వర్కర్ల సమస్యలపై ఈ నెల 12 నుండి జరుగనున్న సమ్మెను జయప్రదం చేయాలని గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్ డైలీవేజ్, అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు టేకం ప్రభాకర్ కోరారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి రమాదేవికి గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న డైలీవేజ్, అవుట్ సోర్సింగ్ వర్కర్ల సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఓ 64 అమలు నిలిపివేయాలని, పాత పద్ధతిలోనే కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలు చెల్లించాలని, పెండింగ్ వేతనాలు చెల్లించాలని, 212 జీఓను సవరించి 2014 నాటికి 5 సంవత్సరాల సర్వీస్ ఉన్న వారందరిని పర్మినెంట్ చేయాలన్నారు. కొత్త మెనూ వల్ల పెరిగిన పనిభారానికి అనుకుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు. అనంతరం యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వెలిశాల క్రిష్ణమాచారి మాట్లాడుతూ వయస్సు మళ్లిన వర్కర్ల కుటుంబ సభ్యులలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, పూర్తికాలం పనిచేస్తున్న కార్మికులకు పూర్తి వేతనాలు చెల్లించాలని, మరణించిన కార్మికుల కుటుంబసభ్యులను డైలీవేజ్ వర్కర్లుగా నియమించాలని, విద్యార్థులతో పాటు కార్మికులకు కూడా 2 జతల యూనిఫాం ఇవ్వాలని కోరారు. ఎండాకాలం సెలవులలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం సమ్మె బాట పట్టనున్నామని మార్చి 12న జరిగే సమ్మె కు వర్కర్లు అందరూ సిద్ధం కావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

ఉపాధి హామీని కూలీలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఆల్బర్ట్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఎలుకపెల్లి, బొంబాయి గూడ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పని ప్రదేశంలో కనీస వసతులు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ఉపాధి కూలీలతో మాట్లాడుతూ కూలీలు కనీసం రూ.200 నుండి రూ.300 వరకు వేతనం పడేలాగా కొలతల ప్రకారం పని చేసి, ఉదయాన్నే పని ముగించుకోవాలని, వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. లేబర్ డిమాండ్ పెంచి ఎక్కువ మొత్తం లో కూలీలు పనికి వచ్చేలా గా ప్రయత్నం చేయాలని ఆదేశించారు. బొంబాయి గూడలో నర్సరీ సందర్శించి మొక్కలు వంద శాతం జర్మినేషన్ వచ్చేలా సిబ్బంది జాగ్రతలు తీసుకోవాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ కూలీల రోజువారీ సంఖ్య, లేబర్ డిమాండ్ మరింత పెంచి, నాణ్యమైన పనులు చేయించాలన్నారు. ఆయనతో పాటు ఏపీఓ సతీష్, పంచాయతీ కార్యదర్శులు నరేష్, చంద్రశేఖర్ ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ అల్బర్ట్ అన్నారు. మండలంలోని లోడ్పల్లి గ్రామంలో లబ్ధిదారులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం లబ్ధిదారులు నిర్దిష్ట గడువులోగా ఇంటి నిర్మాణాలు చేపట్టాలని వారికి సూచించారు. లబ్ధిదారులు నిర్మాణ సామాగ్రి కొనుగోలు చేయడం పరస్పర సహకారంతో ఉమ్మడిగా ఈ పథకాన్ని విజయవంతం చేసే విధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శ్రీధర్, చంద్రశేఖర్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
శనివారం | మార్చి 08, 2025 | www.navatelangana.com

మహిళలే దేశ ప్రగతి సాధకులు



• డాక్టర్ దివ్య, జనరల్ సర్జన్

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

మహిళలే దేశ ప్రగతి సాధకులని డాక్టర్ దివ్య అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆమె నవతెలంగాణతో మాట్లాడారు. ముందుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా తోటి మహిళలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. నేను మహిళగా ఎంతో గర్విస్తున్నాను. నేటి సమాజంలో స్త్రీల పాత్ర అభినందనీయంగా ఉంది. మహిళలందరూ తమ ఉనికిని చాటుకొని స్వశక్తితో, ఆత్మగౌరవంతో ఉన్నత స్థితికి చేరుకోవాలి. మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి. అన్ని రంగాలలో రాణించాలని తెలిపారు. స్త్రీ విజయానికి పురుషుడు మార్గమై నిలువాలి, అప్పుడే దేశం అభివృద్ధి చెందుతుంది.

విద్యతోనే మహిళల అభివృద్ధి

నవతెలంగాణ-ముధోల్

విద్యతోనే మహిళలు అభివృద్ధి చెందుతారని ఉపాధి హామీ చట్టం ఏపీఓ శిరీష అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా నవతెలంగాణతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ చదువుకుంటూనే అన్ని రంగాల్లో మహిళలు రాణించవచ్చని ఆమె తెలిపారు. మన ఆడ పిల్లలకు కూడా బాగా చదివించాలని అన్నారు. ఉపాధి హామీ చట్టం కింద కూలీలకు ఉపాధి కల్పించటంలో తాను ఏపీఓగా పనిచేయటం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా మహిళలకు అంతర్జాతీయ మహిళ దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు.



మేము సైతం... పోలీస్‌శాఖలో...

• పురుషులకు దీటుగా ఉద్యోగాలు • అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు

నేటి సమాజంలో పురుషులకు దీటుగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. గతంలో వంటింటికే పరిమితమైన మహిళలు నేడు అన్ని రంగాల్లో ఆదర్శంగా ముందుకు సాగుతున్నారు. ఒకానొకప్పుడు పోలీస్ వ్యవస్థలో కేవలం పురుషులు మాత్రమే ఎక్కువమందిని చూసేవాళ్లం. కాని ఇప్పుడు పోలీస్ రంగంలోనూ మహిళలు, యువతులను చూస్తున్నాం. పోలీస్ జాబ్ అంటేనే రిస్క్‌తో కూడుకున్నది. పురుషులనే చేయొద్దని చాలా మంది తల్లిదండ్రులు ప్రోత్సహించలేదు. ఇప్పుడు మహిళలను తమ తల్లిదండ్రులు ఎంతో ప్రోత్సహిస్తున్నారు. పురుషులతో సమానంగా రాణించాలని ఆలోచిస్తూ, మహిళలకు మద్దతుగా నిలుస్తున్నారు. ఇటీవల తాజా పోలీస్ బ్యాచ్‌లో చాలా మంది యువతులు కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగాలను చిన్న వయసులోనే సాధించారు. కాగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని ఇటీవల పోలీస్ రంగంలో ఉద్యోగం సాధించిన మహిళలు నవతెలంగాణతో వారి అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మహిళలు ఏదైనా ఉద్యోగం సాధించాలి



మహిళలు అంటే ఏదైనా ఒక రంగంలో రాణిస్తూ ముందుకు సాగాలి. ఉద్యోగం సాధించాలంటే దాని కోసం కష్టపడాలి. నేను టీచర్ కావాలి అనుకున్నాను. పోలీస్ నోటిఫికేషన్ రావడంతో దరఖాస్తు చేసుకున్నా, ఫిట్నెస్ లేకున్నప్పటికి చాలా కష్టపడి ట్రైనింగ్‌లో ఆటంకాలు ఎదుర్కొని, ఉద్యోగం సాధించాను. నాన్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి కావడంతో మొదటి నుంచి ఎదైనా ఉద్యోగం సాధించాలని చెప్పేవాడు. నాన్న కష్టాన్ని గుర్తించి ఉద్యోగం సాధించాను.

శాంతపురి శ్వేత, టూటౌన్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్

ఎస్సై కావడమే లక్ష్యం



ఎస్సై కావడమే తన లక్ష్యమని, ఈ పోలీస్ ఉద్యోగం చేయడంతో చాలా రెస్పెక్ట్ ఉందని ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ యువ కానిస్టేబుల్ కుమ్ర సుజాత పేర్కొన్నారు. ముందుగా అందరికీ మహిళ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మాది తలమడుగు మండలం పూనగూడ టీచర్ కావాలని అనుకున్నాను. పోలీస్ నోటిఫికేషన్ రాగానే దరఖాస్తు చేసుకొని, జాబ్ కోసం ప్రయత్నం చేయగా తొలి ప్రయత్నంలోనే కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాను. ఇప్పుడు ఎస్సై కావాలని లక్ష్యం పెట్టుకున్నాను. ఆ దిశగా ప్రయత్నం చేస్తూ, ముందుకు సాగుతాను. జాబ్ సాధించే ప్రయత్నంలో ఫ్యామిలీ, ఫ్రెండ్స్ సపోర్ట్ చాలా బాగా ఉండేది. మనం ఏదైనా ఒకటి సాధించాలని అనుకున్నప్పుడు ఒకరి మీద ఆధారపడొద్దు.

రూరల్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ కుమ్ర సుజాత

ఐపీఎస్ కావడమే నా లక్ష్యం



మహిళలు ముఖ్యంగా స్వతహాగా నిర్ణయాలు తీసుకోని లక్ష్యాన్ని ఛేదించాలని వన్ టౌన్‌కు నూతనంగా ఎస్సైగా వచ్చిన సట్లపల్లి పూజ పేర్కొన్నారు. ముందుగా మహిళ మణులందరికి మహిళ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మాది. ఐపీఎస్ కావాలన్నదే నా లక్ష్యం, పోలీస్‌శాఖలో చేరాలన్న నా లక్ష్యానికి ఇంట్లో వాళ్లు కూడా బాగానే సపోర్ట్ చేశారు. ఉద్యోగం సాధించే క్రమంలో ఎన్నో ఆటంకాలను ఎదుర్కొన్నాను. 2021లో హైదరాబాద్ టీసీఎస్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగంలో చేరాను. ఆ ఉద్యోగం చేస్తూనే పోలీస్ ఉద్యోగానికి ప్రయత్నించాను. చివరగా జాబ్ రావడంతో సంతోషం అనిపించింది. ప్రస్తుతం ఈ జాబ్ చేయడంలో వివిధ కేసులను పరిశీలిస్తున్నాను. జీవితంలో మనం దేనినైనా ఒక ఛాలెంజ్‌గా తీసుకొని ముందుకు సాగాలి. అప్పుడే మనకు కావాల్సింది దొరుకుతుంది. పనిచేసే ప్రదేశం ఏదైనప్పటికి, చేస్తూ ఉండాలి. ముందుకు సాగుతూ పోవాలి.

ఎస్.పూజ, ఎస్సై, వన్ టౌన్ పోలీస్ స్టేషన్

డాక్టర్ కావాలనుకున్నా.. పోలీసు అయ్యాను..



డాక్టర్ కావాలనుకున్న తను ఆర్థిక పరిస్థితుల్లో కాలేకపోయాను కాని ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యం ఉండటంతో పోలీస్ కావాలని అనుకున్నాను. అందుకు ప్రిపేర్ అయ్యాను. అప్పుడే నాకు పెళ్లయింది. మా వారికి కూడా ఒంటిపై కాకి డ్రెస్ వేసుకోవాలన్న గోల్ ఉండేది. ఇద్దరి లక్ష్యం ఒకటి కావడంతో కష్టపడి కానిస్టేబుల్ ఉద్యోగం ఒకటేసారి సాధించాం. ఆయన పేరు పురుషోత్తం జాదవ్ ప్రస్తుతం తలమడుగు పీఎస్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. నేను మావల పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్నాను. పోలీస్ జాబ్ చేయడానికి ఇంట్లో వాళ్ళు సపోర్ట్ చేశారు. పెళ్లయ్యాక మావారు సపోర్ట్ చేశారు. ఇప్పుడు నాకు టీచర్ కావాలని ఉంది. ఇది వరకే టెట్ రాసి క్వాలిఫై అయ్యాను. డీఎస్సికి ప్రిపేర్ అవుతూ ఈ జాబ్ చేస్తున్నాను. మనకు ఏదైనా కావాలంటే అది సాధించే వరకు శ్రమను ఆపొద్దు. దాన్ని ఎలాగైనా సాధిస్తామన్న దృఢ సంకల్పం ఉండాలి. అప్పుడే మనం దేనినైనా సాదించగలుగుతాం.

చవాన్ రవినిక, కానిస్టేబుల్, మావల పోలీస్ స్టేషన్

దాడులకు వ్యతిరేకంగా పోరాడాలి

• కె.లక్ష్మీ, జిల్లా కార్యదర్శి, పీఓడబ్ల్యూ

నవతెలంగాణ-నిర్మల్



మహిళాలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరముందని పీఓడబ్ల్యూ(ప్రగతిశీల మహిళ సంఘం) జిల్లా కార్యదర్శి కే.లక్ష్మీ అన్నారు. మార్చి 8న అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవ పునస్కరించుకొని నవతెలంగాణతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న మహిళ వ్యతిరేక విధానాలపైన నిరంతరం పోరాడాలన్నారు. రోజురోజుకు మహిళలపైన దాడులు దేశవ్యాప్తంగా తీవ్రతరం అవుతున్నాయన్నారు. మణిపూర్ లాంటి ఘటనలను సృష్టించిందన్నారు. పరువు హత్యల పేరుతోటి ఎక్కడబడితే అక్కడ విచ్చలవిడిగా మహిళలను పురుషులను చంపుతూన్నారన్నారు. స్త్రీ పురుష సమానత్వం నేటికీ సాధించలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని రంగాలలో మహిళలు రాణిస్తున్న వివక్ష మాత్రం కొనసాగుతూనే ఉందన్నారు. వీటికి వ్యతిరేకంగా మహిళ లోకం పెద్ద ఎత్తున ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. స్వాతంత్రం వచ్చి 76 సంవత్సరాలు గడిచిపోయిందని, మహిళల పరిస్థితి మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడ లాగానే ఉందిని విమర్శించారు. 13 నిమిషాలకు ఒక్క మహిళ మరణ వార్త వినే పరిస్థితి దేశంలో ఉందన్నారు. అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం సందర్భంగా స్త్రీ, పురుష సమానత్వానికి మహిళలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమించాలన్నారు.

విద్యావంతులు రాజకీయాల్లోకి రావాలి

• ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఏ రంగంలో అయిన మహిళలు ఉన్నతంగా రాణించాలని ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన పేర్కొన్నారు. ఎవరి మీద ఆధారపడకుండా స్వతహాగా పైకి వచ్చేలా మహిళలు, యువతులు ప్రయత్నం చేయాలన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని ఆమె నవతెలంగాణతో మాట్లాడారు. ముందుగా అందరికీ మహిళ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు ఏ ఫీల్డ్‌లో, ఏ రంగంలో పని చేసిన సరే ముందంజలో ఉండాలి. చదువుకున్న వాళ్లు, విద్యావంతులు పాలిటిక్స్‌లో రావాలి. ఫ్యామిలీ సపోర్ట్‌తోనే ప్రస్తుతం ఈ స్థాయికి వచ్చాను. మధ్య తరగతి నుంచి ఒక ఉన్నత స్థాయికి మహిళలు రావాలంటే చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఎంతటి ఆటంకాలు ఎదురైన మనం అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలి. పురుషులతో పాటు స్త్రీలు సమానంగా రాణించాలి. ఆర్టీసీలో కూడా అన్ని క్యాటగిరిల్లో మహిళ ఉద్యోగులు ఉన్నారు. నేను చేసే ఈ ఉద్యోగంలో ఏ అర్ధరాత్రి బస్సుకు ప్రమాదం జరిగిన వెళ్లాలి. నా బాధ్యతగా నిర్వర్తించాలి నా వృత్తిని నేను సంతోషంగా చేసుకుంటాను. సొంత జిల్లాలోనే ఉద్యోగం చేయడం చాలా సంతోషంగా ఉంది.

పోలీస్ ఉద్యోగంలో రాణిస్తూ..
ఆదర్శంగా నిలుస్తూ..

• రాధిక ఎస్సై తాంసి

నవతెలంగాణ-తాంసి



పోలీసు ఉద్యోగంలో మహిళలు చేరాలంటే ఎంతో ఓర్పు ధైర్యం ఉంటే గాని పోలీసు ఉద్యోగంలో చేరడం, ఉద్యోగం చేయడం మామూలు విషయం కాదు అలాంటి ఉద్యోగంలో కొలువు సాధించి ప్రజలకు సేవ చేస్తోంది. ఎస్సై రాధిక నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలంలోని వటోలి గ్రామానికి చెందిన రాధిక వ్యవసాయ కుటుంబానికి చెందినప్పటికీ ఉద్యోగం సాధించాలనే ధృడ సంకల్పంతో పోలీస్ ఉద్యోగానికి తీవ్ర ప్రయత్నం చేసింది. రాష్ట్రస్థాయి ప్రభుత్వం ఉద్యోగానికి ప్రయత్నించిన క్రమంలో ఏకంగా మొదటి ప్రయత్నంలోనే 2020 సంవత్సరంలో సంవత్సరంలో పోలీస్ ఎస్సై ఉద్యోగానికి ఎంపికయింది. మొదట ఇద్దరు అన్నదమ్ములతో పాటు కుటుంబ సభ్యులు పోలీస్ ఉద్యోగం వద్దన్నారు. అందులో ఎస్సై ఉద్యోగంలో మహిళగా విధులు నిర్వహించడం రాత్రి పగలు తేడా లేకుండా విధులు నిర్వహించాల్సి వస్తుందన్నారు. కానీ రాధిక కుటుంబ సభ్యులకు అన్ని విధాల నచ్చజెప్పి ఎస్సై ట్రెనింగ్ పూర్తి చేసి మొదటి పోస్టింగ్‌గా భీంపూర్ మండలం పోలీస్ స్టేషన్ ఎస్సైగా విధుల్లో చేరింది. విధుల్లో చేరినప్పటి నుండి ఆయా మండలాల్లోని శాంతి భద్రతలో తమ వంతుగా విధులు నిర్వహిస్తూ, అందరి మన్ననలు పొందుతున్నారు. ప్రస్తుతం తాంసి పోలీస్ స్టేషన్ ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్నారు. మహిళలు తమకు నచ్చిన ఏ రంగంలోనైనా తమ ప్రతిభను చాటి స్వతహాగా ఎదిగి ముందుకు సాగాలన్నారు. ముఖ్యంగా ధైర్యం, పట్టుదల కలిగి ఉన్నప్పుడే విజయం సాధిస్తారని అన్నారు.

విద్యార్థుల సంరక్షణకు 'పోలీస్ అక్క'

• ఎస్పీ డా. జానకి షర్మిల • ఆత్మవిశ్వాసంతో అవాంతరాలు ఎదుర్కోవాలి



నవతెలంగాణ-నిర్మల్

రాష్ట్రంతో పాటు దేశంలోనే ఎక్కడ లేని విధంగా పోలీస్ శాఖ అనే నినాదంతో ప్రయోగాత్మకంగా విద్యార్థుల రక్షణ కోసం పోలీస్ అక్క కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల తెలిపారు. కేజీబీవీల్లో ప్రతి నెల ఓ మహిళా కానిస్టేబుల్ అక్కడ రాత్రి బస చేసి అక్కడ విద్యార్థుల సమస్యలు తెలుసుకుని సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకునే విధంగా ఈ నిర్ణయం తీసుకున్నాని తెలిపారు. దీంతో విద్యార్థినులకు ఎంతో భరోసా కల్పించడం జరుగుతుందని వెల్లడించారు. అలాగే పెట్రో బ్లూ కోర్స్‌లలో మహిళల పోలీసులు ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మరెన్నో శాంతి భద్రత భద్రతలు, మహిళ సంరక్షణ చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నామని వివరించారు. ఏ సమయంలో అయినా సమస్య వచ్చినప్పుడు మహిళలు సమస్యలు తలెత్తినప్పుడు ఆశ్రయించాలని తెలిపారు. పోలీస్ శాఖ ఎల్లవేళల వారికి భరోసా ఇస్తుందని వెల్లడించారు.


ఆత్మవిశ్వసంతో అవంతరాలు ఎదుర్కొవాలి...

మహిళలు ఆత్మవిశ్వాసంతో నిత్య జీవితంలో ఎన్ని అవంతరాలు వచ్చిన ఎదుర్కోవాలని, శాంతి భద్రతలు మహిళ భద్రతలకు పోలీస్ శాఖలు ఎల్లవేళలా వెంట ఉంటుందని ఎస్పీ అన్నారు. ఈ రోజుల్లో మహిళలు, పురుషులతో సమానంగా ఎన్నో ఉన్నత స్థానాలు అధిరోహిస్తున్నారని తెలిపారు. మహిళల భద్రత సంరక్షణకై పోలీస్ శాఖ ముందుంటుందన్నారు. భార్య భర్తల గొడవలను సమన్వయం పరచడానికి, వారిని ఏకం చేయడానికి భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఆరు నెలల వ్యవధిలో 50 మంది జంటలను కౌన్సెలింగ్ ఇచ్చి సయోధ్య కుదిరించామని వివరించారు. అలాగే తమకు ఏదైనా సమస్యలపై ఫిర్యాదులు వస్తే నేరుగా వారి ఇంటికి వెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చి సమస్యను సర్దు మణిగేల చర్యలు చేపట్టిన పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే షీటీంల ద్వారా పాఠశాలలు, కళాశాలలో విద్యార్థినులకు పలు చట్టాలు, మహిళ హక్కులపై అవగాహన సదస్సులు నిర్వహించామని తెలిపారు. గతేడాదితో పోలిస్తే జిల్లాలో క్రైమ్ రేటు 50 శాతం తగ్గిందని వెల్లడించారు. ముఖ్యంగా విద్యార్థులు మహిళలు మోసపూరితమైన ఫేక్ మెసేజ్‌లు, యాప్‌లు, మొబైల్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. ఏదైనా సమస్య తలెత్తితే 100 డయల్‌కు ఫోన్ చేయాలని సూచించారు. జిల్లాలో ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు దుర్ఘటనలు జరుగుతే ఆ స్థలానికి బ్లూ కోర్స్, పెట్రోల్ కాళ్లు కేవలం ఐదు నిమిషాల్లో చేరుకొని సమస్యలను పరిష్కరిస్తున్నమని తెలిపారు. ఇది జిల్లాకి గర్వకారమని వెల్లడించారు. భద్రత నేపథ్యంలో జిల్లాలో స్పెషల్ బెటాలియన్లను తేప్పిస్తున్నామని వెల్లడించారు.

హక్కులు, చట్టాలపై అవగాహన ఉండాలి

• ఆదిలాబాద్ ఉపాధి కల్పన అధికారి మిల్కా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



మహిళలు తమకున్న చట్టాలు, హక్కులు తెలుసుకోవాలి, తెలుసుకునేందుకు ప్రయత్నం చేయాలి, అన్నింట్లో అవగాహన పెంచుకుంటూ ముందుకు సాగాలని ఆదిలాబాద్ ఉపాధి కల్పన అధికారి మిల్కా పేర్కొన్నారు. మనకు ఏదైనా సమస్య వచ్చినప్పుడు ఎం చేయాలో కనీస అవగాహన ఉండాలన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం పురస్కరించుకుని నవతెలంగాణతో మాట్లాడారు. ముందుగా మహిళ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు ముఖ్యంగా సెల్ఫ్ కాన్ఫ్ డెన్స్‌తో ఉండాలి. ఏదైనా సమస్య ఎదురైనప్పుడు శాంతియుతంగా పరిష్కరించుకోవాలి. మహిళల కోసం సఖి సెంటర్ చాలా ఉపయోగపడుతుంది. ఎలాంటి భయం మొహమాటం లేకుండా సఖిలో మీ సమస్య చెప్పుకుంటే పరిష్కారం అవుతుంది. మహిళలు ఎవరి మీద ఆధారపడకుండా మనకంటూ ఒక పొజిషన్ ఉండాలనే ఆలోచనతో ముందుకు సాగాలి. నేను కూడా చదువుతూ అన్ని తెలుసుకుంటూ ఫ్యామిలీ సపోర్ట్‌తో ముందుకు సాగితే ప్రస్తుతం ఈ ఉద్యోగం చేస్తున్నానని అన్నారు. ఎన్నో రకాల రిజర్వేషన్లు, చట్టాలు, హక్కులు వాటి గురించి అవగాహన చేసుకోవాలి. ఏదైనా సమస్య వచ్చినప్పుడు కొందరు ఏమి ఆలోచించకుండా క్షణికావేశానికి లోనై ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. అది చాలా పెద్ద తప్పు ఒక సమస్య ఎదురైతే మనం జీవితమే కోల్పోవడం తప్పన్నారు. ఎన్నో మార్గాలు ఉంటాయి. ఎంతో భవిష్యత్ ఉంటుంది. మెచ్యూర్‌గా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. నిరుద్యోగ యువతులు సైతం జాబ్ మేళాలు సద్వినియోగం చేసుకొని ఏదైనా ఒక రంగంలో రాణిస్తూ తమ కాళ్ళ మీద తాము నిలబడుతూ ముందుకు సాగాలి.

మహిళలకు మరింత రక్షణ కల్పించాలి

• డా.సాధన డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఆదిలాబాద్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



మహిళలు చదుకోవాలని, చదువుతోనే అన్ని సాధ్యమవుతాయని దీనితోనే సమాజంలో గౌరవం పేరుగుతుందని ఆదిలాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా.సాధన అన్నారు. జీవితంలో చదువుతోనే ఏమైనా సాధించవచ్చని, చదువును ఆపేయొద్దని అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం పురస్కరించుకుని నవతెలంగాణతో ఆమె మాట్లాడారు. ముందుగా అందరికీ మహిళ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. తల్లిదండ్రులు ఆడపిల్లల చదువును మధ్యలోనే ఆపేసి పెండ్లిలు చేస్తున్నారు. అలా ఆపకూడదన్నారు. జీవితంలో చదువు చాలా ముఖ్యమన్నారు. పదో తరగతి పూర్తవ్వకముందే పెండ్లిలు చేయడం నేరమన్నారు. ఇలా చేయడంతో వారికి భర్త విషయంలో ఏదైన సమస్య ఎదురైనప్పుడు ఏం చేయాలన్న కనీస అవగాహన లేకుండా పోతుందన్నారు. మహిళలు ఎవరి మీద ఆధారపడకుండా ఎదుగాలన్నారు.

బాల్యం నుంచే ఆత్మవిశ్వాసం నింపాలి

• డా. జి.రజని ప్రసన్న పిల్లల వైద్య నిపుణురాలు



నవతెలంగాణ-నిర్మల్

ఆడపిల్లలకు చిన్నతనం నుండే ఆత్మ విశ్వాసం నింపుతూ భరోసానివ్వాలని పిల్లల వైద్య నిపుణురాలు డా. జి.రజని ప్రసన్న(ఎంబీబీఎస్, డీసీహెచ్) అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా ఆమె నవతెలంగాణతో మాట్లాడారు. ఆడపిల్లలు ఉన్నత స్థాయికి ఎదగాలంటే చదువు అనేది ప్రాధాన్యతతో కూడుకుందన్నారు. అలాగే వారి ఆత్మ రక్షణ కోసం సెల్ఫ్ డిఫెన్స్ లాంటి శిక్షణలు ఇప్పించాలి. ఆడపిల్లలు ఏవైనా సమస్యలు తలెత్తుతే కుటుంబ సభ్యులతో పంచుకోవాలి. తమకంటూ ఇష్టమైన రంగంలో ఒక నిర్దిష్ట లక్ష్యాన్ని జీవితంలో పెట్టుకొని పట్టుదలతో సాధించేలా కృషి చేయాలి. భద్రత విషయంలో సోషల్ మీడియా, అనవసరమైన ఫోను యాప్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలి. కష్టాలొచ్చినా మనోధైర్యాన్ని కోల్పోకుండా ఉన్నప్పుడే మహిళలు పురుషులతో సమానంగా ఎదిగే అవకాశం ఉంటుంది. ఇప్పటికే దేశ రాష్ట్రపతితో పాటు ఎందరో మహిళలు రాజకీయాలతో పాటు అనేక రంగాల్లో పురుషులతో సమానంగా నిలుస్తున్నారు. ముఖ్యంగా సమాజంలో ఇప్పటికి ఆడపిల్లలు జన్మిస్తే కుటుంబ సభ్యులు అసంతృప్తికి గురవుతున్న సంఘటన ఉన్నాయి. అలాగే మహిళల పట్ల సమాజంలో వివక్ష సైతం నెలకొంది. వీటన్నిటిని అధిగమించి మహిళలు ఉన్నత స్థానంలో నిలవాలంటే ప్రభుత్వాలు సైతం ప్రత్యేక చట్టాలు తీసుకొచ్చి వాటిని అమలు చేయాలన్నారు. ఆడపిల్లలకు పాఠశాలలతో పాటు కళాశాలల దశలోనే మహిళ సాధికారత, చట్టాలపై అవగాహన కల్పించాలి. ఎన్ని కష్టాలొచ్చినా ఆత్మవిశ్వాసం కోల్పోకుండా తమ లక్ష్యసాధనకే ముందుకు దూసుకు వెళ్లాలని ఆకాంక్షించారు.

డబ్బు కన్నా విలువైంది చదువు మాత్రమే

• పీడీ డా.అనిత ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉట్నూర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



జీవితంలో డబ్బు కన్నా విలువైంది చదువు మాత్రమే. చదువుతూ పోతే ఆలోచన శక్తి పెరుగుతుంది. చదువుతో జీవితంలో ఏదైనా సాధించవచ్చని ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పీడీ డా.అనిత అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం పురస్కరించుకుని నవతెలంగాణతో ఆమె మాట్లాడారు. ముందుగా అందరికీ మహిళ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. నాన్న పెండ్లి చేద్దామనుకున్న సమయంలో నేను ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధిస్తానని చెప్పి ఉద్యోగం సాధించి నాన్న కండ్ల ఆనందాన్ని చూశాను. ప్రస్తుతం పీడీగా కొనసాగుతున్నాను. అదేవిధంగా పీహెచ్‌డీ పట్టా పొందాను. ఇటీవల ఒక పుస్తకాన్ని రచించడం మొదలు పెట్టాను. చదువు ఉంటే ఏదైనా సాధించగలమన్న ఆలోచన, ధైర్యం మనలో ఉంటుంది.

మహిళలు స్వతంత్రంగా బతకాలి



• డా. ఎన్.గాయత్రి, చర్మవ్యాధ నిపుణులు

నవతెలంగాణ-నిర్మల్

మహిళలు స్వాతంత్ర్యంగా బతకాలి, తమనుతాము కాపాడే విధంగా ఉండాలని చర్మవ్యాధి నిపుణురాలు డా. ఎన్.గాయత్రి మహిళకు సూచనలు అందించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నవతెలంగాణతో మాట్లాడారు. నాటి నుంచి నేటి వరకు మహిళలు వివేక్షతకు లోనైఅవుతూ వస్తున్నారు. కానీ ప్రస్తుతం ఈ రోజుల్లో ఒక రాష్ట్రపతి దేశానికి మహిళాని మర్చిపోవద్దు. అలాగని రాజకీయాలతో పాటు అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారు. అదే స్ఫూర్తితో ప్రతి విద్యార్థిని, మహిళలు ఒక లక్ష్యం నిర్దేశించుకుని తమ లక్ష్య సాధన కోసం నిరంతరం పట్టుదలతో సాధించాలి. ఉన్నత స్థానాలు అధిరోహించాలి, ఆత్మ రక్షణతో పాటు సెల్ఫ్ డిఫెన్స్‌లో మహిళలు ముందుండాలి. ప్రస్తుతం ఈరోజుల్లో ఏ మహిళ కూడా పురుషులకు తగకుండాపై స్థాయిలో ఉన్న రోజులున్నాయి. ముఖ్యంగా ఈ దేశానికి రాష్ట్రపతి ఓ మహిళ అని మర్చిపోవద్ద కానీ కొన్ని ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ ఉండాలి. ఆత్మవిశ్వాసం కోల్పోకుండా తమ తమ లక్ష్యాలను చేదించుకుంటూ ముందుకు వెళ్లాలి. అప్పుడే మహిళ సాధికారత సాధ్యమవుతుంది.

మహిళ చట్టాలపై అవగాహన అవసరం

• గజిటెడ్ నెంబర్ వన్ ప్రధానోపాధ్యాయులు నీలాదేవి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్



మహిళలందరూ చట్టాలపై అవగాహక కలిగి ఉండటం అవసరమని గజిటెడ్ నెంబర్ వన్ ప్రధానోపాధ్యాయురాలు నీలాదేవి అన్నారు. అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా నవతెలంగాణతో మాట్లాడారు. మన దేశంలో అనాదిగా ఆడవాళ్లని ఆదిశక్తి రూపమని గౌరవిస్తున్నా. నాణేనికి మరోవైపు ఆడవాళ్ల మీద అత్యాచారాలు, సామాజికంగా దాడులు జరుగుతూనే ఉన్నాయి. రాజ్యాంగం మహిళలకు అనేక హక్కులను కల్పించిందని అన్నారు. నిర్భయ, గృహహింస వంటి అనేక చట్టాలు అందించినా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ వంటి ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసినా, ఆ చట్టాల పట్ల ఇప్పటికీ మహిళలకి సరైన అవగాహన ఉండకపోవడం బాధాకరమన్నారు. ఓ వైపు ఇప్పటికీ పురుషులతో పోల్చుకుంటే అక్షరాస్యతలోనూ స్త్రీలు వెనకబడి ఉన్నారు. హర్యానా వంటి రాష్ట్రాలలో లింగ నిష్పత్తి మరీ ఎక్కువ అయిపోతుంది. ఇక సామాజిక మాధ్యమాలపై సరైన అవగాహన లేక వాటి వలలో చిక్కుకొని ఆర్థికంగా, లైంగికంగా మోసపోతున్న మహిళలు చాల ఉంటుంటున్నారన్నారు. వీటన్నింటినీ నిరోధించడానికి ప్రభుత్వాలు ఉమెన్ హెల్ప్‌లైన్‌లు 181, ఉమెన్ చిల్డ్రన్ హెల్ప్‌లైన్ 1098, సఖి కేంద్రాలు, షీటీం వంటివి ఉన్నాయని వాటిపట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి

● గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీఓ జీనత్

నవతెలంగాణ-జైపూర్



మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని భీమారం మండల గ్రామీణ ఉపాధి హామీ చట్టం ఏపీఓ సయ్యద్ జీనత్ అభిప్రాయపడ్డారు. ముందుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. నాటి నేటి పరిస్థితులను పరిశీలిస్తే నేడు మహిళలు తమదైన ప్రతిభను కనబర్చుతూ సమాజంలో దూసుకుపోతున్నారని తెలిపారు. ఇదే తరహాలో భవిష్యత్తులో మహిళలు తమ అందివచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని పేర్కొంటూ మహిళగా పుట్టినందుకు గర్వించాలని అన్నారు. కుటుంబాన్ని చక్కబెట్టడమైనా ఉద్యోగంలో రాణించడంలో మహిళలు ఏవిధంగా తీసిపోకుండా దూసుకుపోతున్నారని అన్నారు. విద్యార్థిగా ఉన్నప్పటి నుంచి క్రమ శిక్షణ కలిగివుండి భవిష్యత్తు నిర్మాణం కోసం కృషి చేయాలని అన్నారు. స్వయం ఉపాధి, ఉద్యోగ అవకాశాల్లో పోటీ పడి పురుషులతో సమంగా సాధించుకోవాలని అన్నారు.

అన్ని రంగాల్లో మహిళలు రానిస్తున్నారు

● వనజారెడ్డి, తహసీల్దార్, జైపూర్

నవతెలంగాణ-జైపూర్



ప్రస్తుత సమాజంలో మహిళలు అసాధ్యాలను సుసాధ్యాలు చేస్తున్న మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారని జైపూర్ తహసీల్దార్ వనజారెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంధర్భంగా నవతెలంగాణాతో మట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. శాస్త్ర సాంకేతిక రంగాలతో పాటు ప్రతి రంగంలో స్త్రీలు మేము సైతం అంటూ పురుషులతో సమంగా దూసుకుపోతున్నారని తెలిపారు. ప్రతి లక్ష్యాన్ని అవలీలగా అందిపుచ్చుకుంటున్నారని సాఫ్ట్‌వేర్ రంగంలో అద్భుతమైన ప్రతిభకనబర్చుతున్నారని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా ఆత్మస్థైర్యంతో మరింత ముందుకు పోవాలని ఆకాంక్షించారు.

కష్టమైన ఇష్ట పడి చదివాను

నవతెలంగాణ-మంచిర్యాల



కష్టమైన చార్టెడ్ అకౌంటెంట్ కోర్స్‌ను ఇష్టంగా చదివి సీఏ ఫైనల్ రిజల్ట్‌లో అత్యుత్తమ ర్యాంక్ కష్టమైనా ఇస్టపడి చదివి సాధించానని లక్షెట్టిపేటకు చెందిన 23 ఏండ్ల బొమ్మ కంటి శివాని తెలిపారు. సాధారణ కుటుంబనికి చెందిన బొమ్మకంటి సురేష్ భాగ్యలక్ష్మిల కూతురు శివాని మొదటి నుంచి చదువులో ముందు వరుసలో నిలిచింది. పదవ తరగతి ఇంటర్మిడియేట్‌లో జిల్లా ర్యాంక్ సాధించింది. తనకంటూ ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని దాన్ని నెరవేర్చుకోవాలనే తపనతో వైజాగ్‌లో సీఏ కోర్సులో జాయిన్ అయింది. మొదట్లో కొంచం కష్టం అనిపించిన కుటుంబ పరిస్థితులు ద్రుష్టి లో పెట్టుకొని ఇష్టంగా చదవడం మొదలు పెట్టింది. మధ్య లో ఎన్ని ఆటు పోట్లు ఏర్పడిన ఎక్కడ వెనుకడుగు వెయ్యకుండా సీఏ ఫైనల్‌కు చేరింది. 2024 మేలో విడుదల అయిన సీఏ ఫైనల్ ఫలితాల్లో అత్యుత్తమ ర్యాంక్ సాధించింది. ప్రస్తుతం హైదరబాధ్ లోని మల్టి నేషనల్ కంపెనీలో నెలకు రూ.1.5 లక్షల వేతనం సంపాదిస్తోంది. మహిళ దినోత్సవం సందర్భంగా నవతెలంగాణతో మాట్లాడుతూ విద్యార్థులు ఏదైనా లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని అది నేరవేరేల ప్రయత్నాలు చెయాలని తెలిపింది. మహిళలకు నవతెలంగాణ పాటకులకు మహిళ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపింది.

మహిళలు అన్ని రంగాల్లో రానించాలి

● మంద రేష్మ, సీడీపీఓఓ, లక్షెట్టిపేట

నవతెలంగాణ-లక్షెట్టిపేట



మహిళలు అన్ని రంగాల్లో రానించాలని లక్షెట్టిపేట సీడీపీఓ మంద రేష్మ అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా నవతెలంగాణతో మాట్లాడుతూ ఆమె అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకోవడం సంతోషంగా ఉంది. మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుంది. విద్యా, ఉద్యోగ, ఆర్థిక రాజకీయ, సామాజికంగా విజయం సాదిస్తూ, వాటి పురోభివృద్ధిలో ముందడుగు వేయాలి. ఇప్పటికీ చదువుకు దూరమై, అభివృద్ధికి నోచుకోని ఆడపిల్లలు ఎందరో ఉన్నారు. చదువు సమాజనికి వెలుగని, ప్రతి ఆడపిల్ల చదువుకు ప్రభుత్వాలు బాధ్యత వహించాలి. చదువుతోనే సాధికారత సాధ్యం అని, నేటి ఆధునిక గ్లోబలైజేషన్ కాలంలో అభివృద్ధి వేగవంతం అయ్యే దిశగా మహిళలు పయనించాలి. సమా జంలో మహిళలకు చదువుతో పాటు గౌరవం ఉండాలి. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపు చ్చుకుని మహి ళలు మరింత అభివృద్ధి సాధికారత సాధించే దిశగా అడుగులేయాలి. వంటింటికి పరిమితం కాక బాధ్యతతో పాటు స్వేచ్ఛను మహిళలు కలిగి ఉండాలి.

లింగ వివక్ష సమాజానికి చేటు

● ఝాన్సీ, ప్రభుత్వ వైద్యాధికారి, తాండూర్

నవతెలంగాణ-తాండూర్



లింగ వివక్ష వల్ల సమాజంలో దురదృష్టకరమైన సంఘటనలు సంభవిస్తున్నాయి. గతంలో లింగ నిర్ధారణ పరీక్షలు కారణంగా గర్భస్థ బ్రూణ హత్యలు శిశు మరణాలు జరిగాయి. దాంతో నేడు కొన్ని సామాజిక వర్గాల్లో వివాహం చేసుకోవడానికి ఆడపిల్లలు కరువయ్యారు. సమాజంలో ఆడ మగ తారతమ్యం లేకుండా విద్య ఉద్యోగ ఆస్తి హక్కుల్లో సమానత్వం ఉండాలి. లింగ నిర్ధారణ పరీక్షల విషయంలో ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకోవాలి. ప్రభుత్వం బాలికా, మహిళా సంరక్షణ చట్టాలను పగడ్బందీగా అమలు చేయాలి. స్త్రీ శిశు సంక్షేమం కోసం ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు పరచాలి. బాలికలకు నిర్బంధ విద్యను అందించి అన్ని రంగాల్లో రాణించే విధంగా ప్రోత్సహించాలి. అతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బెల్లంపల్లి పట్టణానికి చెందిన ఝాన్సీ మాట్లాడారు. సామాన్య కుటుంబంలో జన్మించి పట్టుదారులతో చదివి డాక్టర్ అయ్యారు. బెల్లంపల్లి గర్ల్స్ హైస్కూల్‌లో పదవ తరగతి పూర్తి చేసిన ఝాన్సీ కరీంనగర్ ఫాతిమా మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. గతంలో నెన్నెలలో పని చేసి ప్రస్తుతం తాండూర్ వైద్యాధికారిగా పనిచేస్తున్నారు. పుట్టి పెరిగిన పరిసర గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందించడం ఆనందంగా ఉందని తెలిపారు.

సమాజంలో మహిళల పాత్ర కీలకం

● కె రమా కళ్యాణి, ప్రిన్సిపల్, గురుకుల కళాశాల, లక్షెట్టిపేట

నవతెలంగాణ-లక్షెట్టిపేట



మహిళ సృష్టికే ఒక కానుక.. ఆమె శక్తి అపారం. మహిళల శక్తి ముందు ఏ శక్తి నిలబడలేదని, సమాజంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆమె మహిళా దినోత్సవం సందర్భంగా నవతెలంగాణతో మాట్లాడారు. ఆడదే ఆధారం మన కథ ఆడనే ఆరంభం అవుతుందని ఊహ తెలిసిన నాటి నుంచి బంధాలు, బాధ్యతలు కుటుంబ సంతోషం, బంగారు భవిష్యత్తు అహర్నిశలు కృషి చేస్తుంది. ప్రేమ, ఆప్యాయత, అనురాగాలు పంచి తన ఇంటితో పాటు సంఘాన్ని, దేశాన్ని నందనవనంగా మార్చే మహిళా మూర్తులందరికి శతకోటి పాదాభివందనాలు అని ఆమె తెలిపారు. ప్రస్తుతం మన దేశ రాష్ట్రపతి పదవితో పాటు, దేశఆర్థిక వ్యవస్థని మహిళలకు అప్పజెప్పారంటే మనం స్త్రీకి ఇచ్చే గౌరవం అర్ధమవుతుంది. సహనం, ఓర్పు, విచక్షణాజ్ఞానం, మనోధైర్యం అనేవి మహిళలకు స్వతహాగా ఉండే ప్రధాన గుణగణాలన్నారు. ఈ సందర్భంగా మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు.

వందశాతం పన్ను వసూలు చేయాలి

నవతెలంగాణ-జన్నారం.

మండలంలోని అన్ని గ్రామాల్లో పన్ను వసూలు వంద శాతం పూర్తి చేయాలని ఎంపీడీవో ఉమర్ షరీఫ్, ఎంపీఓ జలంధర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సంరద్భంగా వారు మాట్లాడుతూ పన్ను వసూలు నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. అలాగే ప్రజలకు ఎల్ఆర్ఎస్ పై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందులో వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అత్యాచారానికి పాల్పడ్డ వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-జన్నారం



జగిత్యాల జిల్లా రాయికల్‌లో దళిత మహిళ అయిన ఆశావర్కర్ విధులు పూర్తి చేసుకుని ఇంటికి తిరిగి వెళ్తుండగా, ఒక కామాందుడు దౌర్జన్యం చేసి, బెదిరించి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ నిందితుని పట్టుకొని వెంటనే ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని సీపీఐ(ఎం) జిల్లా నాయకులు కె బుచ్చయ్య అంబటి లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ముందు ప్లాకార్డులలో నిరసన తెలిపారు. ఘటన జరిగి వారం రోజులవుతున్నా, నిందితున్ని పోలీసులు ఇప్పటి వరకు అరెస్టు చెయ్యకపోవడం దారుణం అన్నారు. తక్షణమే నిందితునిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసుల నిర్లక్ష్యం, ప్రభుత్వం కఠినంగా వ్యవహరించకపోవడంతో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించి, చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని, డిమాండ్ చేస్తున్నామన్నారు. మహిళల రక్షణ కోసం తగిన చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ రాష్ట్ర ముఖ్యమంత్రిని డిమాండ్ చేస్తున్నదన్నారు. ఈ ఘటనలో బాధితురాలికి సరైన వైద్యం అందించలేదన్నారు. పోలీస్ యంత్రాంగం నిందితునికి అండగా ఉండి, బాధితురాలికి అన్యాయం చేసే వైఖరి అవలంభిస్తున్నట్లు కనపడుతుందన్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీస్ అధికారుల మీద చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసి నిందితున్ని కఠినంగా శిక్షించాలన్నారు. బాధితురాలికి సరైన వైద్యం అందించాలని, ఇంటి స్థలం ఇచ్చి, ఇల్లు నిర్మించి ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగం, ఇతర ఆర్థిక సహాయ సహకారాలు అందించాలని పార్టీ తరఫున ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. మండల ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్పు దిశగా.. మరో అడుగు



నవతెలంగాణ-మంచిర్యాల

ఆత్మ విశ్వాసం స్త్రీలకు ఆభరణం. అది తోడు అవ్వాలంటే వారికి ఆర్థిక సాధికారత ఎంతో అవసరం. ఆ విషయాన్నీ మాటల్లో చెప్పడం కంటే చేతుల్లో చూపెట్టాలను కున్నారు మంచిర్యాలకు చెందిన వనిత వాక్కు సభ్యులు. అందుకోసమే మహిళలకు పాఠశాల స్థాయిలోని విద్యార్థినులకు సెల్ఫ్ కాన్ఫిడెన్స్‌లో భాగంగా కరాటే, కర్రసాము ఉచితంగా నేర్పిస్తున్నారు. ఆ పైన వ్యాపార మెలకువలు నేర్పిస్తు స్వయం ఉపాధి పొందేలా చేయూతను అందిస్తున్నారు.

చిన్ననాటి నుంచే రాటుదేలేలా..

ఆడపిల్లలను సుకుమారంగా పెంచడం కాకుండా, వారు చిన్ననాటి నుంచే మానసికంగా, శారీరకంగా, నైతికంగా దృడంగా చేయాలని, విద్యతో పాటు, వారిలో మానసిక వికాసం, యోగా, మెడిటేషన్, కరాటే, కర్రసాము, బాక్సింగ్ వంటి ఆత్మరక్షణ కోసం ఉపయోగపడే వాటిపై సమయం దొరికినప్పుడుల్ల శిక్షణ ఇస్తున్నారు. వనితా వాక్కు సంస్థ ద్వారా గత రెండు ఏండ్లుగా పలు పాఠశాలల్లోని విద్యార్థినులకు, వేసవి సెలవుల్లోని సమ్మర్ క్యాంపులో కర్రసాము(సిలంబం) అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ వారి సహకారంతో ఉచితంగా 1500 మంది ఆడపిల్లలు, మహిళలకు శిక్షణను అందించారు. బాల్య వివాహాలు చేయకుండా, బాలికల భ్రుణ హత్యలను నివారించేలా పలు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో అశ్లీల దృశ్యా లు రద్దు చేసేలా పోరాటం చేయడం, మహిళలు, ఆడపిల్లలు వేధింపులకు గురైనప్పుడు వారికి తోడుగా నిలిచి పోరాటం చేయడం, మహిళా సాధికారత దిశగా మహిళలకు వివిధ రంగాల్లో స్వయం ఉపాధి శిక్షణ కోర్సులు నిర్వ హించి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ స్వచ్ఛంద సంస్థ పనిచేస్తోంది.

తాటిపెల్లి కవిత, వనిత వాక్కు ఫౌండర్

వనితా వాక్కు లక్ష్యాలలో ముఖ్యమైన లక్ష్యం పిల్లలని చిన్న వయసు నుండే శారీరకంగా, మానసికంగా, నైతికంగా దృడంగా చేయాలి. ప్రాథమిక విద్యా దశ నుండే పిల్లల్లో మంచిని పెంచే విధంగా వ్యక్తిత్వ మానసిక వికాస తరగతులు ఒక సబ్జెక్టు లాగా అలాగే శారీరక దృఢత్వం కోసం యోగ, మెడిటేషన్, కరాటే, కర్రసాము, బాక్సింగ్ లాంటి ఆత్మ రక్షణ విద్యలని మరొక సబ్జెక్టు లాగా అకాడమీలో చేర్చాలి. దీని ద్వారా మంచి విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్యార్థులని తయారు చేయటంతో పాటు ఆడపిల్లల్లో ఆత్మ సైర్యం పెంచి ఏదైనా సమస్య ఎదురైనప్పుడు సహాయం కోసం ఎదురు చూసే స్థాయి నుండి తమని తాము రక్షించుకునేలా తయారవుతారు. ఈ మార్పు కోసం గత మూడు సంవత్సరాలుగా ప్రభుత్వాలకి వినతి పత్రాలు అందిస్తున్నాము. అలాగే మా వంతుగా ఉచిత సమ్మర్ క్యాంపులు స్కూల్స్, కాలేజెస్ లో ఉచిత మానసిక తరగతులు, ఆత్మ రక్షణ విద్యల మీద అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము. అలాగే బాలికల రక్షణ ప్రాధాన్యత తెలుపే విధంగా ప్రతి సంవత్సరం జాతీయ, అంతర్జాతీయ బాలికల దినోత్సవాలు నిర్వహిస్తున్నాము.

మహిళా రుణాలు ఆర్థిక అభివృద్ధికి ఉపయోగపడాలి

● సుబ్బారెడ్డి, ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ భీమారం

నవతెలంగాణ-జైపూర్



స్వయం సహాయక సంఘాల ద్వారా పొందుతున్న రుణాలు సభ్యుల కుటుంబ ఆర్థిక తోడ్పాటుకు ఉపయోగపడాలని భీమారం ఎస్‌బీఐ మేనేజర్ సుబ్బారెడ్డి ఆకాంక్షించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం భీమారం శాఖ ఆద్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఉచిత మెగా వైద్య శిబిరం ద్వారా బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. భీమారం గ్రామానికి చెందిన వారితో పాటు పరిసర గ్రామాల వారు అత్యధికంగా పాల్గొన్నట్లు తెలిపారు. కాగా మహిళా దినోత్సవం ప్రపంచవ్యాప్తంగా ఉన్న మహిళల బలాన్ని, శక్తిని సూచిస్తుందని, మహిళలు స్వయం సహాయాక సంఘాల ద్వారా పోందే రుణాలు సరిగ్గా సద్వినియోగ పరుచుకొని కుటుంబ ఆర్థిక అభివృద్ధికి తోడ్పాడాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలలో భాగంగా కేక్ కట్ చేసి ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ ఎం.అజయ్, బి.రాజశేఖర్, ఈ.లిఖిత, తెజస్వి, ఐకేపీ ఎపీఎం త్రయంబకేశ్వర్ పాల్గొన్నారు.

మహిళల కోసం పనిచేయడమే నా లక్ష్యం

● ఆదిలాబాద్ సఖి కేంద్రం సోషల్ కౌన్సలర్ లావణ్య



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తన లక్ష్యమే మహిళల కోసం ఏదో చేయాలన్న తాపత్రయం. చివరికి మహిళల క్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ ఉద్యోగంలో రాణిస్తుంది. ఆమెనే ఆదిలాబాద్ సఖి సోషల్ కౌన్సలర్ లావణ్య. జిల్లా కేంద్రానికి చెందిన ఈమె లక్ష్యం తన వంతుగా మహిళల కోసం ఏదైనా చేయాలని ఎన్జీఓలో చేరి సేవాలందించారు. దీంతో 2019లో సఖి సెంటర్‌లో ఉద్యోగం సాధించింది. నాటి నుంచి ఇప్పటివరకు 6 సంవత్సరాల పాటు మహిళలకు సేవాలందిస్తుంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని నవతెలంగాణతో ఆమె మాట్లాడారు. ముందుగా మహిళ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఎక్కువ మద్యానికి బానిస, అనుమానం, వరకట్న వేధింపులు, మైనర్ వేధింపులు, గృహ హింస కేసులు వస్తాయి. ఎవరు వచ్చిన వారిని మానసికంగా బలపర్చి కలిసి ఉండేలాగా ప్రయత్నం చేస్తాం. కుటుంబంలో ఏదైనా చిన్నగా గొడవ అయితే ఎక్కువ ఎమోషన్ గురికావద్దు. ఏదైనా చిన్న సమస్య ఏర్పడితే ఒకరిని ఒకరు అర్ధం చేసుకొని పరిష్కరించుకోవాలి. అప్పటికి పరిష్కారం కాకపోతే సఖి కేంద్రంను సందర్శించాలి. సఖి అంటే ఒక ఫ్రెండ్లీ వాతావరణం ఉంటుంది. ఎవరైనా సరే ఏదైనా సమస్య ఎదుర్కొంటే ధైర్యంగా ముందుకు వచ్చి చెప్పుకోవాలి. అలాగే హెల్ప్ లైన్ 181 నెంబర్ గుర్తుంచుకొని ఎలాంటి ఆపత్కాల సమయంలో అయిన సంప్రదించాలి. సఖి సేవాలను సద్వినియోగంచేసుకోవాలి

స్త్రీని గౌరవించే చోట అభివృద్ధి

● మాజీ ఎంపీటీసీ లంక లలిత

నవతెలంగాణ-బోథ్



స్త్రీలను గౌరవించే చోట గ్రామాభివృద్ధి ఉంటుందని అక్కడ అభివృద్ధి ఉంటుందని మాజీ ఎంపీటీసీ లంక లలిత అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆమె మాట్లాడుతూ స్త్రీలు నేడు అన్ని రంగాల్లో ముందు ఉంటున్నారని అన్నారు. స్త్రీలు రాజకీయ రంగాల్లో ముందు ఉండాలని స్త్రీలను గౌరవించిన చోట మరింత అభివృద్ధి చేసేందుకు మహిళలు ముందు ఉంటారన్నారు. ప్రతి పురుషుడి వెనుక స్త్రీ విజయం ఉంటుందని అన్నారు. మహిళా దినోత్సవ సందర్భంగా మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు.

పురుషులతో సమానంగా మహిళలు రానిస్తున్నారు

● చింత సువర్ణ-అశోక్ మాజీ కౌన్సిలర్, లక్షెట్టిపేట

నవతెలంగాణ-లక్షెట్టిపేట



పురుషులతో సమానంగా మహిళలు పోటీపడుతున్నారని, కుటుంబం, సమాజంలో మహిళల పాత్ర చాలా కీలకమని మున్సిపల్ మాజీ కౌన్సిలర్ చింత సువర్ణ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్బంగా మహిళలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఒక మహిళగా జన్మించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఒక పురుషుడి జీవితంలో తల్లిగా, సోదరిగా, భార్యగా, స్నేహితురాలుగా స్త్రీలు బహుళ పాత్రలు పోషిస్తారని తెలిపారు. పురుషులు వారి జీవితంలో మహిళలు లేకుండా మనుగడ సాగించలేరని అన్నారు. మహిళల్లో సంకల్ప శక్తి ఎక్కువగా ఉందని, ఏదైనా సాధించగలరని పేర్కొన్నారు. మహిళలు డాక్టర్లు, పోలీసులు, న్యాయవాదులు, ఉపాధ్యాయులు, రాజకీయాలు వంటి పలు రంగాలలో సత్తా చాటుతున్నారు. మహిళలు తమ కలల సాకారం కోసం అహర్నిశలు పాటుపడాలని సూచించారు.

అన్నింట్లో మహిళల సాధికారత పెరగాలి

● అన్నం మంగ చిన్నన్న మాజీ ఎంపీపీ, లక్షెట్టిపేట

నవతెలంగాణ-లక్షెట్టిపేట



అన్నిట్లో మహిళా సాధికారత పెరగాలని మాజీ ఎంపీపీ అన్నం మంగా అన్నారు. అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్బంగా నవతెలంగాణతో మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు అవుతున్న ఇప్పటికీ మహిళ సాధికారత విషయంలో కావాల్సిన అభివృద్ధి జరగలేదు. గతంతో పోలిస్తే అన్ని రంగాల్లో మహిళల ప్రాతినిధ్యం గణనీయంగా పెరిగింది. కానీ ఇంకా జనాభాకు అనుగుణంగా పెరగలేదు. ఇంకా కొన్ని చోట్ల మహిళల విషయంలో ఆంక్షలు, వివక్ష కొనసాగుతుంది. ఇవన్నీ పోవాలంటే అందరూ సమానమే అనే భావన రావాలి. అది కుటుంబం నుండే మొదలు కావాలి. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను ఎలాంటి ఇబ్బందులు లేకుండా అమలు అయిన రోజే మనకు ఈ వివక్షలు లేని సమాజం ఏర్పాటు అవుతుంది. ముఖ్యంగా ప్రభుత్వాలు, పాలకులు మహిళ సాధికారత కోసం విశేషంగా కృషి చేయాలి. మహిళలు నేటి సమాజంలో అన్ని రంగాల్లో దూసుకెళ్తున్నా కొన్ని చోట్ల విపరీతమైన ఆంక్షాలు, అవమానాలు ఎదుర్కొంటున్నారు. ఇవన్నీ పోవాలంటే పాలకులు రాజ్యాంగాన్ని తూచా తప్పకుండా అమలు చేయాలనేది నా భావన.

నాకు నాన్నే ఆదర్శం

● ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.జే.సంగీత

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



జీవితంలో పైకి రావడానికి, ఉన్నత స్థాయికి ఎదగడానికి నాన్నే అన్నిటికి ఆదర్శమని ఆదిలాబాద్ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.జే.సంగీత తెలిపారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం పురస్కరించుకుని నవతెలంగాణతో ఆమె మాట్లాడారు. ముందుగా అందరికీ మహిళ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. చిన్న వయసులోనే నాకు పెండ్లి చేశారు. పెళ్లయ్యాక భర్త సపోర్ట్ తో చదువును కొనసాగించాను. మెల్ల మెల్లగా చిన్న స్థాయి ఉద్యోగాలు చేస్తూ, ఆటంకాలను ఎదుర్కొంటూ, అలాగే ఎదుగుతూ ప్రస్తుతం కళాశాలకు ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాను. దీనికి మా నాన్నే ఆదర్శం. మేము ఆరుగురం అక్క చెల్లెల్లం. అయిన సరే మా నాన్న ఎవరిని తక్కువ చూడకుండా అందరిని చదివించారు. గొండ్ కొలం, లంబాడాకు సంబంధించి పీహెచ్‌డీ చేశాను. ఏడు సంవత్సరాలు ఐటీడీఏ టీచర్‌గా పనిచేశాను. పెళ్లయింది కదా నేను అక్కడే ఆగిపోలేదు. అక్కడే ఆగిపోతే ఇలా ఉండేదాన్ని కాదు. యువతులు కూడా ఎక్కువ ఫోన్‌లకు ఆడిక్ట్ కాకుండా జీవితంలో ఒక లక్ష్యం పెట్టుకొని ఆ దిశగా శ్రమించాలి.

మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

నవతెలంగాణ-ఉట్నూర్



పురుషులతో సమానంగా మహిళలు రాణిస్తున్నారనీ, కుటుంబం, సమాజంలో మహిళల పాత్ర చాలా కీలకమని మాజీ జెడ్పీటీసీ చారులత రాథోడ్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్బంగా మహిళలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఒక మహిళగా జన్మించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఒక పురుషుడి జీవితంలో తల్లిగా, సోదరిగా, భార్యగా, స్నేహితురాలుగా స్త్రీలు బహుళ పాత్రలు పోషిస్తున్నారని తెలిపారు. పురుషులు వారి జీవితంలో మహిళలు లేకుండా మనుగడ సాగించలేరని అన్నారు. మహిళలు సంకల్పశక్తి ఎక్కువగా ఉందని, మహిళలు డాక్టర్లు, పోలీసులు, న్యాయవాదులు, ఉపాధ్యాయులు, రాజకీయాలతో పాటు పలు రంగాల్లో సత్తా చాటుతున్నారు. రాజకీయాలలో స్త్రీలు రాణించాలన్నారు.

ఆడపిల్లలను చిన్నచూపు చూడొద్దు

● ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఐ.శ్రావణి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



సమాజంలో ఆడపిల్లలను చిన్నచూపు చూడకూడదని, పురుషుల కంటే ఆడపిల్లలకే ఎక్కువ కష్టపడే తత్వం ఉంటుందని ఆదిలాబాద్ ప్రభుత్వ సైన్స్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఐ.శ్రావణి అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం పురస్కరించుకుని ఆమె నవతెలంగాణతో మాట్లాడారు. ముందుగా మహిళ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. పీహెచ్‌డీ రిసెర్చ్ చేయాలన్న గోల్ ఉండేది. ప్రస్తుతం విద్యారంగంలో ఒక టీచర్‌గా పని చేయడం చాలా సంతోషంగా ఉంది. ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. పట్టుదలతో పని చేస్తే విజయం తప్పకుండా వరిస్తుంది.

అటవీ రక్షణలో 'అతివలు'

- ఆటంకాలు ఎదుర్కొంటూ..ముందుకు సాగుతూ
- పురుషులతో సమానంగా విధులు నిర్వర్తిస్తూ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కనులు తెరిచిన క్షణం నుంచి, బంధం కోసం బాధ్యత కోసం, కుటుంబం కోసం, అందర్నీ కనుపాపలా తలచి, ఆత్మీయత పంచి, తనవారి కోసం అహర్నిశలు కష్టించి, వారిని సహించి, వారి భవిష్యత్తు గురించి, తన ఇంటిని నందనవనం చేసే స్త్రీ మూర్తి అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా ముందుకు సాగుతోంది. అయితే మిగతా రంగాలతో పోల్చినపుడు యూనిఫాం విభాగంలో పని చేయడం కత్తి మీద సాము లాంటిది. అటువంటి కష్టతరమైన విధులను ఇష్టంగా చేస్తూ పురుషులతో సమానంగా అటవీశాఖలో విధులు నిర్వహిస్తున్నారు. రోజులో 24 గంటలు సంవత్సరంలో 365 రోజులు విధులు నిర్వహిస్తూ అటవీ సంరక్షణలో తమకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా సాధకబాధకాలు తెలుసుకునే ప్రయత్నమే.

విధుల నిర్వహణలో నిరంతరం అప్రమత్తంగా ఉంటాను

సరోజారాణి, ఫారెస్ట్ రేంజ్ అధికారిణి



అడవిలో విధులు నిర్వహించడం చాలా కష్టమైన పని అయిన విధుల నిర్వహణలో నిరంతరం అప్రమత్తంగా ఉంటాను. చిన్నప్పటినుండి యూనిఫామ్ విభాగంపై కొంత మక్కువ ఎక్కువ దానికోసం డిగ్రీ తర్వాత వివిధ రకాల ఉద్యోగ ప్రయత్నాలు చేశాను. ప్రస్తుతం ఇన్‌చార్జి రేంజ్ అధికారిణిగా విధులు నిర్వహిస్తూ రేంజ్ పరిధిలో అటవీ పరిరక్షణకు అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుంది. సమాజంలో పురుషులతో సమానంగా పనిచేస్తున్న మహిళలను తప్పనిసరిగా గుర్తించాలి. నాతోటి మహిళ ఉద్యోగులకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు.

అధికారుల సహకారంతో ముందుకు వెళ్తున్నాం

సఫియా బేగం, ఫారెస్ట్ బీట్ అధికారిణి



అటవీ శాఖలో విధులు నిర్వహించడం కత్తి మీద సామ లాంటిది. బీట్ అధికారులపై కొంత ప్రాంతానికి సంబంధించిన బాధ్యత ఉండడంతో నిరంతరం ఒక యుద్ధంలా విధి నిర్వహణ సాగుతోంది. అధికారుల సహకారంతో విధులను నిర్వహించడం కొంత ఇబ్బందులను దూరం చేస్తుంది. ఆ దిశగా నిరంతరం ప్రయత్నం చేస్తున్నాను. ఉద్యోగంలోకి వచ్చి 15 సంవత్సరాల నుండి ఉన్నతాధికారుల ఆదేశాలకు లోబడి పనిచేస్తున్నాను. మహిళ దినోత్సవంతో పాటు సాధారణ రోజుల్లో కూడా మహిళలకు సమాజంలో విలువ, గౌరవం ఇవ్వాల్సిన అవసరం ఉంది.

అడవుల రక్షణకు కట్టుబడి పని చేస్తున్నాం

సరిత, ఫారెస్ట్ బీట్ అధికారిణి



విధి నిర్వహణలో ఎన్నో రకాల ఒడిదుడుకులు ఎదురైన అడవుల రక్షణకు కట్టుబడి పని చేస్తున్నాం. ఒకవైపు కుటుంబానికి మరోవైపు ఉద్యోగానికి న్యాయం చేసేలా కృషి చేస్తున్నాం. ఉన్నతాధికారుల ఆలోచనలు అమలు చేస్తూనే వారి సలహాలు సూచనలు పాటిస్తూ ముందుకు సాగుతున్నాం. ప్రజలు కూడా విధినిర్వహణలో సహకరించినప్పుడే విధి నిర్వహణ సులభమవుతుంది.

విధి నిర్వహణకు అధికారుల సహకారం అవసరం

అనూష, అటవీ సెక్షన్ అధికారిణి



ఇతర ఉద్యోగాలతో పోల్చినప్పుడు అటవీ శాఖలో ఉద్యోగం నిర్వర్తించడం కొంత భిన్నమైనది. అటవీ శాఖ ఉద్యోగి కొంత ప్రాంతానికి నిరంతరం బాధ్యత వహించాల్సి ఉంటుంది. రోజుకు 24 గంటలు 365 రోజులు నిరంతరం విధుల్లో ఉండాల్సి ఉంటుంది. ఇటువంటి సందర్భంలో ఉన్నతాధికారుల సహకారం లేకుంటే మహిళలు పనిచేయడం ఇబ్బందిగా మారుతుంది. అటవీ శాఖలో మహిళా ఉద్యోగుల విధి నిర్వహణకు ఉన్నతాధికారులు సహాయ సహకారాలు అవసరం. తోటి మహిళలకు మహిళ దినోత్సవ శుభాకాంక్షలు.

మహిళా సాధికారతతో సమసమాజం సాధ్యం

- ఎమ్మెల్యే కోవలక్ష్మి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



పెరుగుతున్న పోటీ ప్రపంచంలో మహిళలు తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటూ సమాజంలో ఉన్నత స్థానానికి చేరుతున్న వారిని అనేక మందిని చూస్తున్నాం. ఉద్యోగంలో కుటుంబ భారాన్ని మోయడంలో ప్రత్యేకత చాటుకుంటున్న రాజకీయాల్లో ఎదగడం అనేది కొందరికే సాధ్యమవుతుంది. అటువంటి అసాధ్యాన్ని సుసాధ్యం చేయడంతో పాటు రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకొని, ప్రజలకు అందుబాటులో ఉండి, ఎన్నికల్లో ప్రతిసారి ఏదో ఒక ముఖ్యమైన జిల్లాస్థాయి నాయకురాలుగా ఉండి, నియోజకవర్గంలో ప్రత్యేక ఓటు బ్యాంకు సృష్టించుకున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి మహిళా దినోత్సవ సందర్భంగా నవ తెలంగాణతో మాట్లాడారు. మహిళల ఆర్థిక సాధికారికతో సమ సమాజం సాధ్యమవుతుందని తెలిపారు. సమాజంలోని అనేక జాతిలలో మహిళలు నేటికీ బయటికి రాలేక పోతున్నారన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఇది ఎక్కువగా కనిపిస్తుందని వారిని ఎప్పటికప్పుడు ప్రేరేపిస్తూ విద్యాభివృద్ధి కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. మహిళల కోసం అనేక చట్టాలను ప్రభుత్వాలు రూపొందిస్తున్నాయని, అయితే వీటి ఆచరణ కూడా పకడ్బందీగా ఉండాలన్నారు. గతంతో పోలిస్తే మహిళలు అభివృద్ధి చెందారని అయితే సమ సమాజం లాగా ఇంకా అభివృద్ధి చెందలేదన్నారు. తల్లిదండ్రుల వద్ద నుండి స్త్రీల అభివృద్ధి సాధ్యమవుతుందని చిన్ననాటి నుండి ఇంట్లో మగ ఆడపిల్లలను ఒకే విధంగా పెంచాలన్నారు. నియోజకవర్గంలోని గిరిజన మహిళల అభివృద్ధి కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. రాజకీయంగా మహిళలు మరింత రాణించాలని అప్పుడే చట్టసభల్లో ప్రాతినిధ్యం లభించి అనుకున్న లక్ష్యం సాధించే అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వాలు కూడా ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. నియోజకవర్గంలోని మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

చట్టాలను కఠినంగా అమలు చేయాలి

నవతెలంగాణ-సిర్పూర్(టి)



దేశంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు పెరుగుతున్న నేపథ్యంలో కఠినంగా అమలు చేయాల్సిన అవసం ఉందని ఉపాధ్యాయురాలు దుస్స పూజ అంటున్నారు. మహిళ దినోత్సవం సందర్భంగా ఆమె నవతెలంగాణతో మాట్లాడారు. మహిళల కోసం ఏర్పాటు చేసిన చట్టాలు, వాటి విధి విధానాలు తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. వంటింటికి మాత్రమే పరిమితమై ఉన్న మహిళాలు కొన్ని విషయాలపై చాలా స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలి. దేశ రాజకీయాల్లో మహిళకు ప్రత్యేక స్థానం అంటూనే ఊదరగొడుతున్న ప్రభుత్వాలు దాదాపు 35 సంవత్సరాల చరిత్రలో దేశ ప్రత్యక్ష రాజకీయాలలో మహిళ లేకపోవడం చాలా బాధాకరం. చట్టసభల్లో కూడా మహిళలకు 50 శాతం రిజర్వేషన్ అవకాశం ఉంది. రాబోయే రోజుల్లో ఎన్నికల్లో పోటీ చేస్తూ అంది వచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకోవాలి. మహిళ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ఆకాశమే హద్దుగా అన్ని రంగాల్లో మహిళలు

నవతెలంగాణ-సిర్పూర్(టి)

ప్రస్తుత కాలంలో ఆకాశమే హద్దుగా మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారు. ఏ రంగంలో ఉన్నవారికి వారే సాటి అన్నంటున విధుల్లో రాణిస్తున్నారు. మహిళ దినోత్సవం సందర్భంగా కేజీబీవీ ఎస్ఓ నాగసుధ నవతెలంగాణతో మాట్లాడారు. మహిళల సాధికారత సమానత్వం హక్కుల గురించి ప్రతి ఒక్కరం మన కర్తవ్యాన్ని గుర్తు చేసుకోవాల్సిన రోజు మార్చి 8 కావడం విశేషం. మన జీవితంలో సంవత్సరం పొడుగునా పండగలు పర్వదినాలు వస్తుంటాయి. కానీ మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి ఒక ప్రత్యేకత ఉంది. శతాబ్దాలుగా సామాజిక వెనుకబాటుతనం కారణంగా మహిళలు ఈరోజుకు కూడా వివక్షణ ఎదుర్కొంటున్నారు. అలాంటి మహిళలను దుర్భర పరిస్థితుల నుంచి బయటకు తెచ్చేందుకు మహిళల సాధికారిత దిశగా మనందరి కర్తవ్యాన్ని గుర్తుచేసే రోజు ఇదే కావడం విశేషం. మహిళలు నేడు ముందడుగు వేస్తున్నాడు అంటే అందుకు కారణం వారి పోరాటం వెనుక నిలబడ్డ ఎందరో మహిళలే కారణం అని చెప్పవచ్చు. అలాంటి అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి పునాది పడింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఐదు లక్ష్యాల వైపు అడుగులు వేయాల్సి ఉంటుంది.



అందులో మొదటిది లింగ వివక్ష లేని సమాజం, రెండవది మహిళలకు సమాన విద్య ఉద్యోగ అవకాశాలు కల్పించడం, మూడవది మహిళలకు భద్రత ఆరోగ్య సంరక్షణను పెంపొందించడం, మహిళా సాధికారత స్వతంత్రం నిర్ణయాలను ప్రోత్సహించే దిశగా వాతావరణాన్ని పెంపొందించడం, దీంతో పాటు రాజకీయాలు ఉద్యోగాలు వ్యాపారాల్లో మహిళలకు సరైన వాటా అందించడమే లక్ష్యంగా ఈ మహిళా దినోత్సవం ఉద్దేశ్యాల్లో ప్రధానంగా ఉండాల్సిన అవసరం ఉంది. అయిన నేటి సమాజంలో ఇప్పటికీ మహిళల పట్ల అసమానతలు అణచివేత కొనసాగుతూనే ఉంది. మహిళలు అన్ని రంగాల్లోకి ముందుకు రావాలంటే విద్య ఉద్యోగం వ్యాపారం రాజకీయాల్లో సరైన భాగస్వామ్యం అనేది తప్పనిసరి. సమాజంలో ఒక మహిళను బలపరిస్తే ఆమె ఒక కుటుంబాన్ని బలపరుస్తుంది ఒక కుటుంబం బలంగా ఉంటే సమాజం అభివృద్ధి చెందుతుంది అనే నినాదంతో మనందరం ముందుకు వెళ్ళినప్పుడే ఈ సమాజంతో ఆనందంగా ముందుకు వెళ్తుంది.

కుటుంబంతో పాటు సమాజ నిర్మాణం

నవతెలంగాణ-సిర్పూర్(టి)



మహిళలు కేవలం కుటుంబ వ్యవస్థను బలంగా నిలబెట్టేవారే కాదు, సమాజ నిర్మాణం, శాస్త్రీయ పరిశోధనల్లో, విద్య, వైద్యం, రాజకీయాలు, వ్యాపారం, క్రీడలు, సంస్కృతి, సాహిత్య రంగాలలో అద్భుతమైన కీర్తి ప్రతిష్టలు సాధిస్తున్నారు.ప్రపంచాన్ని మధురతతో మోసుకెళ్లే మహిళలకు, ప్రేమ, పట్టుదల, కృషి, త్యాగంతో జీవితం రూపుదిద్దుకునే మహానుభావులకు శుభాకాంక్షలు తెలుపుతూనే మహిళ దినత్సోవం సందర్భంగా నవ తెలంగాణతో పశు వైద్యాధికారిణి డాక్టర్ భవిత మాట్లాడారు. ప్రతిభ, సహనం, బలమైన సంకల్పం ప్రపంచాన్ని కొత్త దిశగా నడిపించగల శక్తిని కలిగి మహిళ ఉంది. ఈ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలకు గౌరవాన్ని, సమాన అవకాశాలను కల్పించేందుకు కృషి చేద్దామన్నారు. సమాజం పురోగమించాలంటే మహిళల అభివృద్ధి అవసరం. "మహిళా శక్తి - దేశ పురోగతి" అనే సత్యాన్ని గుర్తుంచుకోవాలి. సమాజంలో మహిళల హక్కులను రక్షించడం, వారికి స్వేచ్ఛ, గౌరవం, విద్యా అవకాశాలు కల్పించడం అందరి బాధ్యత. ఒక్కరోజు మాత్రమే కాదు ప్రతి రోజూ మహిళా శక్తిని సన్మానించాలి.

c m y k